V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
14-12-2024
సంపుటి : 01 । సంచిక : 222 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD



# జైలులోనే పుష్పరాజ్
## నేడు విడుదల

- నాటకీయ పరిణామాల మధ్య అల్లు అర్జున్ అరెస్ట్
- కోర్టుల్లోవాదోపవాదాలు, తీర్పులతో
- కొన్ని గంటలపాటు నరాలు తెగే ఉత్కంఠ
- జైలులో అడుగుపెట్టగానే మధ్యంతర బెయిల్ మంజూరు
- అల్లు అర్జున్ అరెస్టుపై స్పందించిన రైల్వే మంత్రి
- అల్లు అరవింద్‌కు ఏపీ సీఎం చంద్రబాబు ఫోన్
- కేసు విత్‌డ్రా చేసుకుంటాను:మృతురాలు భర్త

**విశ్వంభర, హైదరాబాద్:** నటుడు అల్లు అర్జున్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ శుక్రవారం రాత్రి జైలులోనే ఉన్నారు. శనివారం ఆయన జైలు నుంచి విడుదల కానున్నారు. జైలు అధికారులు ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. బెయిల్ ఉత్తర్వుల కాపీ చంచల్‌గూడ జైలు అధికారులకు ఆలస్యంగా చేరడం వల్లే అల్లు అర్జున్ విడుదలపై అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ జైలులోని మంజీరా బ్యారక్‌లో ఉన్నారు. ఆయన కోసం జైలు సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అంతకు ముందు అల్లు అర్జున్ విడుదల కోసం న్యాయవాదులు మిగతా10లో...



## అల్లు అర్జున్ హంగామా చేయకపోతే..
### ఈ గొడవ అయ్యేదే కాదు: సీఎం రేవంత్‌రెడ్డి 10

- అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అందరికీ సమానంగా వర్తిస్తుంది
- అతడు సినిమా స్టారా? పొలిటికల్ స్టారా? అన్నది మా ప్రభుత్వం చూడదు
- నేరం ఎవరు చేశారన్న దాన్నే చూస్తాం: ముఖ్యమంత్రి

## భారత్ అంటేనే పవిత్ర స్థలాలకు
# పుట్టినిల్లు
### మహాకుంభ మేళాలో తొలిసారి ఏఐ, చాట్‌బాట్ సేవలు



- ఈ ప్రయాగ్‌రాజ్ భూమిపై కొత్త చరిత్ర సృష్టించబోతోంది
- ఈ వేడుకను ప్రపంచ దేశాలు చర్చించుకునే మహా యజ్ఞంగా నిర్వహిస్తాం: నరేంద్ర మోదీ

**ప్రయాగ్‌రాజ్:** అతిపెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనమైన మహా కుంభమేళా ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో వచ్చే ఏడాది జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ మహా కుంభమేళాకు సంబంధించి పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ ఉత్సవాల్లో తొలిసారి ఏఐ, మిగతా2లో...




## స్వర్ణాంధ్ర విజన్ 2047..
# రాష్ట్ర దశ, దిశను మారుస్తుంది

- సరికొత్త చరిత్రకు విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ నాంది
- తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ 1గా నిలవాలి
- దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలవాలి
- విజన్ డాక్యుమెంట్ కోసం 17 లక్షల మంది తమ ఆలోచనలు పంచుకున్నారు
- సంస్కరణల ద్వారానే ప్రజల జీవితాల్లో మార్పు: చంద్రబాబు

**విశ్వంభర, విజయవాడ:** స్వర్ణాంధ్ర విజన్ 2047.. రాష్ట్ర దశ, దిశను మారుస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలో స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డాక్యుమెంట్ ఆవిష్కరణ సరికొత్త చరిత్రకు నాంది అన్నారు. వైసీపీ హయాంలో ఊహించిన దానికంటే ఎక్కువ విధ్వంసం జరిగిందని చెప్పారు. పరిపాలన ప్రారంభించిన 6 నెలల్లోనే విజన్ డాక్యుమెంట్ మిగతా2లో...

## కెనడాలో ముగ్గురు భారతీయ విద్యార్థుల హత్య

- స్పందించిన విదేశాంగ శాఖ
- పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం
- భారత పౌరుల రక్షణే కేంద్రానికి తొలి ప్రాధాన్యం
- విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్



2



## 'ఇది సంవిధాన్.. సంఘ్ బుక్ కాదు'

- బీజేపీ ఎల్లప్పుడూ గతం గురించే మాట్లాడుతుంది
- దేశ ప్రగతి కోసం ఇప్పుడేం చేస్తున్నారో వారు మాట్లాడాలి
- లోక్‌సభలో ప్రియాంక గాంధీ తొలి ప్రసంగం

2

## గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక

- డిసెంబర్ 14 నుంచి 20 వరకు తెలంగాణలో విద్యుత్ పొదుపు వేడుకలు
- విద్యుత్ సంరక్షణ మీద విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు ఎనర్జీ క్లబ్‌లుః భట్టి విక్రమార్క
- విద్యుత్ పొదుపు క్యాలెండర్-2025 ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం



2



2

## ఎర్రకోటను తమకు అప్పగించాలని మొఘల్ వారసుల పిటిషన్!

- తమ పూర్వీకులు నిర్మించారు.. తమకు ఇచ్చేయాలి
- బ్రిటిషు వారు స్వాధీనం చేసుకున్న 150 ఏళ్ల తర్వాత కోర్టును ఆశ్రయించడాన్ని తప్పుపట్టిన బెంచ్
- కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

## అర్బన్ ఫారెస్ట్ పార్కులకూ మెరుగైన సౌకర్యాలు




- సందర్శకుల సంఖ్య పెరిగేలా చర్యలు
- అటవీ శాఖకు ఆదాయం సమకూరేలా పకడ్బందీ ప్రణాళికలు అమలు చేయాలి
- మంత్రి కొండా సురేఖ

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 91 | రిటైల్ ₹ 113 |
| స్కిన్ ₹ 164 | స్కిన్ లెస్ ₹ 186 |

## ధాన్యం దారి మళ్లితే ఏమాత్రం ఉపేక్షించం

- ఖరీఫ్‌లో ఇలాంటి సంఘటనలు ఉత్పన్నమైతే కఠినచర్యలు
- ధాన్యం నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ద్వారా స్పెషల్ డ్రైవ్
- పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్

2



## ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు జీవో

- దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి విగ్రహాలు పెట్టుకుంటామని.. జీవో ఇస్తేనే అవి పెడతామా ?
- అధికార పార్టీది తెలంగాణ వాదం కాదు.. కాంగ్రెస్ వాదం
- వాళ్లకు పార్టీ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవు: ఎమ్మెల్సీ కవిత

2



## వెనుకబడిన జిల్లాలకు
# ₹1,800 కోట్లు విడుదల చేయండి

### ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లు ఏపీ నుంచి ఇప్పించండి

- ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల నిధుల వసూలు ఉత్తర్వులు ఉపసంహరించుకోండి
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

**ఢిల్లీ:** రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంటును వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో పార్లమెంట్‌లోని ఆమె ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మిగతా2లో...

# ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు జీవో

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవమైన బతుకమ్మను అవమానిస్తూ, కించపరుచుతూ మాట్లాడిన మంత్రులు, కాంగ్రెస్ నాయకులకు ఏం శిక్ష వేస్తారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో సమైక్యాంధ్రను కోరుకున్న కాంగ్రెస్ నాయకులు ఎత్తుకున్న వాదనలను ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కొనసాగిస్తున్నారని విమర్శించారు. వాళ్లు కాంగ్రెస్ వాదులు... తెలంగాణవాదులు కాదన్నారు . వాళ్లకు ఎప్పుడూ కాంగ్రెస్ ప్రయోజనాలే ముఖ్యం తప్పా తెలంగాణ ప్రయోజనాలు ముఖ్యం కాదని అని స్పష్టం చేశారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... ఇందిరా గాంధీ, సోనియా గాంధీ బతుకమ్మ ఎత్తుకొని తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారని, ఎన్నికల సమయంలో ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీ బతుకమ్మ ఎత్తుకొని శుభాకాంక్షలు చెప్పారని గుర్తు చేశారు. 1978లో వరంగల్ మహిళలతో కలిసి ఇందిరా గాంధీ బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనడం ఒక మధుర స్మృతి అని ప్రియాంకా గాంధీ ట్వీట్ చేశారని చెప్పారు. భారత్ జోడో యాత్రతో తెలంగాణకు వచ్చిన రాహుల్ గాంధీ... రేవంత్ రెడ్డితో పాటు ఇతర నాయకులతో కలిసి బతుకమ్మ ఆడారని చెప్పారు. అంటే.. ఓట్లు ఉన్నప్పుడు మాత్రం కాంగ్రెస్ నాయకులకు బతుకమ్మ గుర్తుకొస్తుందని, ఓట్ల కోసం ఎన్ని ఆటలైనా ఆడుతారని విమర్శించారు. ఓట్ల అయిపోయిన తర్వాత బతుకమ్మ ఎవరిదని, తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మ ఎందుకు ఉండాలని కాంగ్రెస్ నాయకులు వెర్రి ప్రశ్నలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలని సూచించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించారని, మరి రాష్ట్ర పండుగను అవమానించే విధంగా మాట్లాడుతున్న మంత్రుల, కాంగ్రెస్ పార్టీ నాయకులపై



ఏం చర్యలు తీసుకుంటారో, ఏం శిక్ష వేస్తారో చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆంబోతులను వదిలిట్లు తెలంగాణ ఆడబిడ్డలపై మాట్లాడడానికి మంత్రులను, కాంగ్రెస్ నాయకులను వదిలిపెట్టారా అన్నది ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. బతుకమ్మను తాము విశ్వవ్యాప్తం చేసే ప్రయత్నం చేస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని మరుగున పడేసే ప్రయత్నం చేస్తున్నదని అన్నారు.
అసలు తెలంగాణ తల్లి రూపాన్ని ఎలా మారుస్తారని ఆమె ప్రశ్నించారు. ఇవాళ దేశంలో అనేక విగ్రహాలు దేశంలో ఉన్నాయి. మహాత్మా గాంధీ, అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, పూలే, సేవాలాల్ మహారాజ్, శివాజీ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, భరతమాత వంటి విగ్రహాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఎందుకు పెట్టున్నారు వాటిని ? గౌరవం ఉంది కాబట్టి పెట్టుకున్నారు కానీ ఎవరో జీవో ఇచ్చారని కాదు కదా అన్నారు . అలాగే, తెలంగాణ విగ్రహాలు కూడా తెలంగాణ వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నాయి. ఆ నాడు ఉద్యమంలో స్ఫూర్తి నింపిన తల్లి కాబట్టి ఆ విగ్రహాలు పెట్టుకున్నాం. దేశంలో భరతమాత విగ్రహాలకు కేంద్ర ప్రభుత్వం జీవో ఇచ్చిందా ? మరి తెలంగాణలో మాత్రం కొత్త విగ్రహాన్ని పెట్టి ఈమెనె మీ తల్లి, ఎవరైనా ఇదే విగ్రహం పెట్టాలి... వేరే విగ్రహం పెడితే కేసులు పెడుతామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గెజిట్ చేసింది. బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఎన్నడూ భరతమాతపై గెజిట్ ఇవ్వలేదు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లిపై గెజిట్ ఇవ్వడం చాలా దారుణం ఘోరతి ఘోరమైన విషయం అని వ్యాఖ్యానించారు. ఎన్ని జీవోలు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా ఊరూరా ఊరేగించి మరీ మా ఉద్యమ తల్లిని నిలుపుకుంటామని తేల్చిచెప్పారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేల సంఖ్యలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించుకుంటామని ప్రకటించారు.తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడానికి ప్రజల ఆమోదం ఉన్నట్లయితే జీవోతో పనేముందని అడిగారు. కేసులు పెడుతామని బెదిరించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఎందుకింత పిరికితనమని ఆమె నిలదీశారు. విగ్రహాన్ని కూడా రహస్యంగా తయారు చేయించారని విమర్శించారు. అంత రహస్యంగా విగ్రహాన్ని రూపొందించడానికి ఇదేమైనా ఫ్యూడల్ వ్యవస్థనా, నాజీ ప్రభుత్వమా అని ప్రశ్నించారు . ప్రభుత్వ వేడుకల్లో పాడుతున్న పాటలు చూస్తే కన్నీళ్లు వచ్చే పరిస్థితి ఉందని, తెలంగాణకు సంబంధం లేని పాటలు పాడుతున్నారని, తెలంగాణలో ఎంతో మంది జానపద కళాకారులు ఉంటే... ఒక్క కళాకారుడు కూడా పాట పాడడానికి దొరకలేదా ? పాడడానికి ఒక్క తెలంగాణ పాట దొరకలేదా అని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అధికారిక చిహ్నం నుంచి చార్మినార్ ను, కాకతీయ కళాతోరణాన్ని తొలగించే ప్రయత్నం చేశారని, కానీ ఎవరు బుద్ధి చెప్పారో ఆ ఆలోచనను విరమించుకున్నట్లు కనిపిస్తోందని వివరించారు.కేసీఆర్ ది విశాలతత్వమని, రేవంత్ రెడ్డిని సంకుచితత్వం. అబద్దాలు చెప్పడంలో సీఎం రేవంత్ రెడ్డి గోబెల్స్ ను మించిపోయారని అన్నారు. చరిత్రలో కొన్ని నల్ల పేజీలు మాత్రం రేవంత్ రెడ్డి పేరు మీద రాయబడుతాయని స్పష్టం చేశారు.
అలాగే, నీళ్ల కోసం పోరాటం చేసిన తెలంగాణలో... ఏపీకి అక్రమంగా నీళ్లు మళ్లించడానికి జీవోలు జారీ చేసిన అధికారిని సలహాదారుగా నియమించుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా రోజుకో టీఎంసీ నీటికి కృష్ణా నది నుంచి ఎత్తిపోయడానికి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న కాలంలో ఆదిత్యానాథ్ దాస్ జీవోలు జారీ చేశారని, అలాంటి వ్యక్తిని తెలంగాణ సాగునీటిపారుదల శాఖ సలహాదారుగా నియమించారంటే.. ఎవరి ప్రయోజనాలను కోరుకొని నియమించారని ప్రశ్నించారు.

# ఎర్రకోటను తమకు అప్పగించాలని మొఘల్ వారసుల పిటిషన్..!

**ఢిల్లీ:** ఎర్రకోటను భారత ప్రభుత్వం తమకు అప్పగించాలని మొఘల్ వారసులు వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఎర్ర కోటను తమ పూర్వీకులు నిర్మించారని.. దానిని తమకు ఇచ్చేయాలని మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-II ముని మనవడి భార్య సుల్తానా బేగం ఢిల్లీ హైకోర్టులో 2021లో పిటిషన్ వేశారు. గతంలో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ తమ పూర్వీకుల నుంచి అక్రమంగా తీసుకున్న ఎర్రకోటను తమకు అప్పగించాలని అందులో పేర్కొన్నారు. కాగా ఈ విషయమై రెండున్నరేళ్ల అనంతరం మళ్లీ కోర్టుకు వెళ్లారు. మొదటి స్వాతంత్ర్య యుద్ధం తర్వాత మొఘలుల ఆస్తులు, కట్టడాలను(ఎర్రకోట) బ్రిటిష్ వారు ఆక్రమించుకున్నారని.. దాంతో దేశం విడిచి వెళ్లిపోయిన అప్పటి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్-II 1862 నవంబరు 11న మృతి చెందారని ఆమె పేర్కొన్నారు. వారు నిర్మించిన ఎర్రకోటను భారత ప్రభుత్వం ఆక్రమించుకుందన్నారు. తమ ఆస్తిని తిరిగి ఇప్పించాలని కోరారు. ప్రభుత్వం అప్పగించడానికి సిద్ధంగా లేకపోతే.. తమకు తగిన పరిహారం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. కాగా.. దానిపై విచారణ జరిపిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విభు బఖ్రు, జస్టిస్ తుషార్ రావు ధర్మాసనం ఆమె చేసిన అప్పీల్‌ను తోసిపుచ్చింది. బ్రిటిషు వారు స్వాధీనం చేసుకున్న 150 ఏళ్ల తర్వాత కోర్టును ఆశ్రయించడాన్ని బెంచ్ తప్పుబట్టింది. అప్పీల్ చేసుకోవడంలో జరిగిన విపరీత జాప్యం కారణంగా ఆమె పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపింది. 2021లో దీనిపై అప్పీల్ దాఖలు చేశానని.. తన కుమార్తె మరణం వల్ల తాను తీవ్రంగా కుంగిపోవడంతో మళ్లీ కోర్టును ఆశ్రయించలేకపోయానని సుల్తానా బేగం న్యాయస్థానానికి తెలియజేశారు.

# ధాన్యం దారి మళ్లితే ఏమాత్రం ఉపేక్షించం

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో ధాన్యం దారి మళ్లితే ఎంత మాత్రం ఉపేక్షించబోమని పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ హెచ్చరించారు. ఈ ఏడాది ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో అలాంటి సంఘటనలు ఉత్పన్నమైతే మాత్రం చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రైస్ మిల్లర్ల వద్దకు చేరిన ధాన్యం నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నాలుగు రోజుల వ్యవధిలోనే 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. అంతేగాకుండా పలువురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యహరిస్తుందని స్పష్టం చేశారు. ''ధాన్యం దారి మళ్లింపునకు అవకాశం ఉండబోదని రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తోపాటు ఆయా జిల్లాల అసోసియేషన్లు ప్రభుత్వానికి ఇప్పటికే హామీ ఇచ్చాయి. ధాన్యం మిల్లింగ్‌తోపాటు సీఎంఆర్ బియ్యం డెలివరీతో ఇటు కార్పొరేషన్ అటు మిల్లర్లు పరస్పరం లబ్ధి పొందవచ్చు. అయితే అందుకు భిన్నంగా కొందరు రైస్ మిల్లర్లు మాత్రం అవకతవకలకు పాల్పడుతూ దారి మళ్లిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైస్ మిల్లర్లు ఉత్తమ పనితీరు కనబరుస్తున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అక్రమాలకు పాల్పడే రైస్ మిల్లర్లపై ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుంది'' అని పేర్కొన్నారు.

# భారత్ అంటేనే పవిత్ర స్థలాలకు పుట్టినిల్లు

(మొదటి పేజీ తరువాయి)
చాట్‌బాట్ సేవలు వినియోగించుకోబోతున్నామని పేర్కొన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా రోబోటిక్ ఫైర్ టెండర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశప్రజలంతా తరలి రావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు నిర్వహించనున్న మహా కుంభమేళాకు ఏర్పాట్లు చేస్తున్న కార్మికులను, అధికారులను ప్రధాని అభినందించారు. "ఈ ప్రయాగ్‌రాజ్ భూమిపై కొత్త చరిత్ర సృష్టించబోతోంది. మహా కుంభమేళాతో దేశం సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకుంటుంది. ఈ వేడుకను ప్రపంచ దేశాలు చర్చించుకునే మహా యజ్ఞంగా నిర్వహిస్తాం. భారత్ అంటేనే పవిత్ర స్థలాలకు పుట్టినిల్లు'' అని ప్రధాని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో సిబ్బంది చేరుకోలేని ప్రాంతాలకు వెళ్లేందుకు మూడు రోబోటిక్ ఫైర్ టెండర్లను ఉపయోగిస్తారని.. ఈ రోబోలు మెట్లు ఎక్కడంతో పాటు మంటలను సైతం అదుపు చేస్తాయని అధికారులు పేర్కొన్నారు. దీంతోపాటు 35 మీటర్ల ఎత్తు నుంచి నీటిని స్ప్రే చేసే ఆర్టిక్యులేటింగ్ వాటర్ టవర్‌లు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అగ్నిమాపక సేవల కోసం గత కుంభమేళాకు రూ.6 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం దాన్ని రూ.67 కోట్లకు పెంచినట్లు తెలిపారు.

# అర్బన్ ఫారెస్ట్ పార్కులకూ మెరుగైన సౌకర్యాలు

**విశ్వంభర, హైదరాబాద్:** పర్యాటకులను ఆకర్షించే విధంగా రాష్ట్రంలోని అన్ని జూపార్కులతోపాటు అర్బన్ ఫారెస్ట్ పార్కులను మెరుగైన సౌకర్యాలతో తీర్చిదిద్దాలని అటవీ శాఖ అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. జూ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ 13వ గవర్నింగ్ బాడీ సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అటవీ అధికారులతో కలిసి యానిమల్ అడాప్షన్ స్కీమ్ బ్రోచర్, డైరీ, కాఫీ టేబుల్ బుక్‌ను మంత్రి ఆవిష్కరించారు.మంత్రి మాట్లాడుతూ.. జంతు ప్రదర్శనశాలల్లో సందర్శకుల అభిరుచుల మేరకు పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా అటవీ శాఖకు ఆదాయం సమకూరేలా పకడ్బందీ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా జూపార్కుల్లో అవలంబిస్తున్న విధానాలపై అధ్యయనం చేసి ఉత్తమ పద్ధతులు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న 9 జూ పార్కులతోపాటు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల అభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు.నెహ్రూ జూ పార్కు, కాకతీయ జూ పార్కు, పిల్లలమర్రి మినీ జూపార్కు, లోయర్ మానేరు డీర్ పార్కు, కిన్నెరసాని డీర్ పార్కులో జంతు సంరక్షణ చర్యలు, కేబీఆర్, మృగవని, మహావీర్ హరిణవనస్థలి, ఇతర అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సందర్శకుల సంఖ్య పెరిగేలా చర్యలు, అదనపు సౌకర్యాలపై మంత్రి అధికారులకు సూచనలు చేశారు. వర్షాల కారణంగా కేబీఆర్ పార్కు చుట్టూ ప్రహారీ 300 మీటర్లు దెబ్బతిన్నట్లు మంత్రి దృష్టికి తీసుకురాగా.. పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నెహ్రూ జూ పార్కులో ఖాళీల భర్తీ చేయాలని అధికారులు ప్రస్తావించగా.. అందుకు మంత్రి ఆమోదం తెలిపారు.

# స్వర్ణాంధ్ర విజన్ 2047.. రాష్ట్ర దశ, దిశను మారుస్తుంది

(మొదటి పేజీ తరువాయి)
రూపొందించామన్నారు. ''తెలుగుజాతి ప్రపంచంలోనే నంబర్ 1గా నిలవాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నాం. దేశంలోనే ఏపీ అగ్రగామిగా నిలవాలనే సంకల్పంతో ఉన్నాం. నేడు 3 వేల డాలర్ల కంటే తక్కువగా తలసరి ఆదాయం ఉంది. 2047 నాటికి 42 వేల డాలర్లకు తలసరి ఆదాయం పెరగాలన్నది లక్ష్యం. విజన్ డాక్యుమెంట్ కోసం 17 లక్షల మంది తమ ఆలోచనలు పంచుకున్నారు. సంస్కరణల ద్వారానే ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురాగలం.

# 'ఇది సంవిధాన్.. సంఘ్ బుక్ కాదు'

ఢిల్లీ: భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. ఇందులో విపక్షాల తరపున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చర్చను ప్రారంభించారు. ఎంపీగా ఇటీవలే పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆమె.. లోక్‌సభలో ప్రసంగం చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార బీజేపీ, ఆరెస్సెస్‌పై విమర్శలు చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ (ఆరెఎస్సెస్‌ను ఉద్దేశిస్తూ) బుక్ కాదని దుయ్యబట్టారు.

**అన్నిటికీ నెహ్రూనే కారణమా?**

''బీజేపీ ఎల్లప్పుడూ గతం గురించే మాట్లాడుతుంది. కానీ, దేశ ప్రగతి కోసం ఇప్పుడేం చేస్తున్నారో వారు మాట్లాడాలి. దేశంలో జరిగే అన్నిటికీ నెహ్రూనే కారణమా? నెహ్రూ పేరును, ఆయన ప్రసంగాలను మీరు పుస్తకాల నుంచి తొలగించగలరేమో.. కానీ, స్వతంత్ర్య పోరాటంలో, జాతి నిర్మాణంలో ఆయన పాత్రను చెరిపేయలేరు'' అని ప్రియాంక కౌంటర్ ఇచ్చారు.. ఈ సందర్భంగా 2017లో జరిగిన ఉన్నావ్ అత్యాచార ఘటనను ఆమె ప్రస్తావించారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు పోరాడే హక్కును రాజ్యాంగమే కల్పించిందన్నారు.

**అదానీ అంశంపైనా..**

ఈ సందర్భంగా అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ''ఒక్కరిని కాపాడటం కోసం 142 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. సంపద, రోడ్లు, పోర్టులు, గనులు అన్నీ ఆయనకే ఇస్తున్నారు'' అని మండిపడ్డారు. ప్రజల తరపున పోరాడే ప్రతిపక్షాల గళాన్ని అణచివేసేందుకు తప్పుడు కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి విపక్ష నేతలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

**రాజ్యాంగాన్ని మార్చేవారేమో..**

''ఇతర దేశాలతో పోలిస్తే మన స్వాతంత్ర్య పోరాటం ప్రత్యేకమైనది. సత్యం, అహింస అనే పునాదులపైనే మనం పోరాడాం. మన స్వాతంత్ర్య ఉద్యమం ప్రజాస్వామ్య గళం. దాన్నుంచి ఉద్భవించినదే రాజ్యాంగం. ఇది కేవలం డాక్యుమెంట్ కాదు.. అంబేద్కర్, మౌలానా ఆజాద్, రాజగోపాలచారి, నెహ్రూ వంటి ఎంతోమంది నేతలు ఎన్నో ఏళ్ల పాటు తమ జీవితాలను అంకితం చేసి దీన్ని రూపొందించారు. ప్రజా హక్కులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే శక్తిని రాజ్యాంగం మనకు కల్పించింది. ఇది దేశ ప్రజలను కాపాడే 'సురక్షా కవచం'లా ఉంది. అయితే దీన్ని బద్దలుకొట్టేందుకు అధికార ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. గత పదేళ్లలో ఈ రక్షణ కవచాన్ని బలహీనపర్చింది. లేట్రల్ ఎంట్రీ, ప్రైవేటీకరణ వంటి చర్యలతో రిజర్వేషన్లను బలహీనపర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని ఎన్డీయే భావించింది. అది జరగకపోవడంతో ఆ ప్రతిపాదనలపై వెనక్కి తగ్గింది. ఇది సంవిధాన్.. సంఘ్ రూల్ బుక్ కాదు'' అని కాంగ్రెస్ ఎంపీ దుయ్యబట్టారు. కులగణన జరగాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు.



# వెనుకబడిన జిల్లాలకు రూ.1,800 కోట్లు విడుదల చేయండి

(మొదటి పేజీ తరువాయి)
ఆయన వెనుకబడిన జిల్లాలకు కేంద్రం నుంచి రావల్సిన గ్రాంటుపై చర్చించారు. పునర్విభజన చట్టంలో తెలంగాణలోని తొమ్మిది జిల్లాలకు ఏటా రూ.450 కోట్ల చొప్పున గ్రాంటు విడుదలకు అంగీకరించారని ఆయన గుర్తు చేశారు. 2019-20, 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాలకు సంబంధించిన గ్రాంటును ఇప్పటి వరకు విడుదల చేయలేదని, నాలుగేళ్లకు కలిపి పెండింగ్‌లో ఉన్న రూ.1,800 కోట్ల గ్రాంటును వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.. రాష్ట్ర పునర్విభజన తర్వాత హైదరాబాద్‌లోని హైకోర్టు, రాజ్ భవన్, లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జ్యుడిషియల్ అకాడమీ సహా ఇతర ఉమ్మడి సంస్థల నిర్వహణను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. ఆయా సంస్థల విభజన పూర్తయ్యే వరకు నిర్వహణకు అయిన రూ.703.43 కోట్లను తెలంగాణ ప్రభుత్వమే భరించిందని.. అందులో ఆంధ్రప్రదేశ్ వాటా రూ.408.49 కోట్లను తెలంగాణకు చెల్లించాల్సి ఉందని సీఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ మొత్తం చెల్లింపునకు ఆంధ్రప్రదేశ్ సమ్మతి తెలిపిందని, కేంద్ర హోం శాఖ సైతం ఆ మొత్తం తెలంగాణకు చెల్లించాలని ఏపీకి లేఖలు రాసిందని సీఎం వివరించారు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్ ఆ మొత్తాన్ని తెలంగాణకు చెల్లించలేదని...ఆ రూ.408.49 కోట్లను వడ్డీతో సహా తెలంగాణకు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.
విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుంచి ఏకపక్షంగా రూ.2,547.07 కోట్ల రికవరీకి కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఆదేశాలు ఇచ్చిందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తీవ్ర నిరసన తెలిపినా పట్టించుకోలేదని, ఈ విషయంపై మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన నిధులన్నింటిని 2014-15లో కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కేంద్ర ప్రభుత్వం కేటాయించిన విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పునర్విభజన చట్టంలోని జనాభా ప్రాతిపదికన ఆ మొత్తంలో ఏపీ నుంచి తెలంగాణకు రూ.495.20 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. అకౌంటెంట్ జనరల్, ఆంధ్రప్రదేశ్‌కు తాము పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆ మొత్తాన్ని తెలంగాణకు సర్దుబాటు చేయడం లేదని, ఈ విషయంలో జోక్యం చేసుకొని తెలంగాణకు రావల్సిన నిధులు ఇప్పించాలని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ భేటీ లో చామల కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, బలరాం నాయక్, ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పాల్గొన్నారు.

# గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. డిసెంబర్ 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా.. తెలంగాణలో విద్యుత్ పొదుపు వేడుకలు జరగనున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పత్తి విద్యుత్ అభివృద్ధి సంస్థ అధికారులు రూపొందించిన విద్యుత్ పొదుపు క్యాలెండర్-2025ను శుక్రవారం ప్రగతిభవన్‌లో డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు.''2035 నాటికి 40 గిగావాట్ల పునరుత్పత్తి విద్యుత్ స్థాపన లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తోంది. విద్యుత్ పొదుపు, విద్యుత్ సమర్థత సాధనకు అన్ని రంగాల్లో టెక్నాలజీ ఆధారిత చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ సంరక్షణ మీద విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు 168 ఎనర్జీ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ అమలులో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ ఉంది. మూడుసార్లు జాతీయ విద్యుత్ పొదుపు అవార్డులు తెలంగాణ అందుకుంది'' అని భట్టి వెల్లడించారు.

# కెనడాలో ముగ్గురు భారతీయ విద్యార్థుల హత్య..

**ఢిల్లీ:** కెనడాలో ఇటీవల ముగ్గురు భారతీయ విద్యార్థులు హత్యకు గురికావడంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు కేంద్రం తరపున ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా విదేశాంగశాఖ చర్యలు తీసుకుంటోందని.. ఒట్టావాలోని భారత హై కమిషన్‌తోపాటు, టొరంటో, వాంకోవర్‌లలోని కాన్సులేట్‌లను ఇప్పటికే అప్రమత్తం చేశామని పేర్కొంది. భారతీయులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అక్కడి అధికార యంత్రాంగంతో చర్చలు జరుపుతున్నామని, విదేశాల్లో ఉన్న భారత పౌరుల రక్షణే కేంద్రానికి తొలి ప్రాధాన్యమని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. కెనడాలోని భారతీయులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఇదిలా ఉంటే, అధికారిక గణాంకాల ప్రకారం, కెనడాలో దాదాపు 4 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు.

# సంగారెడ్డి జిల్లాలో భారీగా డ్రగ్స్ పట్టివేత

- **లారీలో తరలిస్తుండగా స్వాధీనం**
- **పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.100 కోట్లు ఉంటుందని సమాచారం**

**విశ్వంభర, జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లాలో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. మొగుడంపల్లి మండలం మాడిగి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో అధికారులు ఈ సోదాలు చేశారు. డీఆర్ఐ, నార్కొటిక్ డ్రగ్స్ కంట్రోల్, సెంట్రల్ విజిలెన్స్ బృందాలు ఇందులో పాల్గొన్నాయి. లారీలో తరలిస్తుండగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. పట్టుబడిన మాదక ద్రవ్యాల విలువ రూ.100 కోట్లు ఉంటుందని సమాచారం. వీటిని ఏపీలోని కాకినాడ పోర్టు నుంచి ముంబయి తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీని చిరాగ్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు.








# లయన్స్ క్లబ్ ప్రతిష్ట పెంచేలా సేవా కార్యక్రమాలు చేస్తాం

ప్రెసిడెంట్ గా ప్రమాణ స్వీకారం చేసిన డా.కాచం సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పదవితో నాపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ క్లబ్ ద్వారా సేవలు మరింత విస్తృతపరుస్తామన్నారు. సమాజంలో లయన్స్‌క్లబ్ సేవలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సేవా కార్యక్రమాలు మారుమూల ప్రాంతాలకు అందినపుడే సేవాతత్పరతకు సార్థకత చేకూరుతుందన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యవర్గం ఈ ఏడాది విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టి అన్ని క్లబ్‌లకు మార్గదర్శకంగా ఉంచుమన్నారు. సమాజ హితమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని, పేద, బడుగు, బలహీన వర్గాలకు నూతనంగా ఏర్పడ్డ లయన్స్ క్లబ్ ఆఫ్ కాచం ద్వారా సేవలందిస్తామన్నారు. లయన్స్ క్లబ్ ప్రతిష్ట పెంచేలా నూతనోత్సహంతో సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. మన సమాజంలో ఆపదలో ఉన్న పొరుగువారికి సహకారం అందించాలనే సదాశయంతో లయన్స్ క్లబ్ ఉంటుందన్నారు. 'మేము సేవ చేస్తాం'. అనే నినాదంతో సమాజములో విభిన్న జాతులు మతాలు, సాంప్రదాయలు కలిగియున్న ప్రజల మధ్య స్నేహ పూర్వక వాతావరణాన్ని కలిగిస్తూ అవసరార్థులను అవసరమైన సమయంలో ఆదుకొంటు, ప్రపంచములోని అతిపెద్ద సభ్యులను కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థగా లయన్స్ క్లబ్ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా వివిధ లయన్స్ క్లబ్స్ సమాజానికి పలు సామాజిక సేవలు అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. సమాజంలో మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, నిరక్షరాస్యత, తదితర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. సమాజ హితమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని పేద, బడుగు, బలహీన వర్గాలకు ఎప్పుడూ లయన్స్ క్లబ్ సేవలందిస్తుందన్నారు.

## ఘనంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కాచం సభ్యుల ప్రమాణ స్వీకారం..

## 25మంది సభ్యులతో చార్టర్ ఏర్పాటు

## ప్రెసిడెంట్ గా డా.కాచం సత్యనారాయణ, సెక్రటరీగా శ్రీనివాసులు

**విశ్వంభర, కర్మన్ ఘాట్:**

లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 ఏ, రీజియన్ 3, జోన్ 1 , 2024 - 2025 ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కాచం, చార్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమం లక్ష్మి కన్వెన్షన్ మందమ్మల్లమ్మ ఎక్స్ రోడ్ కర్మన్ ఘాట్లో ఘనంగా నిర్వహించారు.ఈ చార్టర్ ప్రెసిడెంట్ గా డా. కాచం సత్యనారాయణ ఎంజేఎఫ్ గా ప్రమాణ స్వీకారం చేశారు.మొత్తం 25 మంది సభ్యులతో చార్టర్ ను ఏర్పాటు చేశారు.

ప్రమాణ స్వీకారం చేసినవారిలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కాచం ప్రెసిడెంట్ గా డాక్టర్ కాచం సత్యనారాయణ, సెక్రెటరీ శ్రీనివాసులు వెంకటాపురం, ట్రెజరర్ ఇరుగు శ్రీధర్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ నంగునూరు రమేష్, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ గూడపాటి శరత్, ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ కొదుమూరి దయాకర్ రావు, మెంబర్షిప్ చైర్ పర్సన్ కూరా రమేష్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, బొర్రా అరుణ్ అంబేద్కర్, ఎర్రమాద కృష్ణారెడ్డి, మందడి భరత్ రెడ్డి,



ఠాకూర్ లోకేశ్వర్ సింగ్, పోసి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పిఆర్ ఓ చిన్నోజు విద్యాసాగర్, అడ్మినిస్ట్రేటర్ కాసం ఏక సాయి, టెల్ ట్విస్టర్ దాము మహేందర్ యాదవ్, టేమర్ మేడికొండ పరమేష్, శ్రీకాకొల్ల రాజు, షేక్ లెనిన్ పాషా, సామల రాఘవేందర్ రెడ్డి, మాదగోని అరుణ్ గౌడ్, బంధు ముత్తి రాములు, డాక్టర్ అగీర్ కార్తీక్, మందుల మధు, మహంకాళి చంద్రమౌళి, ముచ్చర్ల గంగాధర్లు ఉన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో డిస్ట్రిక్ట్ గవర్నర్, డిస్ట్రిక్ట్ 320 ఏ, పిఎంజెఎఫ్ లయన్ డా. డి కోటేశ్వర రావు మాట్లాడుతూ మంచి మిత్రుడు మా అన్న కాచం సత్యనారాయణ చాలా సీనియర్ లీడర్ నాతో పాటు పక్కన కూర్చొనే స్థాయి ఉన్న నాయకుడు, తెలంగాణ సమాజంలో మీరు చేస్తున్న సేవలకు గాను ఈ లయన్స్ చాలా చిన్నది . ఇప్పటికే గవర్నర్ అర్హతలు ఉన్న వ్యక్తి , భవిషత్తులో లయన్స్ క్లబ్ లో సీనియర్ కావాలనే కోరుకుంటున్నఈ సంవత్సరం 320 a చాలా మంచి పొసిషన్ లో ఉంది.ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, డిస్ట్రిక్ట్ 320 ఏ, పిఎంజెఎఫ్ లయన్ డా. జి మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ చాలా సంతోషం ఇలా ఉన్నామంటే కాచం సత్యనారాయణ ఎఫర్ట్స్ లయన్ ఇజం లో కొనసాగాలనే కోరిక అభినందించిన విషయమే ఇలాంటి వారు మన అసోసియేషన్ కి చాల అవసరం , సమాజం లో చాలా తెలిసినవారు. సమాజం పట్ల ఎంతో బాధ్యత కలిగిన వారు, వారు ఇలాంటి మంచి క్లబ్ ను తీసుకురావడం చాల సంతోషం లయన్స్ క్లబ్ ఒఫ్ హైదరాబాద్ కాచం, అనే క్లబ్ ను తీసుకొని రావడం సభాముఖంగా అభినందిస్తున్నాంమన్నారు.
























# ఆజన్మాంతం రాజీ ఎరగని పోరాట యోధుడు

# మాకినేని బసవపున్నయ్య

## నేడు ఆయన జయంతి



భారత దేశంలో ప్రముఖ కమ్యూనిస్టు నేతల్లో మాకినేని బసవ పున్నయ్య ఒకరు. విద్యార్థి సంఘం నేతగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానంలో తొలుత కాంగ్రెస్ లోనే ఓనమాలు దిద్దుకున్నారు.

అనంతరం కమ్యూనిస్టు భావాలు ఆకర్షించడంతో సీపీఐలో చేరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని అనంతరం సీపీఎం ఆవిర్భా వంలో కీలక పాత్ర పోషించారు. ఆ క్రమంలో ఆయన అంతర్జాతీయ స్థాయి కమ్యూనిస్టు నేతలైన స్టాలిన్, మాలటోవ్, సుస్లోవ్, మాలెంకోవ్‌లతో చర్చలు జరిపారు. అలాగే చైనా కమ్యూనిస్టు దిగ్గజాలు మావోసేటుంగ్, చౌఎన్‌లై తోనూ పున్నయ్య సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారు. 1952 నుంచి 1966 వరకు రాజ్యసభ సభ్యునిగా పని చేశారు. కార్ల్‌మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలకు కట్టుబడి, జీవితాంతం రాజీ ఎరగని పోరాట యోధునిగా నిలిచి పోయారు. కామ్రేడ్ బసవ పున్నయ్య రేపల్లె మండం తూర్పుపాలెం లోని భూస్వామ్య కుటుంబంలో 1914 డిసెంబరు 14న జన్మించారు. తల్లి దండ్రులు చారుమతి, అప్పయ్య. భార్య జగదాంబ. ప్రారంభంలో సాంప్రదాయ విద్య, అనంతరం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదివి, బందరు నోబుల్ కళాశాలో ఇంటర్మీడియట్, గుంటూరు ఎ.సి. కాలేజీలో బి.ఎ.పూర్తి చేశారు. 1930లో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగించిన నాటి తరం నేతలతో కలిసి పనిచేసి అనుభవాలను పంచుకున్నారు. ఆనాడు కాంగ్రెస్ నాయకత్వం ఉద్యమాన్ని తాత్కాలికంగా రద్దు చేయటంతో అసంతృప్తి చెంది బసవ పున్నయ్య ప్రజల సమస్యలు సోషలిస్టు వ్యవస్థలో మాత్రమే పరిష్కారం కాగవన్న విశ్వాసంతో 1934 -35లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. గుంటూరులో జరిగిన విద్యార్థుల సమ్మెకు నాయకత్వం వహించి, సహ విద్యార్థులైన వై.వి.కృష్ణారావు, మాద నారాయణ స్వామి, మోటూరు హనుమంత రావు, లావు బాగంగాధర రావుతో కసి రాష్ట్రంలో బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించి, 1938లో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా, అదే సమ యంలో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ సహాయ కార్యదర్శిగా పని చేశారు. 1940లో గుంటూరు జిల్లా పార్టీ కార్యదర్శిగా బాధ్యతను స్వీకరించారు. 1943లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుగా ఎన్నికై నారు.1948లో కలకత్తాలో జరిగిన సి.పి.ఐ. ద్వితీయ మహాసభలో కేంద్ర కమిటికి ఎన్నికయ్యారు. 1964లో పార్టీ చీలిన తరువాత సి.పి.ఐ.(ఎం) పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆ స్థానంలో నాలుగు దశాబ్దాల పాటు తుదిశ్వాస విడిచే వరకూ కొనసాగారు.

మార్క్సిజం లెనినిజంకు చివరి వరకు కట్టుబడి ఉండి పీడిత ప్రజ విముక్తి కోసం విశిష్టమైన సేవందించారు. నిర్ధిష్ట పరిస్థితుల్లో నిర్దిష్ట విశ్లేషణను చేయగలిగిన మార్క్సిజం లెనినిజం అనే సజీవ సిద్ధాంత వ్యాప్తికి, భారతదేశ ప్రజ విముక్తికి గణనీయమైన సేవలందించారు. తెలంగాణ పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన నాయకులో కామ్రేడ్ మాకినేని ఒకరు. తెంగాణా సాయుధ పోరాటంలో కామ్రేడ్స్ సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు మొదలైన ప్రముఖులతో పాటు కీలక పాత్రను పున్నయ్య పోషించారు. తెలంగాణ పోరాట నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణ, ఆయుధాల కోనుగోలు, చేరవేతలో ప్రధాన భాధ్యత బసవ పున్నయ్యదే. సాయుధ పోరాటాన్ని విరమించి విప్లవ మార్గాన్ని చేపట్టటంలో సుందరయ్యతో పాటు బసవ పున్నయ్య సృజనాత్మక పాత్ర నిర్వహించారు. భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రగణ్యులైన నాయకులో ఒకరుగా ఎదిగారు. రహస్య జీవనం సాగించిన సందర్భం, ప్రభుత్వం దమన కాండకు ఎదురొడ్డి నిలిచి పోరాడిన అనుభవాల సాయంతో భారత దేశంలో విప్లవ సాధనకు అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడపై ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చర్చను ప్రారంభించిన వారిలో ఒకరిగా, సిపిఎం విప్లవకర వ్యూహ్యాన్ని చేపట్టడంలో కామ్రేడ్ బసవ పున్నయ్య కీలక పాత్రధారి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో సిద్ధాంత పరంగా తీవ్రస్థాయిలో చర్చ సాగిన కాలంలో ఈ అంశంపై అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నాయకులతో చర్చ జరిపే బాధ్యతను పార్టీ కేంద్రకమిటీ కామ్రేడ్ మాకినేనికి అప్పగించింది. మాస్కోలో 1957లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు పార్టీ మహా సభలకు వెళ్ళిన సి.పి.ఐ. ప్రతినిధి వర్గంలో ఆయన సభ్యులు. నాడు దేశంలోనూ, అంతర్జాతీయం గానూ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొం టున్న సమస్యపై మావోసేటుంగ్ తోనూ, లీషావ్‌చి నాయకత్వంలో వచ్చిన చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి బృందంతోనూ చర్చజరిపే అవకాశం కామ్రేడ్ ఆయనకు లభించింది. శాస్త్రీయమైన, విప్లవకర మార్క్సిజం లెనినిజం సిద్ధాతం పట్ల నిబద్ధతతో కూడిన దేశభక్తి ప్రపూర్ణుడు బసవ పున్నయ్య. భారత విప్లవ మార్గానికి స్వతంత్ర వ్యూహ లను, ఎత్తు గడలను అన్వేషించి ప్రజలకు విప్లవ మార్గాన్ని సూచిం చారు. విప్లవ సాధనకు వ్యూహాన్ని రూపొందించే వారు. పీడిత ప్రజల విముక్తి కోసం సైద్ధాంతికంగా, ఆచర ణాత్మకంగా గణనీయమైన కృషి చేస్తూనే పార్లమెంటేరియన్ గానూ రాణించారు. రాజ్యసభ సభ్యుడిగా 1952 నుంచి 1966 వరకు 14 ఏళ్లు కొనసాగారు. బసవ పున్నయ్య ఆరేళ్ల పాటు అజ్ఞాత వాసం సాగించారు. చైనా భారత్ యుద్ధం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను రెండుసార్లు జైల్లో పెట్టింది . చైనా భారత దేశాల మధ్య వివాదాన్ని సంప్రదింపులు, చర్చల ద్వారా మాత్రమే పరిష్క రించు కోవాలని, ఘర్షణ ద్వారా కాదని నొక్కి చెప్పారు. సి.పి.ఐ.(ఎం) ఆవిర్భావం నాటి నుంచి చని పోయే వరకూ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుగా పనిచేసిన కామ్రేడ్ మాకినేని పూర్వపు సోషలిస్టు దేశాల్లో సంభవించిన మార్పుకు సంబంధించి చేసిన సిద్ధాంత పరమైన సూత్రీకరణల్లో క్రియాశీక పాత్ర నిర్వహించారు. 1990లో సోవియట్ యూనియన్ కుప్ప కూలి, సోషలిష్టు సిద్ధాంతం పైనే దాడి కేంద్రీకరించ బడినా సడలని కమ్యునిస్టు విశ్వాసాన్ని నిలిపిన ధీరుడు బసవ పున్నయ్య. సి.పి.ఐ.(ఎం) అధికార పత్రిక పీపుల్స్ డెమోక్రసీ ఎడిటర్‌గా ఆయన 14 ఏళ్లు పనిచేశారు. సి.పి.ఐ.(ఎం) అభివృద్ధికి, దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి వయసుతో నిమిత్తం లేకుండా అవిశ్రాంతంగా కృషిచేశారు. మాకినేని నిరంతరం చదివేవారు, విస్తృతంగా రాసే వారు. కార్యకర్తలు, ఢిల్లీ కార్యా లయం సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం పని చేసేవారు. అందుకే ఆయన్ను అందరూ ఎంతో అభిమానించే వారు. జాతీయ, అంతర్జాతీయ సమస్యలు సైద్ధాంతిక, వ్యక్తిగత సమస్యపై చర్చించేందుకు అయన అందరికీ ఎల్పప్పుడూ అందుబాటులో ఉండేవారు. బసవ పున్నయ్య గొప్ప ఉపన్యాసకులు. సునిశితమైన రచయితగా అనేక సిద్ధాంత పత్రాలను రచించారు. ఆయనలో మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాత పరిజ్ఞానంతో పాటు అంతర్జా తీయత, దేశభక్తి, తెలుగు జాతీయత కలగలిపి ఉండేవి. విప్ల వోద్యమం కోసం కామ్రేడ్స్ సుంద రయ్య, రాజేశ్వరరావు మున్నగు వారితో సహా, తమ వ్యక్తిగత ఆస్తు లను అమ్మి పార్టీకి ఇచ్చినవారిలో కామ్రేడ్ బసవ పున్నయ్య ఒకరు. కామ్రేడ్ బసవ పున్నయ్య ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాయంలో పార్టీ పనిలో ఉంటూనే 1992 ఏప్రిల్ 12వ తేదీన మరణించారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# మానవతా పరిమళం గుభాళించే కవిత్వం..

# ఆమనిలో వెన్నెల కోయిల




> 'రేపటి మనిషి కోసం, రేపటి ఉజ్జ్వల ప్రతిభా వికాసంకోసం, మనిషి మనిషి తనాన్ని కోల్పోరాదని, సాటిమనిషి ఉనికిని మరచిపోరాదని, చేయిచేయి కలిపి, అవి ఏరూపంలో వున్నా మలిపేసి - ఒకే ఒక్క మానవ సంఘం ఒకే ఒక మానవాత్మగా మనగలగాలనీ మానవతావాద సారాంశం' అని ఇంద్రగంటి శ్రీకాంత శర్మ అన్నట్లు మనిషి పట్ల మనిషి తనం పట్ల ఒక ప్రత్యేక దృక్పథం కలిగిన కవి లింగంపల్లి రామచంద్ర. వీరి కవిత్వం నిండా మానవతా పరిమళమే గుభాళిస్తుంది.లోకంలో అంతకంతకు పెరిగిపోతున్న స్వార్థాన్ని చూసి కవి చెందిన ఆవేదన, మానవత్వపు ఆనవాళ్లు కరిగిపోతున్నాయనే ఆక్రోషం. లింగంపల్లి రామచంద్ర కవిత్వంలో కనిపిస్తుంది. "మనిషిలో ఆశలు బుసలు కొడుతున్నాయి. మానవత్వ చిరునామా దొరక్క లోకం నరకంగా మారిపోతుంది" వంటి కవిత్వ పాదాలు ఇందుకు నిదర్శనాలు.

మనిషి నా జెండా అని స్పష్టంగా తన కవిత్వ దృక్పథాన్ని ప్రకటించిన లింగంపల్లి రామచంద్ర. మనిషికి అద్భుతమైన నిర్వచనం చెప్పారు. "స్వర్గం కన్నా మానవత్వం మిన్న అని చాటేవాడు. మంచి గంధంలో పరిమళించేవాడు మనిషి పడిపోయిన ధర్మాన్ని నిలబెట్టేవాడు. ప్రగతికి ప్రాణం పోసేవాడు. జన జాగృతి కోసం తపించేవాడు మనిషి " అంటూ మనిషిలో ఉండవలసిన మంచి లక్షణాలను తన కవిత్వం ద్వారా లోకానికి చాటారు. అలాగే మరొక చోట

**"త్రికాల సంపుటి ఆవిష్కరిస్తే చరిత్ర**

మనిషిని జెండాగా ఎగరేస్తే చరిత్ర" అంటూ చరిత్రకు సరికొత్త భాష్యం చెప్పారు. నానాటికి కరువు అవుతున్న మనిషితనాన్ని గురించి ఈ కవి పదేపదే ఆవేదన చెందారు. ఈ కాలం అమ్ముడుపోయింది డబ్బులకి, కానుకలకి ఈ కాలం దాసోహం అంటుంది చెడుకి చీకటికి మనసునుండి మనిషిని తరివేసే సంస్కృతి పెరుగుతుంది" అంటూ 30 సంవత్సరాల క్రితమే తన ఆవేదనను ప్రకటించారు. కాలాన్ని చూసినప్పుడు లింగంపల్లి రామచంద్ర కవిత్వం ఎన్నడు కూడా ప్రాసంగీకతను కోల్పోలేదు అనిపిస్తుంది. సైదాంతిక నిబద్ధుడైన మనిషి తన జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్నా చివరకు విజయతీరాలను చేరతాడు అనే సానుకూల దృక్పథం ఈ కవికి ఉంది. " నువ్వు నమ్ముకున్న ఆశయాలు ఒక్కోమారు నిన్ను కాటేస్తాయి. అయినప్పటికీ నీవు శిఖరం లా ఉంటావు . పరిమళింప చేస్తావు రోజు బతుకుల్లో ఉగాదులను నిలబెడతావు... అంటూ మనిషిలో ఒక ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేస్తారు.

స్వార్థంతో అసూయతో ఎదుటివారిని నాశనం చేయాలని చూసేవారు ఎప్పటికైనా తామే చెడిపోతారని నిజాయితీగా జీవించిన వాళ్ళు తప్పకుండా చివరికి విజేతలవుతారని లింగంపల్లి రామచంద్ర గారి ప్రగాఢ విశ్వాసం

"మనల్ని కాటువేయాలనుకున్న వాళ్లు
మాంసపు ముద్దలుగా బండరాళ్ల మీద పడ్డారు
మనిషి నిజాయితీని ప్రసరిస్తే చాలు
బతుకు కొత్త పాళీ లా మరోచరిత్రను దించుతుంది
"ఈ మాటలు లింగంపల్లి రామచంద్ర గారి సానుకూల ఆలోచనా ధోరణికి నిదర్శనాలు. మానవతా స్పృహను పాఠకులలో రగిలించడానికి ఈ కవి తన కవిత్వం ద్వారా

"చిలికిన ఆత్మీయతలా
చిగురించిన మానవత్వంలా
మనిషి కోసం గుండెలు విచ్చుకుంటున్న మానవతలా
రావాలి నువ్వు మానవీయ స్పృహ కలిగిన మనుషులను ఆహ్వానిస్తున్నాడు .

పెరుగుతున్న నగరీకరణ, ఆధునికీకరణ ఫలితంగా బంధాలు అనుబంధాలు ఆత్మీయతలు కృత్రిమంగా మారుతున్న తరుణంలో అందరూ ఉన్నా ఒంటరిగా బతకవలసిన దుస్థితి నేటి సమాజంలో కనిపిస్తున్నది.

చుట్టూ మనుషులున్నా
ఎడారి మనస్సులు
చుట్టూ సముద్రాలున్నా
గొంతు దిగని ఉప్పు నీళ్లు అంటూ మనుషుల మనసులు బీడువారిపోయిన తనాన్ని తెగేసి చెప్పారు. ఇప్పటికైనా మేలుకొమ్మని మనిషికి పిలుపునిస్తున్నారు.

ఓయి మనిషి మళ్లీ అడుగుతున్నాను
రెండు అడుగులు వేయడానికి కాళ్లు ఇవ్వమని
నాలోని నన్ను చూసుకోవడానికి కళ్ళను ఇవ్వమని... ఈ వాక్యాల ద్వారా మనిషి తనను తాను ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన ఆవశ్యకతను తెలియచెప్పారు.

"నేను కవిని
మనిషిని నిలబెట్టే పాట రాస్తాను
నేను రవిని
మనసులోని చీకటిని తరిమేస్తాను" అంటూ సమాజంలో కవుల కర్తవ్యాన్ని గుర్తు చేశారు. మనిషితనాన్ని జాగృతం చేశారు. కవులు మానవతను వెదజల్లే బడుగులను రక్షించడానికి పూనుకోవాలని పిలుపు నిచ్చారు.

వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసే కవిత్వమిది. మనిషిని మంచిదారుల వైపు నడిపించే దిక్సూచి ఇది. ఎంతో శ్రమిస్తే తప్ప విజయం దరిచేరదని, కేవలం కలగన్నంత మాత్రాన విజయం చేకూరదని చెప్తూ

"బాట మీద అడుగులు పలకరించుకోవడం
అనుకున్నంత సులభం కాదు
శిఖరాన్ని చేరడం అంటే
ఎన్ని లోయల్ని మనసుతో చిమ్మివేయాలి?
ఎంత మట్టిని చేతులతో పారబోయాలి?
అప్పుడు అందుతుంది హరివిల్లు ద్వారాలు ఉన్న ఆనందవని" అనే కవిత్వ పాదాలను పరిశీలించినప్పుడు శ్రమ లేకుండా మనిషి దేనిని సాధించలేడనే స్పృహను కవి పాఠకులలో మేలుకొలుపుతున్నాడు.

"గతాన్ని తిడుతూ కూర్చోకు
వర్తమానాన్ని కళాత్మకంగా ఆవిష్కరించు
రేపటి సమాజాన్ని నిర్మించు " అనే మాటలు మనిషికి జీవన విలువలు నిర్దేశిస్తున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చిందని సంబర పడగానే సరిపోదోయి అని శ్రీశ్రీ అన్నట్లు జెండాలు ఎగిరేయగానే పాటలు పాడగానే సరిపోదని, సమాజంలోని అపసవ్య ధోరణలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకతను లింగంపల్లి రామచంద్ర గారు తన కవిత్వంలో నొక్కి చెప్పారు. మానవతావాదాన్ని నరనరానా జీర్ణించుకున్న ఈ కవి

'మానవతాదీపం వెలిగించే వాళ్ళకి
మమతల వారధి నిర్మించే వాళ్ళకి వందనం అంటూ వినమ్రంగా నమస్కరిస్తున్నాడు. రోజురోజుకీ అంతరిస్తున్న మానవీయ బంధాల పట్ల ఈ కవిఆవేదన ఈ కవిత్వంలో కనిపిస్తున్నది.

'మనిషిలోని దీపానికి నమస్కరించి
రుషిలోని మనీషిని ఆరాధించు
అప్పుడు ఎప్పుడూ గెలుస్తుంటావు
అజైయుడవై చరిత్రలో శోభిస్తుంటావు' నీ మాటలు లింగంపల్లి రామచంద్ర కవిత్వం పాఠకులకు ఇస్తున్న సందేశం.

'అనుబంధాల్ని అల్లించే పల్లె వీధులు
మానవ రుధిరంతో బొమ్మలు వేసుకుంటుంటే
రక్తానికి బదులు దేహంలో మద్యం ప్రవహిస్తుంటే
శిఖరాలు తలల వంచుకుంటున్నాయి' అనడం పల్లెల్లో సైతం మానవీయ బంధాలు పలుచవారిపోతున్న వైనంపై, మద్యం ఏరులై పారుతూ మనిషి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న విధాన్ని లింగంపల్లి రామచంద్ర గారు ఆవేదనతో చెప్పారు.

పసికందుల పైన, యువతుల పైన ఆకృత్యాలకు పాల్పడేవాడే ఆదర్శాలను వల్లిస్తున్న వైనాన్ని నిలదీశారు. మనిషిని మనిషిగా చూడాలని ఆకాంక్షించే ఈ కవి స్త్రీల పట్ల వివక్షను ప్రశ్నించారు వరకట్నం అత్యాచారాలు గృహ హింస మొదలైన స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలపై తన కలాన్ని ఝుళిపించారు.దానవ ప్రవృత్తి ఆగిపోవాలని, మానవ లోకం అవతరించాలని బలంగా ఆకాంక్షించారు. మనిషి తనను తాను మనిషిగా నిలబెట్టుకోవాలి తప్ప శాసనాలు మనిషిని మనిషిగా మార్చలేవని, చట్టాలు మానవతకు పట్టం కట్టలేవని తేల్చి చెప్పారు.

లింగంపల్లి రామచంద్ర గారి కవిత్వ ప్రధాన లక్ష్యం మానవత్వమే. అందుకే 'నా ఆశయాలు మానవతకు దేవళం కడుతుంటాయి 'అని అనగలిగారు.మనిషి తన లక్ష్యాన్ని ఎప్పుడూ విడనాడకూడదని ఉపదేశం ఇస్తూ

'మానవతను ధర పెంచే
ధర్మపథం వైదొలగకు ' అని విస్పష్టంగా చెప్పారు. మానవత్వానికి మూలం మనసు. మనసున్న వాడిని అగ్ని కూడా కాల్చలేదు. మనసును అమ్ముకునేవాణ్ణి వెన్నెల కూడా కాల్చివేస్తుందని అక్షర చిత్రాలు కవితలో తెలిపారు.

సమాజంలోని అపసవ్యాల పై ఆవేదన చెందుతూ
ఓ మనుషుల్లారా ఎక్కడున్నారు మీరు?
ఏ గోళాలలో నివసిస్తున్నారు?
అని ఆవేదనతో ప్రశ్నిస్తూ
'ఓ మనుషుల్లారా ఇకనైనా కదలిరండి
ఈ మలినాలను తొలగించడానికి
ఈ కల్మషాలను చిమ్మి వేయడానికి
ఓ స్వర్గ ధూళిని దానం చేయడానికి' అంటూ పిలుపునిస్తున్నారు.

సమాజంలో మానవీయ స్పృహను మేల్కొల్పడానికి కవిత్వాన్ని ఆయుధంగా చేసుకున్న లింగంపల్లి రామచంద్ర గారి కలం నుండి మరిన్ని కావ్యాలు జాలువారాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను.



- సాగర్ల సత్తయ్య
7989117415

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు

## సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు వెంకట్ రాములు



**విశ్వాంభర, పరిగి:** పరిగి మండల పరిధిలోని గడిసింగాపూర్ గ్రామంలో శుక్రవారం సర్వే ఆఫీసర్ ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్ రాములు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామని, ఇంటి స్థలం ఉన్న ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేదలందరికీ అందేలా చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంటారెడ్డి, వెంకటయ్య, ప్రవళిక, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించిన మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్




**విశ్వంభర, షాద్‌నగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లోని చటాన్ పల్లి లోని హనుమాన్ దేవాలయానికి, పోచమ్మ ఆలయానికి సీసీ కెమెరాలను మునిసిపల్ వైస్ ప్రెసిడెంట్ చేగురి రాజేందర్ రెడ్డి ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా షాద్ నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్, చేగురి రాజేందర్ రెడ్డి ని అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య, అర్జున్ లక్ష్మణ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 16 వ తేదీన జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న సీఎం కప్ 2024 లో భాగంగా జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ సెంటర్ నందు నిర్వహిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, పవర్ లిఫ్టింగ్ లో పాల్గొనే క్రీడాకారులు, తమ ఆధార్ కార్డ్ తీసుకొని డిసెంబర్ 16, 2024 ఉదయం 8:30 గంటలకు సిటీ స్టైల్ జిమ్ అంబేద్కర్ సెంటర్, భద్రాచలం లో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, జూనియర్ బాయ్స్ అండ్ జూనియర్ గర్ల్స్ వయస్సు ఇరవై మూడు సంవత్సరాల లోపు మాత్రమే కలిగి ఉండాలని సూచించారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులను ఈనెల 27 నుంచి జనవరి 2 వరకు జరిగే స్టేట్ కాంపిటీషన్ కు అర్హత సాధించగలరు.ఈ పోటీలలో పాల్గొనే పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం కలదు.అర్హత కలిగిన ప్రతి క్రీడాకారుడికి ప్రవేశం ఉచితం అని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

# సిరిగాయపల్లి గ్రామంలో రక్తదాన శిబిరం




**విశ్వంభర, పుడూరు:** పుడూరు మండల పరిధిలోని సిరిగాయపల్లి గ్రామంలో గ్రామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహావీర్ ఆసుపత్రి సౌజన్యంతో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పలువురు యువకులు రక్తం దానం చేసినట్లు మాజీ సర్పంచ్ కవిత వెంకట దాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల సేమియా వ్యాధిగ్రస్తులకు గర్భిణులకు, రోడ్డు ప్రమాద బాధితులకు రక్తం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివాజీ, ల్యాబ్ ఇన్చార్జ్ సురేష్, పీఆర్వో సుధాకర్, గ్రామస్తులు ప్రభాకర్, రాజేందర్, భిక్షపతి, చందు, సాయికుమార్, శ్రీనివాస్, ఆకాష్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితులకు వసుధ చేయూత



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** క్యాన్సర్ తో బాధపడుతున్న మహిళకు వసుధ ఫౌండేషన్ ఆర్థిక చేయూత నందించింది. పినపాక మండలం జానంపేట కు చెందిన దాట్ల ఉషారాణి క్యాన్సర్ తో బాధపడుతుండగా ఆర్థిక సహకారం అందించాలని వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజును ను సంప్రదించారు. ఈ క్రమంలో ఈ విషయాన్ని వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో బాధిత మహిళ కుమార్తె నీలిమకు పదివేల రూపాయల విలువైన చెక్కును భద్రాచలంలో క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు, భద్రాద్రి దేవస్థానం విశ్రాంత కార్యనిర్వహణాధికారి వేగేశ్న రామకృష్ణంరాజు అందించారు. ఆర్థిక సహాయం అందించిన వసుధ ఫౌండేషన్ కు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలి

- గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాలో గ్రూప్ 2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కే.వీరబ్రహ్మచారి, పరీక్షల ఆర్సిఓ డాక్టర్ బలరాంనాయక్, లతో కలిసి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ గ్రూప్ 2 పరీక్ష నిర్వహణ, బయోమెట్రిక్ విధానంపై చీఫ్ సూపరింటెండెంట్ లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు, డిపార్టుమెంటల్ అధికారులు, లోకల్, జాయింట్ రూట్ అధికారులు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రూప్2 పోస్టులకు గాను నాలుగు పేపర్ల వారీగా ఈ నెల 15న ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్ 1 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ 2 పరీక్ష, అలాగే 16న ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్ 3 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ 4 పరీక్ష జరగనుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 7470 మంది అభ్యర్థులు 21 పరీక్ష కేంద్రాల్లో ఈ గ్రూప్2 పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. అలాగే చీఫ్ సూపరింటెండెంట్ లు (21), డిపార్ట్మెంటల్ అధికారులు (24), అబ్జర్వర్ లు (23), ఫ్లయింగ్ స్క్వాడ్ లు (10) బయోమెట్రిక్ అధికారులు (55), ఐడెంటిఫికేషన్ అధికారులు (86), నాలుగు రూట్లలో నలుగురు లోకల్, జాయింట్ రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. వంద శాతం బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష హాల్లో పరీక్ష ప్రారంభానికి ముందే ఓఎంఆర్ షీట్ పై ఇన్విజిలేటర్ లు పరీక్షార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఓఎంఆర్ షీట్ లో అత్యంత జాగ్రత్తగా అభ్యర్థులు వారి వివరాలను కేటాయించిన ఆయా బ్లాకుల్లో తప్పులు లేకుండా నమోదు చేసేలా చూడాలని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి, మౌలిక వసతులను కల్పించాలని, నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, ఆర్టీసీ బస్సులు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్, సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్ష పేపర్లు, ఓఎంఆర్ షీట్ లను పకడ్బందీగా, తగిన జాగ్రత్త చర్యల నడుమ తప్పనిసరిగా ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సమయానుకూలంగా వ్యవహరించాలన్నారు.

ఇన్విజిలేటర్ లతో సమావేశాలను ఏర్పాటు చేయాలని, సెంటర్ లలో సీసీ కెమెరాల పని తీరును సరిచూసుకోవాలని, అభ్యర్థుల హాల్ టికెట్, గుర్తింపు పొందిన ప్రభుత్వ ఐడీ కార్డును సరిగా చూడాలని, నిర్దేశించిన రూట్ లలో మాత్రమే ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్ పత్రాలను తీసుకొని వెళ్ళాలని, పోలీసు బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్ లు, ఫ్లయింగ్ స్క్వాడ్ లు, రూట్ అధికారులు, అబ్జర్వర్ లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు.

అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కీలక సూచనలు:

అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్ సైట్ ద్వారా గ్రూప్2 హాల్ టికెట్ లను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్షార్థులు హాల్ టికెట్ ను ఏ4 సైజ్ పేపర్ లో కలర్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్ పై అభ్యర్థులు తమ తాజా పాస్ పోర్టు ఫోటోను అతికించాలన్నారు. డౌన్లోడ్ చేసిన హాల్ టికెట్ పై ఫోటో సరిగా ముద్రించి లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్ తో మూడు పాస్ పోర్టు ఫోటోలతో పాటు వెబ్ సైట్ లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్ కు అందించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసివేస్తామని, పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, అభరణాలు ధరించరాదని సూచించారు. పరీక్షార్థులు మెహిందీ, తాత్కాలిక టాటూలను వేసుకో వద్దని కోరారు.

# విద్యతోనే ముందడుగు

## అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో




**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా కలక్టరేట్లో ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 10వ తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నిర్వహించే జిల్లా వ్యాప్త ప్రేరణ కార్యక్రమనికి సంబంధించిన పోస్టర్లు, బ్యానరు, కరపత్రాలను విష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోనే ముందడుగు సాధ్యమని, విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, చదువు అనే నిచ్చెనతో ఎంత ఎత్తుకైనా ఎదగవచ్చునని 10 వ తరగతి విద్యార్థులు ఇటువంటి ప్రేరణ కార్యక్రమాలను సద్వినియోగపరుచుకోవాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ టోప్పో అన్నారు. కార్యక్రమ రూపకర్త సైకాలజిస్ట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల ఫలితాలను పెంపొందించుట కొరకు పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఉచితంగా ప్రేరణ సదస్సులు నిర్వహించనున్నామని, విద్యార్థులు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సుంకరనేని నాగవాణి, సభ్యులు డాక్టర్ డేవిడ్ వి ఎలియా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వీరమరణం పొందిన అమరులకు నివాళులు

## రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర



**విశ్వంభర, న్యూ ఢిల్లీ:** పాకిస్థాన్ ప్రేరేపిత తీవ్రవాదుల దాడిలో అసువులు బాసిన అమరవీరులకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఘనంగా నివాళులర్పించారు. పాకిస్థాన్ ఐఎస్ఐ ప్రేరేపిత తీవ్రవాదులు 2001లో సరిగ్గా ఇదే రోజున (డిసెంబర్ 13వతేదీ) పార్లమెంటు పై దాడికి తెగబడిన విషయం తెలిసిందే.ఆ ముష్కరుల దాడిలో ప్రాణాలర్పించిన పార్లమెంట్ ఉద్యోగులు,భద్రతా సిబ్బందికి ప్రతిఏటా ఇదే రోజున వారి త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ శ్రద్ధాంజలి ఘటిస్తారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర శుక్రవారం ఉదయం పార్లమెంట్ ఆవరణలో అమరవీరుల స్మృతి చిహ్నం వద్ద పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# జల్ల సాయిలు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు

## అంత్యక్రియలలో పాల్గొన్న సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జల్ల సాయిలు శుక్రవారం అనారోగ్యంతో చరికొండ గ్రామంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, మండల రైతు సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ జోగు వీరయ్య పలువురు స్థానిక నేతలతో కలిసి చరికొండ గ్రామంలో సాయిలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాధన కొరకు మలిదశ ఉద్యమంలో చరికొండ గ్రామం నుంచి సాయిలు కీలకంగా వ్యవహరించేవారని అదేవిధంగా కడ్తాల్ మండల ఏర్పాటులో క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. సాయిలు నాయకత్వ లక్షణాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు. సాయిలు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు అని, బీఆర్ఎస్ పార్టీ ఒక మంచి కుటుంబ సభ్యుడిని కోల్పోయింది అని అన్నారు. సాయిలు కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, వారి ఆశయ సాధనలో అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చరికొండ మాజీ సర్పంచ్ లాల్కోట భారతమ్మ నరసింహ గౌడ్, మాజీ ఎంపీటీసీ రాములు గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగయ్య గౌడ్,దర్గయ్య, గోపాల్, లక్ష్మయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైద్యాధికారులకు జాతీయ కార్యక్రమాలపై సమీక్ష

## - జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. జి. మురళీధర్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డాక్టర్ జి మురళీధర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన వైద్యాధికారులకు డాక్టర్ జి మురళీధర్ పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని జాతీయ కార్యక్రమంలో భాగంగా మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం, చైల్డ్ హెల్త్ ఇమ్యూనైజేషన్, అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం, నేషనల్ మలేరియా ప్రోగ్రాం, నేషనల్ టిబెర్క్యులోలిసిస్ కంట్రోల్ ప్రోగ్రాం, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, లెప్రసీ, ప్రోగ్రాములు సమీక్షిస్తూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని, సిజేరియన్ తగ్గించాలని, గర్భిణీ స్త్రీలను 12 వారాల్లో నమోదు చేయాలని, రక్తహీనత ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి ఐరన్ అండ్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ అందించాలని, అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ లను 30 సంవత్సరాల పైబడిన వారందరినీ పరీక్షించాలని పేర్కొనడం జరిగింది. వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన దగ్గర నుండి ఐదు సంవత్సరాలు పిల్లలందరికీ అందించాలని 100% అయ్యేలాగా చర్యలు తీసుకోవాలని, క్షయ వ్యాధి ప్రోగ్రాం సమీక్షిస్తూ రెండు వారాల మించి దగ్గు ఉన్నచో తెమడ పరీక్ష చేసి, క్షయ వ్యాధి ఉన్నట్టయితే ఆరు నెలలు మందులు వాడినచో క్షయ వ్యాధి నయమగునని పేర్కొన్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ రాగి వర్ణం కలిగి, స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వైద్యాధికారిని సంప్రదించాలని అన్నారు. అన్ని జాతీయ కార్యక్రమాలను జిల్లాను ముందంజలో ఉంచాలని వైద్యాధికారులతో అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమీల, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కె.వి.రాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఆలయ కమిటీ ఛైర్మన్ గా కొర్ను రవీందర్ రెడ్డి



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలోని అతిపెద్ద దేవాలయం కురవి మండలంలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఆలయ మండపంలో అట్టహాసంగా జరిగింది. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆర్.సమత నేతృత్వంలో పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో ఆలయ ఛైర్మన్ ను ఎన్నుకున్నారు. అనంతరం దేవస్థానం సన్నిధిలో గల ఛైర్మన్ కార్యాలయంలో వేద పండితుల మంత్రోత్సవాల నడుమ వేదాశీర్వాదాలతో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన కొర్ను రవీందర్ రెడ్డి ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు,గ్రామ ప్రజలు, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్, చందు నాగన్న, నజీర్, ఇరుగు వెంకన్న,ఉపేందర్, కోర్నుకృష్ణారెడ్డి, నూకల మల్లయ్య దిలీప్, జనార్ధన్, మాజీ జడ్పీటీసీ బండి వెంకటరెడ్డి,గుండ్రాతిమడుగు సొసైటీ ఛైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి,తదితరులు ఘనంగా సత్కరించారు.

# కేంద్ర మంత్రిని కలిసిన మున్నూరు కాపు ప్రముఖులు



**విశ్వంభర, ఢిల్లీ:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్ధార్ పుటం పురుషోత్తమ రావు తదితర ప్రముఖులు కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ను కలిశారు.ఢిల్లీ ఉద్యోగ్ భవన్ లోని మంత్రి ఛాంబర్ లో కలిసి వినతిపత్రం అందజేశారు.మున్నూరుకాపు మహిళా పరస్పర సహాయ వినియోగదారుల సహకార సంఘం లిమిటెడ్ ఛైర్మన్ తెప్ప అరుణ, ఉప్పు రవీందర్, వేల్పుల శ్రీనివాస్,పర్వతం సతీష్,మేడివల్లి సంపత్,చిన్నం మహేందర్,మట్టి బాలరాజ్ తదితరులు మంత్రి గిరిరాజ్ ను కలిసి తమ సోసైటీ ఉన్నతికి తోడ్పాటు అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.పేద మహిళలు సాధికారత సాధించేందుకు, వారి కుటుంబ సభ్యుల ఉన్నతికి గాను తాము నెలకొల్పిన సోసైటీకి చేనేత, జౌళి శాఖ అమలుపర్చే పథకాలు,కార్యక్రమాలన్నింటిని వర్తింపజేయాల్సిందిగా ఎంపీ రవిచంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

## లగచర్ల ఘటనలో రైతులకు బేడీలు వేసిన

# పోలీసులపై చర్య తీసుకోవాలి

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సంఘం, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా లగచర్ల ఘటనలో అరెస్ట్ అయిన రైతుల పట్ల పోలీసు వైఖరి సరైంది కాదని, రైతులకు సంకెళ్లు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతుల భూముల్లో ఫార్మా కంపెనీ పెట్టాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా జరిగిన సంఘటనలో అరెస్టయిన హిర్యా నాయక్ అనే రైతుకు గుండె నొప్పి రావడంతో, జైలు నుండి హాస్పిటల్ కు తీసుకెళ్లే తరుణంలో అంబులెన్స్ లో తీసుకెళ్లకుండా పోలీస్ వాహనంలో బేడీలతో తీసుకెళ్లడం రైతులను దొంగలుగా, నేరస్తులుగా చిత్రీకరించడమే అన్నారు. గత ప్రభుత్వం రైతులకు బేడీలేస్తే కోర్టులు సైతం మందలించాయన్నారు. వెంటనే రైతు హిర్యా నాయక్ కు సంకెళ్లేసి హాస్పిటల్ తీసుకెళ్లిన పోలీసులపై, ఉన్నతాధికారులపై చర్య తీసుకోవాలని, ప్రభుత్వం దీనికి భాద్యత వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గన్నెబోయిన విజయ భాస్కర్, కందుల హనుమంతు, బోళ్ల వెంకన్న, అంబటి సురేందర్ రెడ్డి, పులి బిక్షం, కరకంటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలి



**విశ్వంభర, హనుమకొండ:** ఈ నెలాఖరు లోగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య సర్వే అధికారులకు ఆదేశించారు. శుక్రవారం హసన్పర్తి మండలంలోని భీమారం, పెంబర్తి గ్రామాలలో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి ఉండి గృహ నిర్మాణం కోసం సమగ్ర సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా సర్వే నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాల పనితీరును, లబ్ధిదారుల వివరాలను పొందుపరచు తీరును సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు గృహ నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డును పరిశీలించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. రేషన్ కార్డు లో తప్పనిసరిగా లబ్ధిదారుల పేరును ఉండేలా చూడాలని తెలిపారు. అదేవిధంగా సర్వేలో పూర్తిగా సేకరించిన లబ్ధిదారుల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని సర్వే అధికారులను ఆదేశించారు. నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. దరఖాస్తుదారులు ఒకచోట నివసిస్తూ ఉండి వారికి వేరొక ప్రదేశంలో స్థలం ఉన్నట్లయితే అటువంటి దరఖాస్తులను తీసుకొని వివరణలో తగిన వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తు వివరాలు యాప్ లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, 2 బి హెచ్ కే నోడల్ అధికారి రాజేంద్రప్రసాద్, తహసిల్దార్ ప్రసాద్, మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్, ఎంపీఓ కరుణాకర్ రెడ్డి, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే పారదర్శకంగా చేయాలి

- సర్వే కోసం నియమించిన 113 మంది సూపర్వైజర్లు, 547 మంది సిబ్బంది
- క్షేత్రస్థాయిలో పరిశీలనకు జిల్లాస్థాయి ప్రత్యేక అధికారుల నియామకం
- కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదవారికి అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరి కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టిందన్నారు. శుక్రవారం సంబంధిత అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజా పాలనలో లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో, పట్టణ ప్రాంతంలో వచ్చిన దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా అప్లోడ్ చేస్తున్న సర్వే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని, ఈ దరఖాస్తులన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇండ్లు మొబైల్ యాప్ ద్వారా గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలలో వార్డు అధికారులు పరిశీలించుటకు వారికి సంబంధిత లాగిన్స్ ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీలు, వార్డు పరిధిలలో పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ ఆఫీసర్లు ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన కార్యక్రమాన్ని ఖచ్చితమైన సమాచారం సేకరించి పూర్తిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మోడల్ గృహాలను అన్ని మండల కేంద్రాలలో నమూనా ఇండ్లను నిర్మించడం జరుగుతున్నాన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 487, గ్రామపంచాయతీ 82 పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ కమిటీలు వేయడం జరిగిందని, వారిని సైతం పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. దరఖాస్తుదారు ప్రభుత్వ సూచనల ప్రకారం బీపీఎల్ కార్డు వర్గం, ప్రస్తుత నివాస గృహానికి సంబంధించిన పూర్తి వివరాలు, కులం, చిరునామా, అన్ని వివరాలతోపాటు, ప్రస్తుతం ఉన్న ఇంటి దగ్గర తీసుకున్న ఫోటో, ఇంటి పరిసరాలతో పాటు ఫొటో, బయట ఫోటో, అలాగే కొత్తగా నిర్మించతలపెట్టిన స్థలం, దానికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్ లో అప్లోడ్ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 5,748 దరఖాస్తులను ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందని, మిగతా దరఖాస్తులను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. సర్వే చేస్తున్న క్రమంలో అర్హులైన లబ్దిదారులు ప్రభుత్వం తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంపై పూర్తి వ్యక్తం చేస్తున్నారని, గ్రామ, పట్టణ, వార్డు స్థాయిలో చేస్తున్న సర్వే వివరాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీర బ్రహ్మచారి, పర్యవేక్షించడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలో గృహ నిర్మాణ విభాగం సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేసి అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలుకు జిల్లా యంత్రాంగం పక్కాగా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతుందని కలెక్టర్ తెలిపారు.

## వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

### తనిఖీ చేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదు.కనీసం 50 శాతం రైతులకు రుణమాఫీ చేయకుండా రైతు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు చేసిందేమిలేదు, చెప్పుకునేది మాత్రం కోటలు దాతుంది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం తీరు. కందుకూరు వ్యవసాయం కార్యాలయంలో మండలంలోని ఎంతమంది రైతులు రుణం తీసుకున్నారు అన్న నివేదికలు అధికారుల దగ్గర లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతులకు ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రుణమాఫీని చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ సురేందర్ రెడ్డి, చంద్రశేఖర్ మేఘనాథ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, తాళ్ల కార్తీక్, ప్రశాంత్ చారి, కొండల్ రెడ్డి, జంగయ్య, రవీందర్, ఉమాకాంత్ రెడ్డి, తదితరు పాల్గొన్నారు.

## మెప్మా విభాగం ఆర్పీల ముందస్తు అరెస్టు

### పోలీస్ స్టేషన్‌కు తరలింపు



**విశ్వంభర, మెట్‌పల్లి:** జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణ మున్సిపల్ మెప్మా విభాగంలో పనిచేసే రిసోర్స్ పర్సన్ ఆర్ పీ లు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాకు పిలుపునివ్వడంతో మెట్ పల్లి మున్సిపల్ మెప్మా విభాగంలో పనిచేసే 30 మంది ఆర్ పీలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ గత ఏడు నెలలుగా ఆర్పీలకు ఇవ్వవలసిన గౌరవ వేతనం ఇవ్వడంలేదని, నెలకు 6000 వేతనాన్ని గత ప్రభుత్వం ఇస్తుండేదని, ఆర్పీలు మహిళా సంఘాలనే కాక మునిసిపల్ కు సంబంధించిన ప్రతి ఒక్క సర్వేలు ప్రభుత్వం ప్రకటించే పథకాలను ప్రజలకు తెలియజేస్తూ ఇలాంటి సమయపాలన లేకుండా విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం ప్రకటించే ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని చేరవేస్తూ ప్రజలను ముఖ్యంగా మహిళలను చైతన్య వంతులను చేయడానికి ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ పేద మధ్యతరగతి మహిళల అభ్యున్నతికి పాటుపడే ఆర్పీలా గౌరవ వేతనాన్ని వెంటనే ప్రకటించాలని, ఇతర ప్రభుత్వ విభాగాలు పనిచేసే వారిలాగా ప్రతి నెల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యక్తంగా ఆర్పీల హక్కుల సాధన కొరకు ధర్నాకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ లో గల మెప్మా ఆఫీస్ వెళుతున్న క్రమంలో మెట్ పల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్ కు తరలించారు.

## రైతుల సహకారంతో మార్కెట్ ను అభివృద్ధి పరుస్తాం

### - ఏఎంసీ ఛైర్మన్ గీతా నరసింహ



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ తొలి సమావేశం శుక్రవారం మార్కెట్ యార్డ్ కార్యాలయంలో జరిగింది. మార్కెట్ ఛైర్ పర్సన్ యాట గీతా నర్సింహ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో మార్కెట్ కు నూతన పాలకవర్గాన్ని నియమించిన ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లకు ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రైతుల విశ్రాంతి భవనం ఆధునీకరణ, పాడైన ప్రహరీ గోడ మరమ్మత్తు, కడ్తాల్ లో వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటుకు సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. మార్కెట్ ఆవరణలో నూతనంగా నిర్మించిన ఎనిమిది దుకాణాలను స్వాధీన పరుచుకుని ప్రారంభించడానికి తీర్మానించారు. ప్రభుత్వం, రైతుల సహకారంతో మార్కెట్ ను అభివృద్ధి పదంలో నడిపిస్తామని ఛైర్పర్సన్ గీత పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు. రైతులను మోసగించే వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్ నాయక్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు కండే పాండురంగయ్య, నరేష్ నాయక్, తాళ్ల రవీందర్, గట్ల కేశవరెడ్డి, మిట్టపల్లి అంజయ్య, వసుపుల శ్రీశైలం, పల్లె జంగయ్య, యాదయ్య, రమేష్‌గౌడ్, సంపత్ కుమార్, అజీమ్, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, సూపర్వైజర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నూతన పాలకవర్గానికి సన్మానం



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం ఎస్ ఎస్ కేబుల్, ఎస్ ఎస్ సి నెట్ వర్క్ యాజమాన్యం ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి నూతన ప్రెస్ క్లబ్ పాలకవర్గాన్ని ఘనంగా ఎన్నుకున్నారు. నూతన ప్రెస్ క్లబ్ పాలకవర్గాన్ని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మేనేజర్ ప్రశాంత్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ఎప్పుడూ పోరాడుతూ వారికి అండగా నిలిచేది విలేకరులే అన్నారు.ప్రెస్ క్లబ్ పాలకవర్గాన్ని సత్కరించిన ఎస్ ఎస్ కేబుల్ ఎస్‌ఎస్సీ నెట్వర్క్ యాజమాన్యం కూర అంజిరెడ్డి, పుర్మాని రామలింగారెడ్డి,మేనేజర్ ప్రశాంత్ లకు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సిరిపాక ప్రణయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసాని శ్రీకాంత్ రెడ్డి,చందు,గణేష్, సంతోష్,ప్రశాంత్ తదితరులున్నారు.

## ముగిసిన ఆక్స్‌ఫర్డ్ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు

**విశ్వంభర, బషీర్ బాగ్:** ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్‌లో 44వ వార్షిక క్రీడా దినోత్సవం వేడుక ఘనంగా ముగిసింది. హాజరైన వారికి జ్ఞాపకాలు, క్రీడల పట్ల కొత్త మక్కువను మిగిల్చింది. 7, 8 తరగతుల విద్యార్థులు 'జై హో' పాట ప్రదర్శన ఉత్సాహాన్ని నింపింది. ముఖ్య అతిథిగా ఈస్ట్ జోన్ డిప్యూటి కమీషనర్ డా.బి.బాలస్వామి ఐపీఎస్ హాజరై మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం అలవడుతుందని అన్నారు. క్రీడలను జీవిత మార్గంగా స్వీకరించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో పాఠశాల చేస్తున్న కృషి గొప్పదని అన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన రంజీ ట్రోఫీ ఆటగాడు సాకేత్ సాయి రామ్ పాఠశాల క్రికెట్ జట్లను అభినందించారు. వేడుకలకు హాజరై విద్యార్థులను ప్రోత్సహించిన అతిథులకు పాఠశాల డైరెక్టర్ ప్రార్థన ధన్యవాదాలు తెలిపారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి వెంకట్ రావును ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### ముఖ్యమంత్రి సహాయ నిధి

## నిరుపేద ప్రజలకు వరం

### - కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి:** ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే మన ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డొకురి ప్రభాకర్ రెడ్డి తో కలిసి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను మరియు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్లో మెరుగైన వైద్యం చేయించుకొని హాస్పిటల్ బిల్స్ ప్రభుత్వానికి ఆన్ లైన్ లో అప్లై చేసుకున్న సందర్భంగా ప్రజా ప్రభుత్వం వారి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి, చుక్కాపూర్ మాజీ ఎంపిటిసి యాదయ్య, రాంపూర్ మాజీ ఎంపీటీసీ టి. వెంకటయ్య, వెల్జాల్ మాజీ ఉపసర్పంచ్ అజీజ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు టి విష్ణు గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, సుఖేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### వార్డు అధికారులకు

## ఇందిరమ్మ ఇండ్ల శిక్షణా సమావేశం




**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు పురపాలక సంఘ కార్యాలయంలో ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు డిసెంబర్ 16, 2024 నుండి డిసెంబర్ 30, 2024 వరకు వెరిఫికేషన్' చేయడం కోసం మున్సిపల్ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో సమావేషం ఏర్పాటు చేశారు. వార్డుల వారీగా, అధికారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ యాప్ లో లబ్ధిదారులను ఎలా నమోదు చెయ్యాలో శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో, మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్ నాయక్ వైస్ ఛైరన్ దుర్గయ్య, వార్డు అధికారులు, మున్సిపల్ కౌన్సెలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లను స్థానికులకు కేటాయించాలి

### బల్దియా కమిషనర్ కు ఎమ్మెల్యే జీఎంఆర్ వినతి




**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో లబ్ధిదారులకు కేటాయించని ఇళ్లను స్థానికులకు కేటాయించాలని, మూడు డివిజన్లో పరిధిలో పారిశుద్ధ వ్యవస్థ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరితి ని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్ లోని బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ తో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా.. పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్ చేరు పరిధిలో నిరుపేదలు అత్యధికంగా నివసిస్తున్నారని, సొంత ఇల్లు లేక కిరాయిలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన 40 వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఖాళీగా ఉన్న ఇళ్లను స్థానికులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొద్దిమంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను కేటాయించడం జరిగిందని, అర్హత కలిగిన లబ్ధిదారులు వేల సంఖ్యలో ఉన్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. భారతి నగర్, రామచంద్రాపురం, పటాన్ చేరు డివిజన్ల పరిధిలో పారిశుధ్య కార్మికుల కొరత మూలంగా శానిటేషన్ పూర్తి స్థాయిలో జరగడం లేదని తెలిపారు. చనిపోయిన కార్మికుల స్థానాల్లో నూతన కార్మికులను నియమించాలని, అర్హత లేకున్నా సూపర్వైజర్లు గా వ్యవహరిస్తున్న కార్మికులపై చర్యలు తీసుకోవాలని, సర్కిల్ పరిధిలో నూతన జేసీబీని ఏర్పాటు చేయాలని కోరారు. పేద ప్రజల అవసరాల కోసం నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ అధ్వానంగా తయారయిందని తెలిపారు. రహదారులపై నిర్మించిన టాయిలెట్ల నిర్వహణ గాలికి వదిలేసారని పేర్కొన్నారు. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో పర్యటించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

## భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోండి

### - విద్యార్థులకు గీతం ప్రోవీసీ ప్రొఫెసర్ డీ.ఎస్.రావు సూచన




**విశ్వంభర సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా అభిరుచికి తగ్గ కోర్సులను ఎంపిక చేసుకుని, అందులో రాణించి, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్ విద్యార్థులకు గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు సూచించారు. అవినాష్ కళాశాల కూకట్ పల్లి, ఎల్.బీ.నగర్, హయత్ నగర్, సికింద్రాబాద్ శాఖలకు చెందిన దాదాపు 750 మంది విద్యార్థుల బృందం శుక్రవారం గీతం హైదరాబాద్ ప్రాంగణాన్ని సందర్శించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో గీతం ప్రోవీసీ అవినాష్ విద్యార్థులను స్వాగతించి, ఈ ప్రతిష్టాత్మక విద్యా సంస్థకు చెందిన అన్ని అంశాలను స్వయంగా పరిశీలించి కూలంకషంగా తెలుసుకోవాలని సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా బీస్కూల్ గురించి లోతైన అవగాహన కల్పించడమే గాక, అక్కడున్న బ్లూమ్ బెర్గ్ వంటి అత్యాధునిక మౌలిక సదుపాయాల గురించి వివరించారు. అవినాష్ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె ఆకట్టుకునే జవాబులిచ్చి వారిని ఉత్సాహపరిచారు. గీతం బీస్కూల్ ఎంబీ ఏ చివరి సంవత్సరం విద్యార్థులతో అవినాష్ బృందం ముఖాముఖి సమావేశమై, వివిధ కెరీర్ ఎంపికలు, భవిష్యత్తు అవకాశాల గురించి ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించారు. ఆ తరువాత, కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె. మమత వారితో సమావేశమై, ప్రాంగణ నియామకాలు, దానికి సన్నాహకంగా గీతంలో ఇచ్చే శిక్షణ, దానిని విజయవంతంగా పూర్తిచేసుకుని వివిధ కంపెనీలకు ఎంపికైన వారు పొందుతున్న జీతభత్యాల వివరాలను తెలిపారు. ఆద్యంతం ఉత్సాహభరితంగా జరిగిన గీతం సందర్శన, ముఖాముఖి చర్చలు, స్వయంగా పరిశీలించే వెసులుబాటు వంటివి అవినాష్ విద్యార్థులకు విస్తృతమైన అవగాహనను ఏర్పరచడమే గాక, మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవడానికి తోడ్పడింది. దీనికి అదనంగా గీతంలోని బ్లూమ్ బెర్గ్ వంటి అత్యాధునిక ప్రమాణాలతో ఏర్పాటు చేసిన పలు ప్రయోగశాలలు, ఆకట్టుకునే ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలు అవినాష్ విద్యార్థుల ఆసక్తిని రెట్టింపు చేశాయి. పసందైన విందుతో ముగిసిన ఈ పర్యటన, పలువురు అధ్యాపకులు, విద్యార్థులతో ముఖాముఖి చర్చించడంతో పాటు వారితో పరిచయాలు ఏర్పరచుకోవడానికి వీలు కల్పించింది.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్షలో పాల్గొన్న అందెల

- సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాల్సిందే
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరాములు అందెల



**విశ్వంభర, మహేశ్వరం:** రంగారెడ్డి జిల్లా కొంగర కలాన్ లోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట రంగారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎండి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి, మినిమం స్కేల్ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేస్తూ చేపట్టినటువంటి నిరసన దీక్షలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ హాజరై ఉద్యోగులకు మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు 20 వేలకు పైగా పనిచేస్తున్నారని వారికి జీతాలు అన్ని ఖర్చులకు గాను కేంద్రం నుండి 60 శాతం నిధులు ప్రతి ఏటా విడుదల అవుతున్నాయి, కానీ రాష్ట్ర వాటా 40 శాతం నిధులు ఇవ్వకుండా కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే సమగ్ర శిక్ష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొస్తుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ ఎన్నో నిరసన కార్యక్రమాలతో రోడ్ ఎక్కారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి వరంగల్ డిక్లరేషన్ లో సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీని ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చి ఏడాదైన వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగులకు అండగా ఉంటానని హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ కౌన్సిలర్లు కాంటెకర్ మధుమోహన్, శివకుమార్ గౌడ్, బోధ యాదగిరిరెడ్డి, జిల్లా దిశా కమిటీ మెంబర్ అంబోజి శ్రీనివాస్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు కాశీ రావు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు సత్యనారాయణ, శ్రీలత, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల బాధితులకు సంఘీభావం

- 393 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి




**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భాస్కర్ గడ్డ నందు గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను గత బీఆర్ఎస్ పార్టీ కేటీయించిన అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పట్టాలని వెంటనే అందచేయాలనీ గత 20 రోజులుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ వద్ద లబ్దిదారులు చేస్తున్న నిరసన కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి వారికీ మద్దతుగా పాల్గొని సంఘీభావం తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్,పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, వైస్ ఛైర్మన్, ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్స్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, జాగృతి నాయకులు, వార్డ్ అధ్యక్షులు, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఆటల పోటీలను జయప్రదం చేయండి



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలోని కమ్మదనం తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాలల సెక్రెటరీ అలగు వర్షిని ప్రోత్సాహంతో ఈనెల 19 నుండి కమ్మదనం సంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పాటల పోటీలను జయప్రదం చేయాలని మల్టీ జోనల్ ఆఫీసర్ రజిని ఆదేశించారు. ఫరూక్ నగర్ మండలం పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ విద్యుల్లత ఆధ్వర్యంలో ఆటల పోటీలపై ప్రిన్సిపాల్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గురుకులాల మల్టీ జోనల్ ఆఫీసర్ రజిని హాజరయ్యారు.ఈ సందర్భంగా జోనల్ అధికారిణి మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి ఆటల పోటీలు కమ్మదనం గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుండి 1200 మంది విద్యార్థులు పాల్గొంటారని వివరించారు.విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.రాష్ట్రస్థాయి ఆటల పోటీలను విజయవంతం చేయాలని సంబంధిత ప్రిన్సిపల్ లను, పీడీ, పీటీలను ఆదేశించారు.ఈ సమావేశంలో గురుకులాల రాష్ట్రస్థాయి ఆఫీసర్ భీమయ్య జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి సిక్స్త్ జోన్ ఆఫీసర్ నిర్మల పాల్గొన్నారు.

# సరస్వతీ పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయండి

- రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ




**విశ్వంభర, భూపాల్ పల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని, ఈ పుష్కరాలకు మన రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్ర భక్తులు కూడా వస్తారని, అందుచేత ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. సరస్వతీ నదికి వచ్చే ఏడాది(2025)లో పుష్కరాలు రానున్న నేపథ్యంలో, పుష్కరాల నిర్వహణకు అధికారులు అంచనా నివేదికలు సిద్ధం చేయాలని ఆమె పేర్కొన్నారు. సరస్వతీ పుష్కరాల నిర్వహణపై దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, సమాచార, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర శాఖల అధికారులతో మంత్రి కొండా సురేఖ శుక్రవారం తెలంగాణ సచివాలయంలోని తన పేషీలో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. కాళేశ్వరం ఆలయ చరిత్ర ప్రకారం, 'గురు' బృహస్పతి 'మిథున' రాశిలోకి ప్రవేశించినప్పుడు సరస్వతీ నదికి పుష్కరాలు నిర్వహిస్తామని అధికారులు చెప్పగా, పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులను అడిగారు. గతంలో సరస్వతీ పుష్కరాలకు దాదాపు 30 వేల మంది భక్తులు పుష్కర స్నానాలు చేశారని.ఈసారి 50 వేల మందికి పైగా వస్తారని అంచనా వేస్తున్నామని మంత్రికి వివరించారు. ఆ మేరకు ఏర్పాట్లను చేయాలని ప్రణాళికలు రచిస్తున్నట్టు వెల్లడించారు. అయితే, చిన్న పిల్లలు, స్త్రీలు, వృద్ధులకు ఎటువంటి ఏర్పాట్లు చేస్తున్నారని మంత్రి సురేఖ ప్రత్యేకంగా అడిగారు.

మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లకు సంబంధించిన అంచనాలను తయారు చేసి నివేదిక అందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక, శాశ్వత మరుగుదొడ్లు నిర్మించాలని తెలిపారు. భక్తులు స్నానాల కోసం నల్లాలు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరంలో అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పనుల విషయంలో ఎటువంటి ఇబ్బందులున్నా తనను సంప్రదించాలని, భక్తులకు మాత్రం ఎటువంటి ఆటంకం కలగ వద్దని మంత్రి సురేఖ ప్రత్యేకంగా చెప్పారు. ఈ రివ్యూ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండి ప్రకాష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్, దేవాదాయ శాఖ ఆర్జెసీ రామకృష్ణా రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, అసిస్టెంట్ కమిషనర్ సునీత, కన్సర్వేషన్ ఆర్కిటెక్ట్ సూర్య నారాయణ మూర్తి, కాళేశ్వరం ఆలయ ఈవో మారుతీ తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర శిక్ష అభియాన్లో పనిచేస్తున్న వారిని

## విద్యాశాఖలో విలీనం చేయాలి

- సంఘం నాయకులు శ్రీధర్, మనోజ, ఆనందం

**విశ్వంభర, వరంగల్:** వరంగల్, హన్మకొండ జిల్లాల సమగ్ర సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు ఏకశిలా పార్కులో గత మూడు రోజులు నుండి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు.సమగ్ర శిక్ష అభియాన్ నందు వివిధ విభాగాల ఎంఆర్పీ,కేజీబీవీ, యూఆర్ఎస్,స్కూల్ కాంప్లెక్స్ లలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ సమ్మెలో పాల్గొని నిరసనను తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు శ్రీధర్, మనోజ, ఆనందం మాట్లాడుతూ ఆరు ఏడు ఎనిమిది తేదీలలో నిరసన దీక్షలు చేసినప్పుడు గవర్న మెంట్ నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో నిరవధిక సమ్మె చేస్తున్నామని తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా సమగ్ర శిక్ష అభియాన్ నందు కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వహిస్తున్నామని ఉన్నత చదువులు చదివి రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్ పాయింట్స్ కలిగి డిస్టిక్ కమిటీ సెలక్షన్ కమిటీ ద్వారా నియమితులయ్యారని తెలిపారు. గత సంవత్సరం సమ్మె కాలంలో టీపీసీసీ అధ్యక్షులుగా ఉన్న రేవంత్ రెడ్డి మా సమ్మె శిబిరానికి వచ్చి మాకు హామీ ఇచ్చారు.కాంగ్రెస్ గవర్నమెంట్ తీసుకు వస్తే మీ సమస్యలను ప్రజాదర్బార్లలో కూర్చోబెట్టి మీకు జీవోలు ఇచ్చి పంపిస్తామని తెలియజేశారన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మమ్మల్ని రెగ్యులరైజ్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వరంగల్ హనుమకొండ జిల్లాల అధ్యక్షులు ధోనికేన శ్రీధర్, మహమ్మద్ షఫీ ప్రధాన కార్యదర్శి కరుణశ్రీ,ముఖ్య సలహాదారులు నర్మెట యాదగిరి,గౌరవ అధ్యక్షులు సిద్దాల ఆనందం,డీపీఓ స్టాప్ చేరాలు,మొగసాని శంకర్ ఉపాధ్యక్షురాలు జ్యోతి మనోజ,శ్రీనివాస్,స్వాతి, తడుగుల రాజు,సమగ్ర శిక్ష ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 19 నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్

వెల్లడించిన సొసైటీ ప్రతినిధులు




**విశ్వంభర, హైదరాబాద్ :** పుస్తక ప్రదర్శనకు ప్రసిద్ధిగాంచిన హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను ఈ నెల 19 నుంచి 29 వరకు నగరంలో నిర్వహించనున్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో జరగనున్న ఈ పుస్తక ప్రదర్శనను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించినట్టు సొసైటీ అధ్యక్షుడు యాకూబ్ షేక్, కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 210మందికి పైగా ప్రచురణకర్తలు, పంపిణీదారులు పుస్తకాలను ప్రదర్శించనున్నారని తెలిపారు. బుక్ ఫెయిర్ ప్రాంగణానికి దాశరథి కృష్ణమాచార్య, సభా కార్యక్రమాల వేదికకు బోయి విజయభారతి, పుస్తకాల ఆవిష్కరణ వేదికకు తోపుడు బండి సాదిక్ పేర్లతో నామకరణం చేశాం. సుమారు 350 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాం. రచయితలు సొంత రచనలు, ప్రచురణలను పాఠకులకు పరిచయం చేసుకునేందుకు ప్రత్యేకంగా రైటర్స్ స్టాళ్లు కేటాయించాం. కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి, విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య రమా మేల్కోటేలతో సలహా కమిటీని ఏర్పాటు చేశాం. తెలంగాణ రుచులతో ఫుడ్ స్టాళ్లనూ ఏర్పాటు చేస్తున్నాం. పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నాం' అని సొసైటీ ప్రతినిధులు వెల్లడించారు.

## వ్యవసాయ మార్కెట్ ప్రహరీ గోడను నిర్మించాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** వ్యవసాయ మార్కెట్ ప్రహరీ గోడను నిర్మించాలని ఆమనగల్లు మార్కెట్ ఛైర్మన్ యాట గీతకు కౌన్సిలర్ దివ్య శ్రీకాంత్ సింగ్ వినతి పత్రం అందజేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 6 వ వార్డు గుర్రం గుట్ట కాలనీ ని అనుసరించి ఉన్న మార్కెట్ ప్రహరీ గోడ ఇటీవల వర్షాలకు కూలిపోయింది, దీంతో వ్యవసాయ మార్కెట్ యార్డులోకి పందులకు ఆవాస కేంద్రంగా ఏర్పడి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో తెలిపారు. అదేవిధంగా మార్కెట్ ప్రహరీ గోడ కూలిపోవడంతో పాములు కూడా కాలనీలోకి వస్తున్నాయని ఈ సందర్భంగా మార్కెట్ ఛైర్మన్ దృష్టికి కౌన్సిలర్ దివ్య శ్రీకాంత్ తీసుకువెళ్లారు. వినతి పత్రం అందించిన వారిలో కాలనీవాసులు పాలాది శ్రీనివాస్, లింగంపల్లి అశోక్, తోట మల్లేష్,తోట నందు, శ్రీశైలం యాదవ్, బ్రహ్మం మైకం వెంకటేశ్వర్ రెడ్డి, ప్రకాష్ నరసింహ గౌడ్, గంజి శ్రీను శ్రీనివాస్ చారి లు ఉన్నారు, ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## నూతన పాంట్ల ఏర్పాటుతో చెరువులకు మహర్దశ

- 1100 కోట్ల రూపాయలతో 7 సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్



**విశ్వంభర, సంగారెడ్డి:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల పరిధిలో 1100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 7 సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్చెరువు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి ఎస్టీపీ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ఎస్టీపీ ప్లాంట్ల ఏర్పాట్లపై సమగ్ర నివేదికను ఎమ్మెల్యేకు అందించారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో బీఓటీ పద్ధతిలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని తిమ్మక్క చెరువు, మేళ్ల చెరువు, ఉసికే బావి, ఇక్రిసాట్, గండిగూడెం, బచ్చు గూడెం, అమీన్పూర్ పరిధిలోని చెరువుల సమీపంలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు 1100 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా ప్లాంట్ల ఏర్పాటుకు భూ కేటాయింపులు జరపాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారులకు సంబంధిత శాఖ అధికారులు పంపించడం జరిగిందని పేర్కొన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్లాంట్ల పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 25 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం, 40 శాతం సంభందిత కాంట్రాక్టర్ కు బీఓటీ పద్ధతిలో నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చేరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చెరువులు, కాలువలను మరీగ్ నీరు, కాలుష్యం బారి నుండి సంరక్షించుకోవడంలో ప్లాంట్ల ఏర్పాటు కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. అతి త్వరలో భూ కేటాయింపులు జరిపేందుకు కృషి చేయనునట్లు ఎమ్మెల్యే జీఎంఆర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, జలమండలి డీజీఎంలు బాబు, దీపాలి, శ్రీనివాస రావు, తహసీల్దార్లు రంగారావు, రాధా, సంగ్రామ్, బిక్షపతి, గంగా భవాని, తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు న్యాయం చేస్తాం : ఆర్డీవో సత్యపాల్ రెడ్డి

**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లాలోని సంగెం మండలంలోని వివిధ గ్రామాలలో గ్రీన్ ఫీల్డ్ ల్యాండ్ కోసం రైతులు ఇస్తున్నటువంటి పంట భూములకు ప్రభుత్వ పరమైన నష్టపరిహారాన్ని అందించి రైతులకు న్యాయం చేస్తామని వరంగల్ ఆర్డీఓ కె సత్యపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సంఘం మండలంలోని తిమ్మాపూర్ చింతలపల్లి గ్రామాలకు చెందిన రైతులు సంఘం తాహసీల్దార్ తో కలిసి వరంగల్ ఆర్డీఓ సత్యపాల్ రెడ్డిని కలసి రైతుల సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా ఆర్డీవో సత్యపాల్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లా సంఘం మండలం లోని చింతలపల్లి, తిమ్మాపూర్ లకు చెందిన 80 మంది రైతులకు చెందిన సర్వేనెంబర్ 124,25,135,138, లకు సంబంధించిన సుమారు 140 ఎకరాలు భూములు గ్రీన్ ఫీల్డ్ ల్యాండ్ కింద కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించుటకు జిల్లా కలెక్టర్ సర్వేలు ఆధారంగా రైతులకు చెల్లిస్తాను అన్నారని తెలిపారు. అదేవిధంగా గత ప్రభుత్వం గతంలో నష్టపోయిన రైతులకు ఒక్క ఎకరం చొప్పున సుమారు రూ. ఆరు లక్షలు రూ. 12 లక్షలు అందజేసినట్లు సమాచారం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ తో సమీక్ష చేస్తున్నామని రైతులకు నష్టపరిహారం మూడంతలుగా అందే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంగెం, మండలం తాహసీల్దార్ గనిపాక రాజ్ కుమార్, చింతలపల్లి, తిమ్మాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతుల సహకారం కావాలి

- జిల్లా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి నర్సింహా రావు



**విశ్వంభర, కేశంపేట:** లేమామిడి రైతులు ఎవరు కూడా వ్యర్థాలను కాల్చరాదని,వాటిని పొలంలోనే కలిపేయాలని సూచించారు జిల్లా వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి నర్సింహా రావు. శుక్రవారం మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి శిరీష తో కలసి పర్యటించారు.ఇందులో భాగంగా డీఏఓ మాట్లాడుతూ, వ్యర్థాలను కాల్చకూడదని, పొలంలోని కలిపిదున్నాలని సూచించారు. అలా దున్నడం వలన నేలకు భూసారం పెరగడమే కాకుండా సూక్ష్మ ధాతు పోషకాలతో సహా నత్రజని,భాస్వరం,పోటాషియం లభ్యం అవుతుందన్నారు.వ్యర్థాలను వరి కొయ్యలను కాల్చకుండా నేలలోనే కలిసేలా దున్ని చల్లడం వలన ఆ వ్యర్థాల త్వరగా మురిగి పోయి సేంద్రియ కర్బనం శాతం పెరిగి,నేలకు తర్వాత వేసే పంటకు బాగా ఉపయోగపడుతుందని సూచించారు.వ్యర్థాలు కాల్చడం వలన కలిగే నష్టాలు పర్యావరణ కలుషితం కావడం, సేంద్రియ కర్బనం 30 నుడి 40 శాతం కోల్పోతుంది. రసాయన ఎరువులు వాడకం పెరుగుతుందన్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే వింత పురుగుల సంఖ్య,సూక్ష్మజీవుల సంఖ్య తగ్గిపోతుందని తెలిపారు.

కావున రైతులందరూ వ్యర్థాలను కాల్చకూడదన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంట ఏఈఓ. సుధ,రైతులు అమర్నాథ్ రెడ్డి,శేఖర్ రెడ్డి,యాదయ్య మొదలగు వారు ఉన్నారు.

## నేడు జరిగే నేషనల్ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక కోర్టు ఆవరణలో మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ కోఆర్డినేషన్ మీటింగ్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జరిగింది. నేడు శనివారం జరిగే నేషనల్ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఉషశ్రీ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీషలు మాట్లాడుతూ నేడు భారతదేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నేషనల్ లోక్ అదాలతో వివిధ రకాలైన కేసులు బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, క్రిమినల్, సివిల్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఫ్రీ లిటిగేషన్, అనేక రకాల కేసులను రేపు లోకదాలత్ ద్వారా ప్రజలు, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, పోలీస్, డిపార్ట్ మెంట్ లు ప్రజలలో వచ్చే లిటిగేషన్స్ తగ్గించేందుకు కృషి చేయాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ లోక్ అదాలత్ కు పెద్ద సంఖ్యలో హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మల్లయ్య, లీగల్ ఎయిడ్ ప్యానల్ లాయర్ మామిడి వెంకట్ రెడ్డి, కోర్టు సూపరిండెంట్లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు తదితరులు పాల్గొన్నారు.




యువత స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలి అని ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్ ఇన్ఫర్మేషన్ కాలనీ లో నివాసం ఉండే సందీప్ రెడ్డి కొనుగోలు చేసిన డి.జె.మ్యూజిక్ సిస్టంను ప్రారంభించారు.

- విశ్వంభర, ఎల్బీనగర్

# మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



విశ్వంభర, భూపాల్ పల్లి: భూపాలపల్లి పట్టణ నియోజకవర్గంలోని రేగొండ, గణపురం మండలాలతో పాటు భూపాలపల్లి పట్టణంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ పర్యటించనున్నారని, ఇట్టి పర్యటనను విజయవంతం చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, వంద పడకల ఆసుపత్రిలో రివ్యూ, అంబేద్కర్ సెంటర్ లో ప్రజా పాలన విజయోత్సవ సభకు మంత్రులు రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మంత్రులిద్దరి షెడ్యూల్ ను మీడియాకు వివరించారు. ఉదయం 11 గంటలకు మంత్రులిద్దరూ హైదరాబాద్ లోని బేగంపేట ఎయిర్ పోర్టు నుండి ప్రత్యేక చాపర్ లో బయలుదేరుతారు. ఉదయం 11:40గంటలకు రేగొండ మండలం రామన్నగూడెం గ్రామ శివారులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్ వద్ద దిగి, అక్కడి నుండి మధ్యాహ్నం 12 గంటలకు భాగిర్థిపేట ఆర్చి వద్ద రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన బుద్ధారం కొడవటంచ గ్రామం వరకు బీటీ డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ మరియు సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 12:15 గంటలకు భూపాలపల్లిలో రూ.15 కోట్లతో 50 పడకల ఆయూష్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు రూ.130 కోట్లతో మెడికల్ కాలేజీ బిల్డింగ్ కాంప్లెక్స్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 12:45 గంటలకు రూ.13 కోట్లతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 3వ అంతస్తులో గదుల నిర్మాణం పనులకు శంకుస్థాపన అనంతరం మొగుళ్ళపల్లి మండలానికి 108 అంబులెన్స్ ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే డాక్టర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహిస్తారు.

మధ్యాహ్నం 1:30 గంటలకు రూ. 4 కోట్లతో భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ నుండి కేటీకే 2 ఇంక్లైన్ వరకు బీటీ రోడ్డు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 1:45 గంటలకు భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ లో ప్రజా పాలన విజయోత్సవ సభలో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి హైదరాబాద్ కు వెళ్లనున్నారు. కావున, ఇట్టి కార్యక్రమాలన్నింటిలో కాంగ్రెస్ శ్రేణులు, అధికారులు, మీడియా మిత్రులు పాల్గొని సక్సెస్ చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## ఘనంగా ఆంజనేయస్వామి ఇరుముడి పూజలు

**విశ్వాంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం ఎర్రబిక్య తండా గ్రామంలోని హనుమాన్ దేవస్థానం లో ఆంజనేయస్వామి ఇరుముడి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమనగల్లు బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షులు డా పత్యనాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించి స్వాములను సన్మానించారు. కార్యక్రమం లో మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, పంతు, మున్సిపాలిటీ కార్యదర్శి వడ్డెమోని శివకుమార్, సోషల్ మీడియా ఇంచార్జ్ గణేష్ నాయక్,సోమ్లా నాయక్, పాండు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో

# ఇంటి స్థలం కాజేయాలని యత్నం

- బ్రతికున్న వ్యక్తిని చనిపోయినట్లు చిత్రీకరణ
- ముఠాను అరెస్టు చేసిన షాద్‌నగర్ పోలీసులు



**విశ్వంభర, షాద్ నగర్:** బ్రతికున్న వ్యక్తిని చనిపోయినట్టు చిత్రీకరించి తప్పుడు పత్రాలతో ఇంటి స్థలాన్ని కాజేయాలని ప్రయత్నించిన ముఠాలోని ఇద్దరు వ్యక్తులను షాద్నగర్ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. షాద్ నగర్ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదురాలు బీహార్ రాష్ట్రానికి చెందిన కిరణ్ తివారి, తన భర్త దీపక్ తివారి మరియు కొడుకులతో కలిసి షాద్నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీ నివాసం ఉంటూ ఫ్యాక్టరీలో పని చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారని, 2013 వ సంవత్సరంలో కమ్మదనం గ్రామ శివారులో గల సర్వేనెంబర్ 115, 117, 118 లో బిల్డింగ్ బ్లాక్ ప్రాజెక్టు ఇండియా లిమిటెడ్ వెంచర్ నందు 133 గజాలు గల ప్లాట్ నెంబర్ 1297 కొనుక్కున్నట్లు తెలిపారు. అట్టి ప్లాట్ ను హైదరాబాద్ కు చెందిన గోపాల్ గోపేశ్వర్ అని ఇద్దరు వ్యక్తులు ఖరీదు దారు కిరణ్ తివారి చనిపోయినట్లు తప్పుడు డెత్ సర్టిఫికెట్ సృష్టించి, కిరణ్ తివారి భర్త దీపక్ తివారి ఆస్తులకు వారసుడని, తప్పుడు లీగల్ హెయిర్ సర్టిఫికెట్ సృష్టించి, ఆన్లైన్లో లింక్ డాక్యుమెంట్ మిస్ అయినట్లు మీ సేవలో అప్లై చేసుకున్న రిసిప్ట్ తీసుకొని, ఆ రిసిప్ట్ సహాయంతో అశోక్@టిల్లు అని వ్యక్తిని కిరణ్ తివారి భర్త దీపక్ తివారికి మారు మనిషిగా పెట్టి ఈ కేసులో మొదటి నిందితుడైన గోపాల్ అనే వ్యక్తి పేరు మీద 2021 సంవత్సరంలో రిజిస్టర్ సేల్ చేయడం జరిగిందని తెలిపారు. అట్టి సెల్ లీడ్ చేసిన డాక్యుమెంట్ రైటర్ విజయ్, సాక్షులు చార్మినార్ యాకుత్పురాకు చెందిన అబ్దుల్ జలీల్, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం బోనగిరి పల్లి గ్రామానికి చెందిన లింగాల విజయ్, అప్పటి ఎస్ ఆర్ ఓ సతీష్‌పాత్ర పై ఫిర్యాదురాలు అనుమానం వ్యక్తం చేసినట్లు తెలిపారు. వీరి పాత్రలపై విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

అలాగే నిందితుడైన గోపాల్ తన ముఠాకి చెందిన గోపేశ్వర్ అనే వ్యక్తి పేరు పైకి పై ప్లాటును 2022 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసినాడని తెలిపారు. ఇలా తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి ఫిర్యాదురాలు కిరణ్ తివారి యొక్క ఆస్తిని కాజేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసి ఫిర్యాదురాలు షాద్నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. క్రైమ్ నెంబర్ 541/2023 గా, 419,420, 467, 468, 471 ఐపీసీ సెక్షన్ల కింద సెప్టెంబర్ 2023 వ సంవత్సరంలో కేసు నమోదు చేసినట్టుగా, తదుపరి కేసు దర్యాప్తు చేపట్టిన సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజయ్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉమెన్ సుశీలలు డిసెంబర్ 5, 2024 న మొదటి ముద్దాయి గోపాల్ ను అరెస్టు చేసి కస్టడీకి తీసుకొని, మూడవ ముద్దాయి అయిన గోపేశ్వర్ ను డిసెంబర్ 12, 2024 న అరెస్టు చేసి రిమాండ్ తరలించడం జరిగింది అని తెలిపారు. ఈ కేసును చేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులను అభినందించి, వారికి పై అధికారుల ద్వారా తగిన రివార్డులు ఇవ్వడం జరుగుతుందని పోలీసులు తెలిపారు.



### జాతీయ స్థాయిలో

## సోను కరాటే అకాడమీ విద్యార్థుల ప్రతిభ

**విశ్వంభర, ఆమనగల్లు:** అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఆమనగల్లు మండల కేంద్రానికి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రణవి, దీక్షిత, శ్రవంతి, పింకీ, అరుణ, అస్మిక, హిందు, పల్లవి, గాయత్రి, నిహారిక, జస్విక 11 బంగారు పతాకాలు, వైశాలి, అశ్విని సిల్వర్ 3 పతకాలు సాధించి ప్రతిభ కనబరించారు. ఈ సందర్బంగా ఎస్ఐ వెంకటేష్ విద్యార్థులను, సోను కరాటే అకాడమీ మాస్టర్ సోను లను అభినందించి సన్మానించారు.

## శ్రీశైల పుణ్యక్షేత్రంలో తృతీయ శ్రీ విష్ణు సహస్రనామ అఖండ పారాయణ సప్తాహం



**విశ్వంభర, షాద్ నగర్:** శ్రీశైల పుణ్యక్షేత్రంలో తృతీయ శ్రీ విష్ణు సహస్రనామ అఖండ పారాయణ సప్తాహము ద్వితీయ ఆర్ష వేదాంత మహాసభలు మరియు 100వ శ్రీ విష్ణు సహస్రనామ మహా యజ్ఞాలకు ముఖ్య అతిథులుగా శ్రీ శివానంద స్వామి, శ్రీ నరసింహ స్వామి, శ్రీ శివరాజ స్వామి పాల్గొని విష్ణు సహస్రనామ పారాయణము మరియు గీతా పారాయణం,విష్ణు సహస్రనామ యజ్ఞ కార్యక్రమాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ విష్ణు సహస్ర నామ పారాయణ మండలి అధ్యక్షులు తవిడి శెట్టి స్వరాజ్ బాబు, గౌరవ అధ్యక్షులు పలబట్ల పాండురంగం,విష్ణు సహస్ర నామ పారాయణ మండలి ఆర్థిక కార్యదర్శి సభ్యులు మానపాటి విజయ రత్నం, నక్క నరసింహులు కార్యదర్శి,సహ కార్యదర్శి పి రాములు, ఎన్ మాణిక్యం, ఆర్థిక కార్యదర్శి, జనార్ధన్ మాధవాచారి, పాపిరెడ్డి, వేమారెడ్డి,యశ్వంత్, ఆంజనేయులు,హనుమంత్, లింగమయ్య,సువర్ణ మహిళా కార్యదర్శి, మానపాటి విమల, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ

**- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**విశ్వంభర, షాద్ నగర్:** కార్తీక మాసంలో 41 రోజులపాటు కఠోర దీక్షతో, అయ్యప్ప స్వామి మాలలు వేసుకుని, మండలం పాటు ప్రతిరోజు ప్రతిక్షణం అయ్యప్ప నామస్మరణలో మునిగి, రోజు కేవలం ఒక్క పూట ఆహారంతో స్వామిని సేవించే అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ చేయడం చాలా అదృష్టం అని భావిస్తారు. అలాంటి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని శుక్రవారం శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో షాద్ నగర్ మున్సిపల్ ఛైర్మన్ కొందుటి నరేందర్ ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి పాల్గొన్నారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డిని అయ్యప్ప స్వామి భక్త సమాజం సాదరంగా ఆహ్వానించి, స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్ మాజీ జెడ్పీ వైస్ ఛైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి కౌన్సిలర్లు యుగేందర్, నందిష్, శ్రీనివాస్ గౌడ్, పిల్లి శేఖర్, మాధురి నందకిషోర్, వెంకట్రాంరెడ్డి, ప్రతాప్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, ఎజాజ్.అడ్డు, తదితరులు పాల్గొన్నారు.

## గోపాలమిత్ర పశు వైద్య శిబిరం ఏర్పాటు



**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండలం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో త్రిపురారం మండలం చెన్నైపాలెం గ్రామంలో శుక్రవారం గోపాలమిత్ర పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 42 గేదెలకు పలు రకాల వ్యాధులను గుర్తించి వాటికి సంబంధించిన వైద్యాన్ని అందించారు. అలాగే 25 దూడలకు నట్టల నివారణ మందులను ఇవ్వడంజరిగింది. ఈ కార్యక్రమంలో త్రిపురారం మండల పశువైద్యాధికారి డాక్టర్ సిహెచ్ నాగేంద్ర, వీఏఎన్ రాహుల్, గోపాలమిత్ర సూపర్వైజర్. ఎం.శివారెడ్డి, గోపాల మిత్రులు, పి అశోక్, సందీప్. డి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యునిగా మొగుళ్ళపల్లి

**విశ్వంభర, ఎల్బీనగర్:** భారత ప్రభుత్వం సెంట్రల్ సెన్సర్ బోర్డు సభ్యునిగా డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్తా నియామకమయ్యారు. ఈ మేరకు సెన్సార్ బోర్డు హైదరాబాద్ రీజనల్ సఫిల్ కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. రెండవ సారి నియామకం అయిన మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా రెండు సంవత్సరాలపాటు బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ బీజేపీ అధ్యక్షుడు నడ్డ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, కేంద్ర నాయకులు డాక్టర్ కె. లక్ష్మణ్, గారికపాటి మోహన్ రావు, లంకల దీపక్ రెడ్డి సలహాలు సూచనలతో ముందుకు వెళ్తామన్నారు.



## ప్రజారోగ్య పరిరక్షణ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**విశ్వంభర, మాడుగుల:** మాడ్గుల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన 108 అంబులెన్స్ ను సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటి ఛైర్మన్ యాట గీత, మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు భట్టు కిషన్ రెడ్డి, ఎంపీడీఓ, ప్రాజెక్టు మేనేజర్ శ్రీకాంత్ మాజీ ఎంపీటీసీ కొత్త పాండు గౌడ్, కాంగ్రెస్ నాయకులు,మార్కెట్ కమిటి డైరెక్టర్లు, స్థానికులతో కలసి ఎమ్మెల్యే 108 అంబులెన్స్ సేవలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఆపద కాలంలో అత్యవసర వైద్య సేవలు పొందడానికి అంబులెన్స్ సేవలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా పీహెచ్ సీ లో ఖాళీగా వున్న సిబ్బంది వివరాలతో పాటు నెలకొన్న సమస్యలను వైద్యులు, స్థానికులు ఎమ్మెల్యే కి వివరించగా స్పందించిన ఆయన మాడ్గుల పది పడకల పీహెచ్ సీ ని 30 పడకల యూపీహెచ్ సీ గా అప్ గ్రేడ్ చేసేందుకు ప్రతిపాధనలు పంపడం జరిగిందని, ఈ విషయాన్ని మరోమారు రాష్ట్ర ఆరోగ్యశాఖ మాత్యులు దామోదర రాజనర్సింహ్మా దృష్టి కి తీసుకెళ్ళి, అవసరమైతే అసెంబ్లీ లో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ మిద్దె రాములు, ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా ఆత్మీయ సన్మానం




**విశ్వంభర, హన్మకొండ:** హన్మకొండ జిల్లా ఎల్లాపూర్ బ్రాంచ్ శ్రీ చైతన్య స్కూల్ లో 202324 విద్యా సంవత్సరం పదవ తరగతిలో 10/10 జీపీఏ, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడానికి నిరంతరం కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని శ్రీ చైతన్య మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి అధ్యక్షతన పాఠశాలలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సన్మానం జరిగింది. కార్యక్రమంలో భాగంగా పూలమాలలు, బహుమతులు, షీల్డులు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పాఠశాల ఏజీఎం పద్మాకర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థి సృజనాత్మకతో చదవాలని, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ఉన్నతమైన స్థానాన్ని చేరుకొని అందరికీ స్ఫూర్తిగా ఉండాలని అన్నారు. జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆనందం ఏ వృత్తిలో లేదని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఒక ప్రణాళిక బద్ధంగా చదువుకొని 202425 విద్యా సంవత్సరం పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ హంటర్ రోడ్ బ్రాంచ్ ప్రిన్సిపల్ సురేష్, పాఠశాల అకాడమిక్ డీన్ రజనీకాంత్, సీ ఇంచార్జీ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న మంత్రి ఉత్తమ్

**- స్వాగతం పలికిన కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్**



**విశ్వంభర, మెట్ పల్లి:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం పోచంపాడు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు రివ్యూ మీటింగ్ కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కోరారు. భారీ వర్షాల వలన తెగిపోయిన చెరువులకు మరమ్మత్తులు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. గతంలో మంజూరు కాబడిన టీ యూ ఎఫ్ ఐ డీసీ క్రింద 30 కోట్ల పనులను జరిపించేలా చర్యలు తీసుకొని కోరుట్ల మరియు మెట్ పల్లి అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రతిపాదనలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వెహికల్ షెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మేయర్

- వాహన మరమత్తులలో జాప్య నివారణకు ఆప్ రూపొందించండి
- నగర మేయర్ గుండు సుధారాణి



**విశ్వంభర, హన్మకొండ:** వాహన మరమత్తుల లో జాప్యనివారణకు ప్రత్యేక ఆప్(అప్లికేషన్) రూపొందించాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. హన్మకొండ లోని బాలసముద్రంలో మహానగర పాలక సంస్థ నిర్వహిస్తున్న వెహికల్ షెడ్ ను మేయర్ శుక్రవారం క్షేత్ర స్థాయి లో ఆకస్మికంగా తనిఖీ చేసి వాహన మరమ్మతుల తీరును అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ.. సమగ్ర చెత్త సేకరణ పూర్తి స్థాయిలో జరగాలంటే రవాణా వ్యవస్థ సక్రమంగా జరగాలని మరమ్మత్తుల కోసం షెడ్ కు వచ్చే వాహనాలకు సంబంధించిన అనుమతులు వెంటనే తీసుకోవాలని మరమ్మత్తు ల నిర్వహణ కు సంబంధించిన కాంట్రాక్టర్ స్పందించకుంటే నోటీసు అందజేసి ఇతర కాంట్రాక్టర్ ను ఏర్పాటు చేసుకోవాలని వాహనాలకు వాటర్ సర్వీసింగ్ కొరకు షెడ్ లో సంబంధిత వ్యవస్థను ఏర్పాటు చేయాలని షెడ్ లో నిల్వ ఉన్న స్క్రాప్ ను వెంటనే తొలగించాలని ఇందుకోసం టెండర్ పిలవాలని చెత్త సేకరణ తరలింపు వాహనాలకు ట్రాకింగ్ సిస్టం ను అమర్చి నూతనంగా ఏర్పాటు చేయబోయే ఆప్ కు అనుసంధానం తో పాటు వాహనాల డ్రైవర్ ల మొబైల్ నంబర్ లను లింక్ చేయాలని నూతనం గా తయారు చేసే ఆప్ యందు వాహనం మరమ్మత్తు కు రాగానే సంబంధిత వివరాల నమోదు తో పాటు అన్ని అంశాలు పొందుపరచేలా రూపొందించాలని షెడ్ లో పనిచేసే సిబ్బంది కోసం టాయిలెట్ బ్లాక్ లను ఏర్పాటు చేయాలని వాహన మరమ్మత్తులు నిర్వహించే మెకానిక్ లకు డ్రెస్ కోడ్ తో పాటు రక్షణ కోసం రక్షణ కవచాలు హెల్మెట్ లు అందజేయాలని వాహన మరమ్మత్తుల స్థితి గతులను ప్రతివారం సీఎంహెచ్ఓ ఎస్ఈ లు పర్యవేక్షించాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఈఈ లు మహేందర్, సంతోష్‌బాబు, డీఈ శివానంద్ ఏఈలు సంతోష్ ఫణి కుమార్ స్మార్ట్ సిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



**2025 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణకు గీతానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేకర్, ఉపాధ్యక్షుడు వెంకటేశం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మారెడ్డి రాజశేఖరెడ్డి మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఆహ్వానించారు.**

**- విశ్వంభర, మల్కాజ్ గిరి**

# మీ సేవలో 9 రకాల నూతన సర్వీసులు ప్రారంభం

### త్వరలో మీ సేవా లో మరికొన్ని సర్వీసులు

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని ప్రజలందరూ ఈ నూతన సర్వీసులను వినియోగించుకోవాలి. కొత్తగా రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి 6 రకాల సర్వీసులు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుండి 2 రకాల సర్వీసులు మరియు ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, సీనియర్ సిటిజెన్ డిపార్ట్మెంట్ నుండి ఒక సర్వీసు అందుబాటులోకి వచ్చాయని డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. గ్యాప్, నేమ్ చేంజ్ ఆఫ్ సిటిజెన్, లోకల్ కాండిడేట్, మైనారిటీ, ఆదాయం మరియూ కులం, క్రీమీలేయర్ మరియూ నాన్‌క్రీమీ లేయర్, సీనియర్ సిటిజెన్ మెయిన్టనేన్సు మోనిటరింగ్ సిస్టం, రెవిన్యూ డిపార్ట్మెంట్ వన్యప్రాణులచే చంపబడిన మానవ/పశువులకు పరిహారంనకు, సమ్మిల్ /టింబర్ డిపో ఫ్రెష్ & రెన్యువల్ కు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ జిల్లాలోని ప్రజలందరూ ఈ నూతన సర్వీసులను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే మీ సేవా సెంటర్ కి వచ్చిన ప్రతి సిటిజన్ కి నూతన సర్వీసుల గురించి అవగాహన కల్పించాలని మీ సేవా ఆపరేటర్లని ఆదేశించారు. ఎలాంటి తప్పులు లేకుండా అప్లికేషను చేయాలని, ప్రతి ఒక్క మీసేవా సెంటర్లో సిటిజెన్ చార్టర్, మీసేవ ఫ్లెక్సీస్, స్టేషనరీ తప్పకుండా ఉండాలని, దరకాస్తుదారునితో దురుసుగా ప్రవర్తించవద్దని తెలిపారు. నిర్ణయించిన రుసుము కంటే ఎక్కువగా తీసుకున్నట్లయితే చర్యలు తీసుకుంటామని మీసేవా కేంద్రాల యజమానులను హెచ్చరించారు.

## ఇసుక ఫిల్టర్ల ధ్వంసం

**అక్రమంగా ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు**

**తహసీల్దార్ లలిత, ఎస్ఐ వెంకటేష్**



**విశ్వంభర, ఆమనగల్:** ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి గ్రామ శివారులో అక్రమంగా కొనసాగుతున్న ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. తహసీల్దార్ లలిత ఆదేశాల మేరకు శెట్టిపల్లి గ్రామ శివారులో పలువురు నెలకొల్పిన ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. మండలంలో ఎవరైన అక్రమ ఇసుక తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమణ చేస్తే శిక్షార్హులు

**సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్**



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణం లో శుక్రవారం సబ్‌కలెక్టర్, సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ అమిత్ నారాయణ్ మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డ నందు గల సర్వే. నెం. 60,61 గల ప్రభుత్వ భూమిని ఎవరు ఆక్రమించకుండా బోర్డు పాతించడం జరిగింది. ఎవరైనా ఇట్టి ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం లేదా ఆక్రమణ చేసినచో చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేశారు. ఇందులో తహసీల్దార్, మిర్యాలగూడ, సర్వేయర్ మండల గిర్దవర్ పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంతో నికర ఆదాయం




**విశ్వంభర త్రిపురారం:** ప్రో.జయశంకర్ వ్యవసాయ విశ్వావిద్యాలయం 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం నందు జరిగిన వజ్రోత్సవాలు కార్యక్రమం లో ప్రకృతి వ్యవసాయం మరియు సేంద్రీయ వ్యవసాయం చేస్తూ అధిక నికర ఆదాయం సంపాదిస్తున్న కంపసాగర్ కేవీకే ఎర్ర చెరువు తండ గ్రామస్తుడు రైతు టి. బాలకృష్ణ కు ఉత్తమ రైతు అవార్డును ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్. చిన్న రెడ్డి ప్రధానం చేయటం జరిగింది అని కేవీక్ హెడ్ డాక్టర్. కే శ్రీనివాసరావు తెలిపారు.

## నిర్మాణంలో ఉన్న రైస్ మిల్లులో ప్రమాదం



**విశ్వంభర, నేరేడుచర్ల :** నేరేడుచర్ల లో నూతంగా నిర్మిస్తున్న రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం జరిగింది. వెల్డింగ్ చేస్తున్నా సందర్భంలో నిప్పు రవ్వలు కింద రాలి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు, గాయపడ్డ వ్యక్తులు గోపీచంద్, నాగుల్ మీరా గా గుర్తించారు. వారిద్దరిని మొదటగా హుజూర్ నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం సూర్యపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు

## బాకారం జాగీర్‌లో అయ్యప్ప మహా పడిపూజ



**విశ్వంభర, మొయినాబాద్ :** బాకారంలో అయ్యప్ప స్వాములు నిష్టగా 41 రోజు దీక్ష చేసుకొని ఇరుముడి కట్టుకొని శబరి యాత్రకు బయలుదేరారు. నిత్యం అయ్యప్ప స్వామి భక్తులకు 41 రోజులు గ్రామానికి చెందిన ఎల్గాని వెంకటేష్ గౌడ్ ప్రసాద సేవలు స్వాములకు నిర్వహించారు. అలాగే ఇరుముడి కార్యక్రమానికి కొత్తపల్లి కౌసల్య వీరారెడ్డి నిర్వహించారు . ఈ పూజ కార్యక్రమంలో మహేష్ గురు స్వామి ఆధ్వర్యంలో సన్నిధానం స్వాములకు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, తిరుపతి రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



**ప్రశాంత్ నగర్‌లోని రైలీ ప్రాపర్టీగా పేర్కొనే దుర్గామాత ఆలయాన్ని కూలగొట్టవద్దని ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమం-లో మండలం చిన్న యాదవ్, మారెడ్డి రాజశేకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్, శ్రీధర్ ఉన్నారు.**

**- విశ్వంభర, మల్కాజ్ గిరి**

# మోసం చేసిన మంత్రిపై చీటింగ్ కేసు పెట్టాలి

- ముత్తారం వేదికగా ఇచ్చిన బెల్ట్‌షాప్‌ల మాట ఏమైంది
- తనను దూషించడం కాదు అభివృద్ధిపై ఆలోచన చేయాలి
- ఏడాదిలో అభివృద్ధి చేయలేని అసమర్థుడు మంథని ఎమ్మెల్యే
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్




**విశ్వంభర, కాటారం :** మానిఫెస్టో కమిటి ఛైర్మన్‌గా ఆరు గ్యారెంటీ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన మంత్రి శ్రీధర్‌బాబుపై 420 చీటింగ్ కేసు నమోదు చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. ఆనాడు ఎన్నికల ప్రచారంలో బాగంగా ముత్తారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో బెల్ట్‌షాప్‌లను తొలగించాలనే మహిళల అభ్యర్థన మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన వెంటనే తమ అధిష్టానానికి ఈ విషయం చెప్పి బెల్ట్‌షాప్‌లు లేకుండా చేస్తామని ముత్తారం వేదికగా మహిళలకు ఇచ్చిన వాగ్దానం ఎటు పోయిందని ఆయన ప్రశ్నించారు. అలాగే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ హామీ ఇచ్చిన క్రమంలో ఓ మీడియా అడిగిన ప్రశ్నకు ఎవడు చెప్పాడంటూ సమాధానం ఇచ్చాడని, ఇదేనా చదువుకున్న వ్యక్తి సంస్కారం అని ఆయన అన్నారు. మంథని ఎమ్మెల్యే సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి మాట్లాడుతూ చదువు రాని నాయకుడి మూలంగా మంథని అభివృద్ధిలో వెనుకబడిపోయిందని ఎద్దేవా చేశారని, కానీ ఉన్నత చదువులు చదివాడని గొప్పలు చెప్పే మంథని ఎమ్మెల్యే సంస్కారం గురించి ఆలోచన చేయాలన్నారు. గత 40ఏండ్లుగా ఒకే కుటుంబానికి ఓట్లు వేసి అధికారం అప్పగిస్తే ఏం అభివృద్ధి పనులు చేశారో, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. తాము ప్రభుత్వ పనితీరును వైఫల్యాలను ప్రశ్నిస్తే కింది స్థాయి నాయకులతో దూషించేలా మాట్లాడించడం, తన సామాజిక వర్గ నాయకులతోనే తనపై దాడులు చేయించడం సరికాదని, మంథని అభివృద్ధిపై ఆలోచన చేయాలని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో చిన్నకాళేశ్వరం పూర్తి చేస్తామని మాట్లాడిన మంత్రి ఆనాడు ఎమ్మెల్యేగా ఇరిగేషన్ అధికారులతో సాధారణంగానే రివ్యూచేశానని, ఆ ప్రాజెక్టు పేరుతోనే తాము అధికారంలోకి వస్తామని మాట్లాడలేదా అని ఆయన ప్రశ్నించారు. ఓడేడు వంతెనపై ఆనాడు ప్రభుత్వంపై నిందెలు మోపిన మంత్రి ఈనాడు తమ ప్రభుత్వం అధికారంలోనే ఉంది కదా ఇప్పుడు ఒడేడ్ బ్రిడ్జి ఎందుకు పూర్తి చేయించడం లేదన్నారు. అలాగే కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి వరకు రహదారి నిర్మాణం కోసం కేవలం రూ.4కోట్ల నిధులు మంజూరీ చేయలేకపోతున్నారని, ఈ రహదారి నిర్మాణంతో భూపాలపల్లి వెళ్లేందుకు దూరభారం తగ్గుతుందని ఆయన వివరించారు. ఏడాది కాలంలో అనేకం చేస్తామని మభ్యపెట్టి ఒక్క అభివృద్ధి పని చేయాలేని అసమర్థుడు మంథని ఎమ్మెల్యే అని ఆయన విమర్శించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన మంత్రి శ్రీధర్‌బాబుపై 420కేసు నమోదు చేయాలని పోలీసులకు రిజిష్టర్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేయడం జరుగుతుందని పోలీసులు స్పందించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**పాల్గొన్న ఎమ్మెల్సీ ఎంపీ కోటిరెడ్డి**

**విశ్వంభర, త్రిపురారం:** నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోనీ పలు గ్రామాల లబ్ది దారులకు ఉమ్మడి నల్గొండ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ యం.సి కోటిరెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. పలు మండలాలకు చెందిన 36 మంది లబ్ధిదారులకు 9,73,000 లక్షల రూపాయల విలువగల చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో శ్రీనివాస ఫంక్షన్ హాల్ నందు చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కెవి రామారావు, ఎక్కలూరి శ్రీనివాస్ రెడ్డి, తాజా మాజీ జడ్పీటీసీ అంగోతు సూర్య భాషా నాయక్, అనుముల మాజీ ఎంపీపీ సలహాదారుడు అల్లి పెద్దిరాజు, మాజీ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బివి రమణ రాజు,మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి,బీఆర్ఎస్ మండల నాయకులు నాసర్ రెడ్డి,తాజా మాజీ సర్పంచ్లు కోటియా నాయక్,కృష్ణ రెడ్డి, పోలేపల్లి అంజయ్య,ముత్తయ్య,శంకర్, బిచ్చ నాయక్, మాజీ సర్పంచ్ రంగ సాయి, మాజీ ఎంపీటీసీకుర్రదేవునాయక్, కాసిం, మధు, చెక్కుల లబ్ధిదారులతో పాటు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే బి.ఎల్.ఆర్**



**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ మండలం అలగడప గ్రామంలో నూతనంగా 3.25 కోట్లతో మంజూరు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల నూతన భవన శంకుస్థాపన కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద మధ్యతరగతి బాలికలకు మెరుగైన ఉన్నత విద్యలను అందించాలనే లక్ష్యంతో ఇంటర్మీడియట్ కళాశాల భవన నిర్మాణం చేయడం జరుగుతుంది అని అన్నారు. ప్రభుత్వం పేద మధ్యతరగతి, విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన విద్యను అందించేందుకు కస్తూర్బా, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 40 శాతం డైట్,కాస్మోటిక్ చార్జీలను పెంచి వారికి అండగా ఉందని అన్నారు. ఆడబిడ్డ చదువు కేవలం ఒక ఇంటికి మాత్రమే కాదు, మొత్తం సమాజాన్ని ప్రభావితం చేస్తుంది అని అన్నారు. కావున బాలికలు అందరూ మంచిగా చదువుకొని విద్యలో రాణించాలని మీకు ఎలాంటి అవసరాలు ఉన్నా నేను అండగా ఉంటా అని అన్నారు. కళాశాల భవనాన్ని త్వరగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం వరకు ఇంటర్మీడియట్ క్లాసులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, ఎంఈఓ, కాంగ్రెస్ నాయకులు మరియు బి.ఎల్.ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## రాములు మృతి తీరని లోటు

**కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్**



**విశ్వంభర, గట్టుప్పల :** మండల పరిధిలోని వెల్మకన్నే గ్రామానికి చెందిన ఏర్పుల రాములు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతు గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గట్టుప్పల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రావుల రమేష్ రాములు సేవలు మరువలేవని గుర్తు చేశారు. అతని మృతికి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ సంతాపం ప్రకటించారు. అనంతరం అంత్యక్రియలకు హాజరై 5000 రూపాయలను కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాములు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ని స్ఫూర్తిగా తీసుకుంటూ నిత్యం తన అడుగుజాడల్లో నడుస్తూ పేద ప్రజలకు తనకు తోచిన సహాయం అందించడం తృప్తిగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గట్టుప్పల మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, వెల్మకన్నె గ్రామ శాఖ అధ్యక్షుడు నూర్ మహమ్మద్, టేకుమట్ల శ్రీరాములు, భీమనపల్లి పెంటయ్య, యాదగిరి రెడ్డి ,భీమనపల్లి యాదయ్య ,దిలీప్ కుమార్, షేక్ సైదులు ,భీమనపల్లి యాదయ్య నెంబర్ , నరసింహ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి లోను కావొద్దు

**విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి**

**ప్రిన్సిపల్ బి.మతేశ్వరి**

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించటం కోసం ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంను ప్రిన్సిపాల్ బి. మాతేశ్వరి అధ్యక్షత నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మెడికల్ ఆఫీసర్ డా. ప్రీతి స్వరూప్, హెచ్.ఈ.ఒ. ఇస్తారి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి. మీరు పదే పదే వత్తిడికి గురి కావొద్దని తెలిపారు. మీకు ఉన్న మానసిక సమస్యల నివారణకు టోల్ ఫ్రీ నెంబర్ 14416 ద్వారా నివృత్తి చేసుకొని జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకొని ముందుకు నడవాలని కోరారు. ఈ కార్యక్రమం లో స్టూడెంట్ కౌన్సిలర్స్ మంగ్య నాయక్, మాధవి, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు ఉప్పల ముత్యాలు, కాలేజ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.










## న్యూయార్క్ లో టాస్క్ సీఓఓ తో తెలంగాణ యువ ఆవిష్కర్తలు

**విశ్వంభర, ఆమనగల్లు :** యునైటెడ్ స్టేట్స్ లోని న్యూయార్క్ నగరంలో 1 ఎం, 1 బీ ఎనిమిదవ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్ జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదుగురు యువ ఆవిష్కర్తల బృందంతో స టాస్క్ సి.ఓ.ఓ, కల్వకుర్తి కాంగ్రెస్ నాయకులు, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన గ్లోబల్ స్టేజ్ ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్కిన్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నీ దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టేందుకు యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

## హెలీప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర



**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని బాగిర్తిపేట వద్ద నిర్మించిన హెలిప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు. నేడు భూపాలపల్లి నియోజకవర్గంలో మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, దామోదర్ రాజనర్సింహ పర్యటన నేపథ్యంలో శుక్రవారం ఉదయం రేగొండ మండలం రామన్నగూడెం క్రాస్ రోడ్డు వద్ద హెలిప్యాడ్ నిర్మించిన పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. నిర్మాణ పనులు పూర్తయిన సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

**నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉండాలని**

## రాజ శ్యామల యాగం

**విశ్వంభర, తలకొండపల్లి:** తల కొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని వెలసిన శ్రీవేదాద్రి లక్ష్మీనరసింహ స్వామి గుట్టపై రాజ శ్యామల యాగాన్ని బీ.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సంగీత శ్రీనివాస్ యాదవ్ దంపతులు వేద బ్రాహ్మణోత్తములతో నిర్వహించారు. వేద పండితులు గూడ యాదగిరి నరసింహయ్య శర్మ, శ్రీనివాస మూర్తి, మురళి శర్మ,శరత్ చంద్ర శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేకంగా అభిషేకం చేసి, రాజ్యశ్యామల మాతాకి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రామ మండల నియోజకవర్గ ప్రజలు సస్యశ్యామలంగా ఉండాలని నిర్వహించామని తెలిపారు. అనంతరం వేద బ్రాహ్మణులు ఆశీర్వచనం వారికి అందించారు. ఈ కార్యక్రమంలో పండితులు,గ్రామస్థులు, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జైలులోనే పుష్పరాజ్



(మొదటి పేజీ తరువాయి)

పూచీకత్తు బాండ్లు తీసుకుని జైలుకు వెళ్లి అధికారులతో మాట్లాడారు. అయితే ఈ ప్రక్రియ కొన్ని గంటల పాటు కొనసాగింది. ఇక విడుదల ప్రక్రియలో జాప్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన అల్లు అరవింద్.. చంచల్‌గూడ జైలు నుంచి ఆయన నివాసానికి వెళ్లిపోయారు. జైలు వద్దకు భారీగా చేరుకున్న అభిమానులు బన్నీ శుక్రవారం రాత్రి విడుదల అవుతారని ఆత్రుతగా ఎదురుచూశారు.

**నాటకీయ పరిణామాల మధ్య పుష్పరాజ్ అరెస్ట్...**

ఒక సినిమా థియేటర్‌లో జరిగిన దుర్ఘటన పాన్ ఇండియా స్టార్ అరెస్ట్ దాకా వస్తుందని ఊహించలేదెవరూ..! పుష్ప 2 సూపర్‌డూపర్ హిట్‌లో జోష్‌లో ఉన్న బన్నీ తలుపులు తట్టారు హైదరాబాద్ పోలీసులు. యువ్వార్ అండర్ అరెస్ట్ అంటూ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వైద్యపరీక్షల తర్వాత మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచటంతో రెండు వారాల రిమాండ్ విధించింది న్యాయస్థానం. అనంతరం నాటకీయ పరిణామాలతో హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేయడం, ఆ తర్వాత మధ్యంతర బెయిల్ పిటిషన్ చకచకా జరిగిపోయాయి. చివరికి హీరో రేంజ్‌లోనే వెంటనే అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. పుష్ప సిన్మాతో వరల్డ్ వైడ్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న అల్లు అర్జున్ అరెస్ట్ అయ్యారన్న వార్తతో దేశమంతా షాక్.

పుష్ప 2 రిలీజ్ సందర్భంగా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఆమె కొడుకులు ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ కేసుతో సంబంధం ఉందంటూ హీరో అల్లు అర్జున్‌ని అరెస్ట్ చేశారు చిక్కడపల్లి పోలీసులు. వారంలో వెయ్యి కోట్ల రూపాయల కలెక్షన్స్‌తో రికార్డులన్నీ బ్రేక్ చేస్తోంది పుష్ప 2. ఈ సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన థాంక్యూ ఇండియా మీట్‌లో పాల్గొని హైదరాబాద్‌కి తిరిగి రాగానే అరెస్టయ్యారు పుష్పరాజ్. డిసెంబర్ 4వ తేదీన పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వచ్చినప్పుడు అభిమానులు పోటెత్తారు. తొక్కిసలాటలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి బీఎన్ఎస్ 105, 118(1) రెడ్ విత్ 3/5 BNS సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అల్లు అర్జున్‌ని ఏ11గా చేర్చారు.

అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చినప్పుడు భద్రతాపరంగా జాగ్రత్తలు తీసుకోనందుకు థియేటర్ యాజమాన్యంపై కూడా వివిధ సెక్షన్ల కింద చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. తనపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ.. అల్లు అర్జున్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిపై విచారణకు ముందే పోలీసులు అల్లు అర్జున్‌ని అరెస్ట్ చేసి నాంపల్లి కోర్టుకు తరలించారు. హీరో వచ్చినా థియేటర్ యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వలేదని, ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదనేది పోలీసుల వెర్షన్. అయితే తాను రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందనడం అవాస్తవమంటున్నారు అల్లు అర్జున్. సినిమా విడుదలైనప్పుడు థియేటర్‌కు వెళ్లడం సహజమేనని, కానీ ఇలాంటి సంఘటన జరుగుతుందని తాను ఊహించలేదని ఆయన స్టేట్మెంట్ ఇచ్చారు. తొక్కిసలాట ఘటనపై కేసు నమోదు కాగానే జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేశారు బన్నీ. మృతురాలి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఆర్థిక సాయం కూడా ప్రకటించారు. తొక్కిసలాట ఘటనలో కొందరి అరెస్ట్‌తో హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. అయితే ఢిల్లీ సక్సెస్ మీట్ నుంచి తిరిగి రాగానే పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అరెస్ట్ సందర్భంగా బన్నీ ఇంటి దగ్గర హైడ్రామా చోటుచేసుకుంది. తండ్రిని కారు నుంచి దించేసి పోలీసులతో వెళ్లిపోయారు అల్లు అర్జున్. అల్లు అర్జున్ అరెస్ట్‌పై న్యాయస్థానంలో సుదీర్ఘ వాదనలు జరిగాయి. హైకోర్టులో క్వాష్ పిటిషన్ విచారణలో ఉందని, అల్లు అర్జున్‌కి కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని వాదించారు ఆయన తరుపు లాయర్లు. వాదోపవాదాల తర్వాత నాంపల్లి కోర్టు అల్లు అర్జున్‌కి రెండు వారాల రిమాండ్ విధించింది. దీంతో ఆయన్ని చంచల్‌గూడ జైలుకు తరలించారు. వారం రోజులుగా వరల్డ్ వైడ్ ప్రభంజనం సృష్టిస్తోంది పుష్ప 2 సిన్మా. నార్త్‌లో కూడా కలెక్షన్ల దుమ్మురేగుతోంది. ఈ సమయంలో సక్సెస్ మీట్లలో పాల్గొంటున్న హీరో అరెస్ట్ వార్త దేశమంతా చర్చనీయాంశమైంది. హీరో అరెస్ట్ సంచలనం సృష్టించటంతో.. సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించారు. చట్టం తన పనితాను చేసుకుపోతుందన్న సీఎం.. ఇందులో తన జోక్యమేమీ ఉండదన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని రేవంత్‌రెడ్డి స్పందించారు. అయితే విపక్ష పార్టీల స్పందన మరోలా ఉంది. అల్లు అర్జున్ అరెస్ట్‌ను బీఆర్ఎస్, బీజేపీ ఖండించాయి. జాతీయ పురస్కారం అందుకున్న అల్లు అర్జున్‌ని అరెస్ట్ చేయడం.. పాలకుల అభద్రతా భావానికి పరాకాష్టన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు. అల్లు అర్జున్ అరెస్ట్ సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తప్పుపట్టారు. ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సైతం అల్లు అర్జున్ అరెస్ట్‌ని ఖండించారు. వీరికి తోడు సినీ ప్రముఖులు అల్లు అర్జున్ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు.

థియేటర్‌లో తొక్కిసలాటకు హీరో కారణమెలా అవుతారన్న చర్చ మొదలైంది. భద్రతాపరమైన వైఫల్యాలకు నటీనటులను బాధ్యులనెలా చేస్తారని సంధ్య థియేటర్ ఘటనపై పరోక్షంగా స్పందించారు బాలీవుడ్ నటుడు వరుణ్‌ధావన్. అసలా ప్రీమియర్‌కి అనుమతి ఉందా? అల్లు అర్జున్ థియేటర్‌కి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉందా అన్నదానిపై భిన్నవాదనలు నడుస్తున్నాయి. తాము పోలీసులకు ముందే లేఖ రాశామని థియేటర్ యాజమాన్యం చెబుతుంటే, పోలీసులు పర్మిషన్ ఇవ్వలేదన్నారు జీపీ. అర్జున్ థియేటర్‌కి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉందని ఆయన లాయర్లు వాదిస్తే.. హీరో హీరోయిన్లని పిలవొద్దని థియేటర్ యాజమాన్యానికి పోలీసులు ముందే చెప్పారని జీపీ వాదించారు. అదీ కాక థియేటర్‌కు ఓపెన్ టాప్ వాహనంలో ర్యాలీ రావడంతోనే తొక్కిసలాట జరినట్లు కోర్టుకు నివేదించారు.

అరెస్ట్ గురించి తెలియగానే చిరంజీవి దంపతులతో పాటు మెగాస్టార్ సోదరుడు నాగబాబు అల్లు అర్జున్ ఇంటికి వెళ్లారు. సినీరంగ ప్రముఖులు, అభిమానులు కోర్టు దగ్గరికి తరలివచ్చారు. అల్లు అర్జున్‌పై నాన్‌బెయిలబుల్ కేసు పెట్టడంపై అభిమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నేరం రుజువైతే బీఎన్ఎస్ 105 సెక్షన్ కింద ఒక వ్యక్తి మరణానికి పరోక్షంగా కారణమైతే.. 5 నుంచి పదేళ్లు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. బీఎన్ఎస్ 118 (1) కింద ఏడాది నుంచి పదేళ్ల పాటు జైలు పడే అవకాశం ఉంది. తొలిసారి టాలీవుడ్ అగ్రహీరో అరెస్ట్ కావడం తెలుగురాష్ట్రాలనే కాదు యావత్‌దేశాన్నీ కుదిపేస్తోంది.

సిన్మా ఫంక్షన్ జరిగితే, ప్రముఖ హీరో హీరోయిన్లు వస్తున్నారంటే జనం సహజంగానే పోటెత్తుతారు. చాలావరకు ఫంక్షన్లు సాఫీగానే జరిగినా.. అభిమానుల అత్యుత్సాహంతోనో, జన సమ్మర్దంతో కొన్నిచోట్ల పరిస్థితి అదుపుతప్పుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు గతంలోనూ కొన్ని జరిగాయి. అభిమానులు పరిమితికి మించి రావటంతో నోవాటెల్‌లో దేవర సిన్మా ఈవెంట్‌ని గతానుభవాలతో రద్దు చేయాల్సి వచ్చింది. గతేడాది జనవరిలో మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య విజయోత్సవ వేడుకలను హనుమకొండ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించారు. గేట్ ఓపెన్ చేయగానే అభిమానులు దూసుకురావటంతో తొక్కిసలాట జరిగి కొంతమంది గాయపడ్డారు.

తాజాగా సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో యాజమాన్యం పైనే కేసు పెడతారనుకున్నారు. గానీ.. చివరికది అల్లు అర్జున్ గుమ్మం దాకా వస్తుందని ఎవరూ ఊహించలేకపోయారు. ఓ పక్క పుష్ప 2 సిన్మా రికార్డులు బ్రేక్ చేస్తున్న టైంలో.. ఇలాంటి బ్రేకింగ్ న్యూస్ వినాల్సి వస్తుందని అనుకోలేదెవరూ..! అందుకే దేశమంతా ఇప్పుడు అల్లు అర్జున్ అరెస్ట్ గురించే చర్చ.

ఇక చివరికి రిమాండ్‌కి నాంపల్లి కోర్టు ఆదేశించిన.. కాసేపటికే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అరెస్టే ఓ సంచలనమైతే.. కోర్టుల్లోవాదోపవాదాలు, తీర్పులతో కొన్ని గంటలపాటు నరాలు తెగే ఉత్కంఠ. నాంపల్లి కోర్టు రెండు వారాల రిమాండ్ విధిస్తే, అల్లు అర్జున్‌ని జైలులో అడుగుపెట్టగానే మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది హైకోర్టు. అల్లు అర్జున్‌పై పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని అభిప్రాయపడ్డ హైకోర్టు.. 4వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో అప్పటిదాకా టెన్షన్ పడ్డ ఫ్యామిలీ, ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు. చంచల్‌గూడ జైల్లోకి అడుగుపెట్టారు.

**అల్లు అర్జున్ అరెస్టు.. స్పందించిన రైల్వే మంత్రి..**

అల్లు అర్జున్ అరెస్టుపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. క్రియేటివ్ ఇండస్ట్రీపై కాంగ్రెస్‌కు గౌరవం లేదని మరోసారి రుజువైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం వైఫల్యంతోనే సంధ్య థియేటర్ వద్ద దుర్ఘటన చోటుచేసుకుందన్నారు. అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో ట్విటర్ వేదికగా స్పందిస్తూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ''క్రియేటివ్ ఇండస్ట్రీపై కాంగ్రెస్‌కు గౌరవం లేదనే విషయం అల్లు అర్జున్ అరెస్టుతో మరోసారి రుజువైంది. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం పేలవమైన ఏర్పాట్లతోనే సంధ్య థియేటర్ వద్ద దుర్ఘటన జరిగింది. ఈ లోపాలను కప్పిపుచ్చుకునేందుకే.. ప్రభుత్వం ఇప్పుడు ప్రయత్నాలు చేస్తోంది. సినీ ప్రముఖులను లక్ష్యంగా చేసుకోవడం కాకుండా బాధితులను ఆదుకోవడంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించాలి. ఆ రోజు ఏర్పాట్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాది కాలంలో ఇలాంటి ఘటనలు వరుసగా కొనసాగడం బాధాకరం'' అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

**అల్లు అరవింద్‌కు ఏపీ సీఎం చంద్రబాబు ఫోన్..**

అల్లు అరవింద్‌కు ఏపీ సీఎం చంద్రబాబు ఫోన్ చేశారు. అల్లు అర్జున్ అరెస్టు నేపథ్యంలో ఆయనతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. అరెస్టు ఘటనపై ఆందోళన చెందవద్దని చంద్రబాబు సూచించారు.

**అల్లు అర్జున్ కేసు.. ఆర్జీవీ నాలుగు ప్రశ్నలు..**

అల్లు అర్జున్ అరెస్టుపై దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా రియాక్ట్ అయ్యారు. 'అల్లు అర్జున్ కేసు గురించి సంబంధిత అధికారులకు నా 4 ప్రశ్నలు' అంటూ పోస్టు పెట్టారు. ఆర్జీవీ అడిగిన ప్రశ్నలివీ..పుష్కరాలు, బ్రహ్మోత్సవాల తోపులాటలో భక్తులు చనిపోతే దేవుళ్లను అరెస్టు చేస్తారా?

ఎన్నికల ప్రచారాల తొక్కసలాటలో ఎవరైనా మరణిస్తే రాజకీయ నాయకులని అరెస్టు చేస్తారా?

సినిమాల ప్రీ రిలీజ్ ఈవెంట్స్‌లో ఎవరైనా చనిపోతే హీరో, హీరోయిన్లని అరెస్టు చేస్తారా?

భద్రత ఏర్పాట్లను పోలీసులు, నిర్వాహకులు తప్ప హీరోలు, నాయకులు ఎలా కంట్రోల్ చేయగలరు?

**అల్లు అర్జున్‌పై కేసు విత్‌డ్రా చేసుకుంటాను: మృతురాలు రేవతి భర్త..**

సినీ నటుడు అల్లు అర్జున్ పై నమోదైన తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన రేవతి భర్త భాస్కర్ స్పందించారు. ఈ కేసును విత్ డ్రా చేసుకుంటానని తెలిపారు. అల్లు అర్జున్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ ఘటనతో ఆయనకు సంబంధం లేదని పేర్కొన్నారు. ''నా కుమారుడు 'పుష్ప 2' సినిమా చూస్తానంటే సంధ్య థియేటర్‌కు తీసుకెళ్లా. ఇందులో అల్లు అర్జున్ తప్పేం లేదు. ఆయన్ను అరెస్టు చేయనున్నట్టు పోలీసులు నాకు సమాచారం ఇవ్వలేదు. ఆస్పత్రిలో ఉన్న నేను ఫోన్‌లో అరెస్టు వార్త చూశా. కేసు విత్‌డ్రా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నా'' అని భాస్కర్ ఓ వీడియోలో పేర్కొన్నారు.

---

అల్లు అర్జున్ హంగామా చేయకపోతే..

## ఈ గొడవ అయ్యేదే కాదు



**విశ్వంభర, హైదరాబాద్ :** అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చి ఎలాంటి హంగామా చేయకుండా సినిమా చూసి వెళ్లిపోయి ఉంటే.. ఇంత గొడవ అయ్యేది కాదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఆజ్ తక్' నిర్వహించిన చర్చా వేదికలో పాల్గొన్న ఆయన.. అల్లు అర్జున్ అరెస్టు ఘటనపై మాట్లాడారు.

''ఈ దేశంలో సల్మాన్‌ఖాన్, సంజయ్‌దత్‌లు ఎందుకు అరెస్టు అయ్యారు. ఒక సాధారణ పౌరుడి దగ్గరి నుంచి ప్రధాని వరకూ.. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం అందరికీ సమానంగా వర్తిస్తుంది. 'పుష్ప 2' విడుదల సందర్భంగా బెనిఫిట్ షోకే కాకుండా టికెట్ ధరలు పెంచుకోవడానికీ మేమే అనుమతి ఇచ్చాం. అయితే, ఆ షోకు ముందస్తు అనుమతి లేకుండా అల్లు అర్జున్ అక్కడకు వచ్చారు. ఆయన్ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. ఈ తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసి, థియేటర్, మేనేజ్‌మెంట్ వాళ్లను అరెస్ట్ చేశారు. 10 రోజుల తర్వాత అల్లు అర్జున్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆయనకు బెయిల్ కూడా మంజూరు చేసింది. కావాలని సినిమా నటుడిని అరెస్టు చేశారని చర్చ మొదలు పెట్టారు. అతడు సినిమా స్టారా? పొలిటికల్ స్టారా? అన్న విషయాన్ని మా ప్రభుత్వం చూడదు. నేరం ఎవరు చేశారన్న దాన్నే చూస్తాం''

''అక్కడ అల్లు అర్జున్ థియేటర్‌కు వచ్చి.. సినిమా మాత్రమే చూడలేదు. కారులో నుంచి బయటకు వచ్చి చేతులు ఊపుతూ ర్యాలీలా అభివాదం చేస్తూ వెళ్లారు. ఆయన ఎలాంటి హంగామా లేకుండా వచ్చి సినిమా చూసి ఉంటే ఈ గొడవ అయ్యేదే కాదు. అయినా కూడా జరిగిన ఘటనకు సంబంధించి ఏ11 కింద ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన కారణంగా ఒక మహిళ చనిపోయింది. దీనికి బాధ్యులు ఎవరు? 9 ఏళ్ల పిల్లాడు చావు బతుకుల మధ్య ఉన్నాడు. అందుకు ఎవరు బాధ్యత వహిస్తారు? ఆయన సినిమా చూడాలనుకుంటే స్టూడియోలో స్పెషల్ షో వేసుకుని చూడొచ్చు. ఇంట్లో కూర్చొని కూడా చూడొచ్చు. మీరు ప్రేక్షకులు, అభిమానులతో కలిసి చూడాలనుకుంటే, ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేదంటే, మేనేజ్‌మెంట్‌కు సమాచారం ఇస్తే, వాళ్లు ఏర్పాట్లు చూసుకుంటారు. అలా కాకుండా సడెన్‌గా వచ్చేస్తే, ఉన్న కొద్దిమంది సిబ్బందితో వాళ్లు ఎలా సిద్ధం కాగలరు''

''అల్లు అర్జున్ చిన్నప్పట్నుంచి నాకు తెలుసు. కావాలని ఆయన్ను ఎందుకు అరెస్ట్ చేస్తాం? అల్లు అర్జున్ మేనమామ చిరంజీవి కాంగ్రెస్ నేత. ఆయన సొంతమామ చంద్రశేఖర్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లోనే ఉన్నారు. అల్లు అర్జున్ సతీమణి కుటుంబం మాకు బంధువులవుతారు. పోలీసులు చేయాల్సిన పని వాళ్లు చేస్తారు. లా అండ్ ఆర్డర్ ప్రకారం నడుచుకుంటారు. అల్లు అర్జున్ అరెస్టయితే, ఇంత చర్చిస్తున్నారు కదా! ఆ ఘటనలో చనిపోయిన మహిళ కుటుంబం ఎలా ఉంది? వాళ్ల పరిస్థితి ఏంటి? తీవ్రంగా గాయపడిన ఆ పిల్లాడు ఎలా ఉన్నాడు? అతడు కోలుకోవడానికి ఎంత సమయం పడుతుంది? ఆ తర్వాత ఎలా బతుకుతాడు? అన్న విషయాలను ఒక్కరు కూడా అడగలేదు. అల్లు అర్జున్ ఫిల్మ్‌స్టార్. సినిమాలు చేయడం ఆయన వ్యాపారం. డబ్బులు పెడతారు.. సంపాదిస్తారు. మీకు ఏమొస్తుంది? నాకేమొస్తుంది? రియల్ ఎస్టేట్ చేసే వ్యక్తులు ఉన్నారు. ప్లాట్‌లు అమ్ముతారు.. డబ్బులు సంపాదిస్తారు. ఈ దేశం కోసం భారత్‌పాకిస్థాన్ బోర్డర్‌కు వెళ్లి ఏమైనా యుద్ధం చేశారా? మూవీ తీస్తున్నారు. డబ్బులు వస్తున్నాయి. నా ఫేవరెట్ నటుడు కృష్ణ. ఆయన ఇప్పుడు లేరు. నాకు నేనే పెద్ద స్టార్‌ని. నాకంటూ అభిమానులు ఉండాలి కానీ, నేనెవరికీ అభిమానిని కాదు.'' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

---

## కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలి

- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



**ఢిల్లీ:** కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నెలకొల్పాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటును పేర్కొన్న విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. కాజీపేటలో పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ (పీవోహెచ్) వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ తర్వాత సైతం కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోరుతూ తాను లేఖ రాశానని సీఎం వివరించారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు అనేది కాజీపేట వాసుల కల మాత్రమే కాదని.. యావత్ తెలంగాణ స్వప్నమని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు.

వికారాబాద్‌కృష్ణా స్టేషన్ మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలు మార్గం నిర్మించాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ మార్గం నిర్మిస్తే దక్షిణ తెలంగాణలో మారుమూలన వెనుకబడి ఉన్న పరిగి, కొడంగల్, చిట్లపల్లె, టేకల్ కోడ్, రావులపల్లి, మాటూరు, దౌల్తాబాద్, దామరగిద్ద, నారాయణపేట్, మక్తల్ అభివృద్ధి చెందడంతో పాటు తాండూర్ సమీపంలోని సిమెంట్ క్లస్టర్, ఇతర పరిశ్రమలు అభివృద్ధికి అవకాశం ఉంటుందని వివరించారు. ఈ మార్గంతో వికారాబాద్ జంక్షన్ నుంచి కృష్ణా స్టేషన్ల మధ్య 70 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. కల్వకుర్తిమాచర్ల మధ్య నూతన రైలు మార్గం మంజూరు చేయాలని రైల్వే శాఖ మంత్రిని సీఎం కోరారు. కల్వకుర్తి నుంచి వంగూరుకందుకూరుదేవరకొండచలకుర్తితిరుమలగిరి మీదుగా మాచర్ల వరకు తాము ప్రతిపాదించే నూతన మార్గం ప్రతిపాదిత గద్వాలడోర్నకల్, ఇప్పటికే ఉన్న మాచర్ల మార్గాలను అనుసంధానిస్తుందని సీఎం వివరించారు. ఈ మార్గం నిర్మిస్తే సిమెంట్ పరిశ్రమలతో పాటు అటవీ ఉత్పత్తుల విక్రయానికి ప్రయోజనం కలుగుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. ఈ మార్గంతో సికింద్రాబాద్, గుంటూరు, డోన్ సెక్షన్ల మధ్య అనుసంధానత కలిగి శ్రీశైలం వెళ్లే భక్తుల సులభతర ప్రయాణానికి అవకాశం కల్పిస్తుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.

డోర్నకల్‌మిర్యాలగూడ (పాపటపల్లిజాన్ పహాడ్), డోర్నకల్ గద్వాల ప్రతిపాదిత రైలు మార్గాలను పునఃపరిశీలించాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు రైలు మార్గాలు ఖమ్మం జిల్లాలోని సారవంతమైన భూములు, చెరకు పరిశ్రమలు, గ్రానైట్ పరిశ్రమలు, సైబరియన్ వలస పక్షుల కేంద్రం, భారతదేశంలోని అతి పెద్ద బౌద్ధ స్తూపం, పాలేరు రిక్రియేషన్ ప్రాంతాల మీదుగా ఉన్నాయని సీఎం తెలిపారు. పాలేరు శాసనసభ నియోజకవర్గంలోని ఈ ప్రాంతంలో భూముల ధరలు భారీగా ఉన్నాయని, అత్యధికులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన రైతులేనని సీఎం వివరించారు. ఇక్కడ విలువైన భూముల సేకరణ రైల్వే శాఖకు భారంగా మారుతుందని.. ఆ ప్రతిపాదిత మార్గాలను మార్చి డోర్నకల్ నుంచి వెన్నారంమన్నెగూడెం అబ్బాయిపాలెంమరిపెడ మీదుగా మోతె వరకు రైల్వే లైన్లను మార్చాలని సీఎం కోరారు. ఈ ప్రాంతాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయని.. రైలు మార్గాలు కూడా లేవని తెలిపారు. పైగా గతంలోని మార్గాలతో పోలిస్తే 19 కి.మీ. దూరం తగ్గుతుందని సీఎం వివరించారు. ఈ రెండు మార్గాల అలైన్‌మెంట్‌ను పునఃపరిశీలించాలని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, సురేశ్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు.

---

## 'మన హక్కు హైదరాబాద్' కర్టెన్ రైజర్, ప్రచార గీతం విడుదల

**విశ్వంభర, జూబ్లీహిల్స్:** ప్రజల, ప్రభుత్వ భాగస్వామ్యంతో సామాజిక చైతన్యాన్ని కలిగించే పలు కార్యక్రమాలు చేపడుతున్న హక్కు ఇనిషేటివ్ సంస్థ మన హక్కు హైదరాబాద్ కర్టెన్ రైజర్ ప్రచార గీతాన్ని శుక్రవారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో ఆవిష్కరించింది. ఈ నెల 14వ తేదీ నుంచి జుబ్లీహిల్స్ లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ లో వై డిమాలిషన్స్ ఇన్ హైదరాబాద్ అనే చర్చా కార్యక్రమాన్ని చేపట్టబోతోంది. ఈ చర్చా కార్యక్రమంలో పలువురు మేధావులు, పౌరుల పాల్గొంటారు. ఈ నేపథ్యంలో మన హక్కు హైదరాబాద్ కర్టెన్ రైజర్ ప్రచార గీతాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కోటి, ఈ పాటను కంపోజ్ చేసిన సింగర్ అనుదీప్ దేవ్, దర్శకుడు యదు వంశీ, హక్కు ఇనిషేటివ్ డైరెక్టర్స్ రాహుల్ హేమ్నాని, అనూజ్ పార్థి, సంస్థ ప్రతినిధి వివేకానంద్, ప్రముఖ ఫిలిం జర్నలిస్టులు సురేష్ కొండేటి, ప్రభు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోజర్నలిస్ట్ సురేష్ కొండేటి మాట్లాడుతూ మన హక్కు సాంగ్ ను లాంఛ్ చేసినందుకు కోటి గారికి థ్యాంక్స్. హైదరాబాద్ గురించి ఎంతో అవగాహన చేసుకుని ఈ పాట రాశారు. మ్యూజిక్, లిరికల్ పరంగా సాంగ్ అద్భుతంగా ఉంది. చాలా బాగా పాడారు. ఎంతోమందికి ఇన్స్పిరేషన్ కలిగించేలా పాట ఉండటం హ్యాపీగా ఉంది. అన్నారు.జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ హక్కు అని మాట్లాడిన ప్రతి చోటా బాధ్యత ఉంటుంది. హైదరాబాద్ నగరాన్ని శుభ్రంగా, ప్రశాంతంగా ఉంచుకునే బాధ్యత మనందరి మీదా ఉంది. ఇలాంటి మంచి కార్యక్రమంతో ముందుకు వచ్చిన హక్కు ఇనిషేటివ్ సంస్థకు నా అభినందనలు తెలుపుతున్నా. అన్నారు.దర్శకుడు యదు వంశీ మాట్లాడుతూ ఎన్నో మంచి కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న హక్కు ఇనిషేటివ్ వారికి నా అభినందలు. మన వాయిస్ వినిపించేందుకు, మనకు సపోర్ట్ గా నిలిచేందుకు వారు చేస్తున్న ప్రయత్నం స్ఫూర్తికరంగా ఉంది. అన్నారు.సింగర్, కంపోజర్ అనుదీప్ దేవ్ మాట్లాడుతూ మన హక్కు హైదరాబాద్ కర్టెన్ రైజర్ సాంగ్ ను కంపోజ్ చేసే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. ఈ పాటను కేవలం రెండు రోజుల్లోనే కంపోజ్ చేశాను. అందుకు నా మ్యూజిక్ టీమ్ ఎంతో సపోర్ట్ చేసింది. వారందిరికీ థ్యాంక్స్. ఈ పాట ద్వారా మరికొంత మంది ఇన్స్ పైర్ అయితే అదే ఎంతో సంతృప్తినిస్తుంది. అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ కోటి మాట్లాడుతూ హక్కు ఇనిషేటివ్ గురించి ఇక్కడికి వచ్చిన వాళ్లు మాట్లాడుతుంటే తెలుసుకున్నా. సామాజిక చైతన్యాన్ని పంచే ఎన్నో గొప్ప




కార్యక్రమాలు ఈ సంస్థ చేయడం హ్యాపీగా ఉంది. ఇది మన నగరం. మన ఇంటిని ఎలా శుభ్రంగా, బాగా ఉండేలా చూసుకుంటామో అలాగే మన నగరం బాగుండేలా చూసుకోవాలి. ఆ బాధ్యత మనందరి మీదా ఉంది. మన హక్కు హైదరాబాద్ చర్చా కార్యక్రమంలో పెద్ద ఎత్తున పౌరులు పాల్గొనాలి. ఈ స్ఫూర్తిని మనమంతా తీసుకోవాలని కోరుతున్నా అన్నారు.హక్కు ఇనేషేటివ్ డైరెక్టర్స్ రాహుల్ హేమ్నాజీ, అనూజ్ పార్థి, సంస్థ ప్రతినిధి వివేకానంద్, మాట్లాడుతూ ఈ రోజు మన హక్కు హైదరాబాద్ కర్టెన్ రైజర్ ప్రచార గీతం విడుదల కార్యక్రమంలో పాల్గొన్న కోటి గారికి, ఇతర అతిథులకు థ్యాంక్స్. మా సంస్థ ద్వారా మాన్ సూన్ ప్రిపరెడ్నెస్, శానిటేషన్ వారియర్స్, సిటిజన్ సేఫ్టీ వంటి ఎన్నో సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ నెల 14న హైదరాబాద్ ఫిలినగర్ క్లబ్ లో వై డిమాలిషన్స్ ఇన్ హైదరాబాద్ టాపిక్ మీద చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఆ చర్చలో మీరంతా పాల్గొనాల్సిందిగా, మంచి ప్రచారం కల్పించాల్సిందిగా రిక్వెస్ట్ చేస్తున్నాం. అన్నారు.హక్కు ఇనిషియేటివ్ సంస్థ ప్రతినిధి వివేకానంద్ మాట్లాడుతూ మన హక్కు హైదరాబాద్ కార్యక్రమాన్ని, ప్రజలందరికీ చేరువ చేసి దీనిలో అందరూ భాగస్వాములు అవ్వాలని, ప్రచార గీతం నచ్చిన వాళ్ళందరూ తప్పకుండా అందరికీ పంపించాలని, 9240023000 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలని తెలియజేశారు. సోషల్ మీడియా ద్వారా మన హక్కు హైదరాబాద్ ని మన బాధ్యతగా ప్రజలందరికీ తీసుకువెళ్లాలని కోరారు.

---

## రాజకీయ ప్రయోజనంగా వెనుకబాటుతనం

**కులం పేరుతో రాజకీయాలపై నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు**



**ఢిల్లీ:** కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కులం పేరుతో ఎన్నికల్లో గెలిచే వారు తమ వర్గానికి ఏమీ చేయరని, పైగా.. తమ కుటుంబ సభ్యులనే ఎన్నికల్లో పోటీకి దింపేందుకు టిక్కెట్లు అడుగుతుంటారని వ్యాఖ్యానించారు. టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా ఎకనామిక్ కాంక్లేవ్‌లో ఈ అంశంపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. ''నేటి రాజకీయాల్లో సమస్య ఏంటంటే.. వెనుకబాటుతనం అనేది రాజకీయ ప్రయోజనంగా మారింది. అందుకే ప్రతిఒక్కరూ తాను వెనుకబాటుతో ఉన్నానని నిరూపించుకోవాలని చూస్తున్నారు. చేసిన పనిని చూపించడానికి లేనివారే.. కులం పేరుతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ''ఎవరైనా కులం పేరుతో ఎన్నికల్లో గెలిచి.. తన సామాజిక వర్గం సంక్షేమానికి కృషిచేశారా? ఒక్క ఉదాహరణ చెప్పండి. తీరా ఎన్నికయ్యాక వారు తమ భార్య, పిల్లలకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్లు అడుగుతుంటారు. రాజకీయ పార్టీలు పేద ప్రజలు, యువత, రైతులు, మహిళల సంక్షేమం కోసం కృషి చేయాలి. భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి. ఎన్నికల ప్రచారం సందర్భంలో నేనెప్పుడూ కులం గురించి ప్రస్తావించలేదు. రాజకీయాలు నా వృత్తి కాదు.. ఇది సామాజిక ఆర్థిక సంస్కరణలకు సాధనం. సామాజిక సేవ, బాగా పని చేయడ ద్వారానే ప్రజల మనసుల్ని గెలుచుకోగలమనేది నా నమ్మకం. కుల రాజకీయాలను ఆశ్రయించకుండా నా విశ్వాసం మేరకు నడుచుకుంటాను తప్ప వాటి జోలికి వెళ్లను'' అన్నారు.

## టెక్‌బాల్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు తొలి పతకం



**వియత్నాం:** వియత్నాంలో జరిగిన టెక్‌బాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ 2024లో భారత్ తొలి పతకంతో మెరిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో భారత అథ్లెట్లు అనస్ బేగ్, డెక్లాన్ గొంజాల్వెస్ జోడీ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఇటీవల జరిగిన ఈ పోటీల్లో భాగంగా క్వార్టర్ ఫైనల్స్‌లో ఉక్రెయిన్ జోడీతో తలపడిన ఈ ద్వయం అద్భుత ప్రదర్శన ఇచ్చింది. 2-1తో ఉక్రెయిన్‌ను ఓడించి కాంస్య పతకాన్ని ఖాయం చేసుకొని.. మరింత ఉత్సాహంతో సెమీ ఫైనల్‌లో పటిష్ఠమైన థాయిలాండ్ జోడీతో తలపడినప్పటికీ పరాజయం పాలైంది. దీంతో టెక్‌బాల్‌లో పతకం సాధించిన 11వ దేశంగా భారత్ నిలిచింది.వియత్నాం తొలిసారి నిర్వహించిన టెక్‌బాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఐదు విభిన్న విభాగాల్లో 95 దేశాల నుంచి 221 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్, పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. పాయింట్ల పట్టికలో థాయిలాండ్ ఐదు పతకాలతో అగ్రస్థానంలో నిలివగా.. భారత్ కాంస్యం కొల్లగొట్టింది.

## సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఫైనల్‌కు చేరిన మధ్యప్రదేశ్




**బెంగళూరు:** సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ ఫైనల్ చేరింది. ఢిల్లీతో జరిగిన రెండో సెమీస్‌లో ఆ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 5 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. ఆ తర్వాత లక్ష్యాన్ని మధ్యప్రదేశ్ 15.4 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆ జట్టు కెప్టెన్ రజత్ పటిదార్ 66 పరుగులతో అద్భుత ప్రదర్శన చేశాడు.సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇప్పటికే ముంబయి ఫైనల్‌కు చేరింది. డిసెంబర్ 15న బెంగళూరు వేదికగా ముంబయి, మధ్యప్రదేశ్ మధ్య ఫైనల్ జరగనుంది.

## ఇప్పుడు కష్టమే.. ఇక ఆ రెండు టోర్నీలపైనే షమీ దృష్టి!



**ముంబయి:** ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య మూడో టెస్టు శనివారం నుంచి ప్రారంభం కానుంది. టీమ్‌ఇండియా స్టార్ పేసర్ షమీ ఇప్పటికే ఆసీస్‌కు చేరాల్సి ఉంది. కానీ, అతడి మోకాలిలో వాపు కనిపించినట్లు మేనేజ్‌మెంట్ తెలిపింది. దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్నప్పటికీ.. పూర్తి స్థాయి ఫిట్‌నెస్ మాత్రం సాధించలేదని సమాచారం. కనీసం చివరి రెండు టెస్టుల్లోనైనా జట్టుతోపాటు చేరతాడని భావించిన అభిమానులకు తాజా పరిణామాలు నిరాశనే మిగిల్చాయి. షమీ కూడా ఆస్ట్రేలియా ఫ్లైట్ ఎక్కడంపై ఆశలు వదులుకున్నాడని.. వచ్చే ఏడాది జరగబోయే ఛాంపియన్స్ ట్రోఫీతోపాటు ఐపీఎల్ లక్ష్యంగా సన్నద్ధమవుతున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. గాయం కారణంగా గత ఐపీఎల్ సీజన్‌కూ షమీ దూరమైన సంగతి తెలిసిందే. ఇటీవల ముగిసిన ఐపీఎల్ మెగా వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.10 కోట్లు వెచ్చించి షమీని తీసుకుంది. ''షమీ మోకాలి గాయం కారణంగా వాపు వస్తూ పోతోంది. మరోవైపు అతడు దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని ఆసక్తితో ఉన్నాడు. ఆస్ట్రేలియాకు వెళ్లడం దాదాపు కష్టమే. డిసెంబర్ 21 నుంచి మొదలయ్యే విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ తరఫున బరిలోకి దిగాలని భావిస్తున్నాడు. తన ఫామ్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఒక్కో మ్యాచ్‌లో కనీసం 10 ఓవర్ల చొప్పున వేయాలి. ఇప్పుడు షమీ కెరీర్ కూడా చివరి దశలో ఉంది. ఆస్ట్రేలియాకు వెళ్లినా సుదీర్ఘమైన స్పెల్‌లు వేయడం కష్టమే. అతడి మోకాలు అందుకు సహకరిస్తుందో లేదో చెప్పలేం. ఆసీస్ మైదానాలన్నీ చాలా గట్టిగా ఉంటాయి. గత ఐపీఎల్ సీజన్‌ను కూడా మోకాలి సర్జరీతో మిస్ అయ్యాడు. మెగా వేలంలో రూ. 10 కోట్లు పెట్టి ఎస్ఆర్‌హెచ్ తీసుకుంది. దీంతో సుదీర్ఘ ఫార్మాట్‌కు బదులు పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడాలని నిర్ణయించుకున్నా అతడిని తప్పుబట్టేందుకు అవకాశం లేదు'' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో షమీ 9 మ్యాచులు ఆడాడు. మొత్తం 11 వికెట్లు తీశాడు. ఎకానమీ (7.85) కూడా బాగానే ఉంది. బ్యాటింగ్‌లోనూ ఓ మ్యాచ్‌లో 17 బంతుల్లోనే 32 పరుగులు రాబట్టాడు. బెంగాల్ క్వార్టర్స్‌కు చేరుకోవడంలో కీలక పాత్రే పోషించాడు. అయితే, మోకాలిలో వాపు వచ్చినట్లు కథనాలు వస్తున్నా.. షమీ మాత్రం నాలుగు ఓవర్ల కోటా వేయడంలో పెద్దగా ఇబ్బంది పడిన దాఖలాలు లేవు.



## మాకు ఇది 3 టెస్టుల సిరీస్ శుభ్‌మన్ గిల్

**బ్రిస్బేన్:** బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో భారత్ బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్టుకు సిద్ధమవుతోంది. ఇరు జట్లూ చెరొక విజయంతో సమంగా నిలిచాయి. తొలి మ్యాచ్‌లో 295 పరుగుల తేడాతో భారత్ గెలవగా.. రెండో టెస్టులో (గులాబీ బంతి) 10 వికెట్ల తేడాతో ఆసీస్ విజయం సాధించింది. గబ్బా టెస్టు నేపథ్యంలో శుభ్‌మన్ గిల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. తాము తాజాగా సిరీస్‌ను ప్రారంభిస్తామని.. ఇక నుంచి మూడు టెస్టుల సిరీస్‌గా భావించి ఆడతామన్నాడు. అలాగే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు అభినందనలు తెలిపాడు.''భారత శిబిరంలో అంతా బాగుంది. జట్టంతా కూర్చుని డిన్నర్ చేశాం. ఎంతో సరదాగా గడిపాం. అడిలైడ్‌లో మేం అనుకున్నట్లు ఫలితం రాలేదు. అందుకు మరీ ఆందోళన పడటం లేదు. ఇక నుంచి మేం మూడు టెస్టుల సిరీస్‌గా భావించి ఆడతాం. ఈ మ్యాచ్‌లో మేం గెలిస్తే.. మెల్‌బోర్న్, సిడ్నీలోనూ పైచేయి సాధిస్తాం. గత సిరీస్‌లోనూ అడిలైడ్‌లో మాకు ఓటమి ఎదురైంది. కానీ, ఆ తర్వాత మ్యాచుల్లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకున్నాం. ఇప్పుడూ అదే పాజిటివ్ దృక్పథంతో బరిలోకి దిగుతున్నాం. గబ్బాలో మేం మెరుగైన ఆటతీరు ప్రదర్శించిన చరిత్ర ఉంది. మైదానమంతా కలియతిరిగాం. గొప్ప జ్ఞాపకాలు ఉన్నాయి. ఇక్కడ పిచ్ కూడా బాగుటుంది'' అని గిల్ వెల్లడించాడు.

**కంగ్రాట్స్ గుకేశ్..**

''ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు కంగ్రాట్స్. భారత జట్టు నుంచి అతడికి అభినందనలు చెబుతున్నాం. పిన్న వయసులోనే అరుదైన ఫీట్‌ను సాధించడం దేశానికే గర్వకారణం'' అని గిల్ ప్రశంసించాడు. ఐసీసీ అధ్యక్షుడు జై షా స్పందిస్తూ.. ''కంగ్రాట్స్ గుకేశ్. దేశం గర్వపడేలా చేశావు. భవిష్యత్తులోనూ మరిన్ని ఘనతలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా'' అని పోస్టు పెట్టారు.

## యువ ఛాంపియన్ గుకేశ్‌కు తమిళనాడు సీఎం రూ. 5 కోట్ల నజరానా



**చెన్నై:** చిన్న వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన భారత ఆటగాడు డి గుకేశ్‌పై (D Gukesh) సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భారీ నజరానా ప్రకటించారు. వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో డిగ్ లిరెన్‌పై గుకేశ్ అద్భుత విజయం సాధించడంపై స్టాలిన్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.5 కోట్ల ప్రైజ్‌మనీని అందిస్తున్నట్లు వెల్లడించారు. ''గుకేశ్ సాధించిన అద్భుత విజయాన్ని మనం గౌరవించాలి. అతి పిన్న వయస్కుడైన ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సంతోషంలో అతడికి రూ.5 కోట్ల ప్రైజ్ మనీని ప్రకటిస్తున్నా. జాతి గర్వపడేలా చేసిన అతడికి నా ప్రత్యేక అభినందనలు. మున్ముందూ మరిన్ని ఘనతలు సాధించాలని కోరుకుంటున్నా. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షిస్తున్నా'' అని స్టాలిన్ పోస్టు చేశారు.

**గుకేశ్ నికర విలువ మూడింతలు**

ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన దొమ్మరాజు గుకేశ్‌కు ట్రోఫీతో పాటు రూ.11.45 కోట్ల నగదు బహుమతి దక్కింది. దీంతో అతడి నికర విలువ రూ.8.26 కోట్ల నుంచి రూ. 21 కోట్లకు పెరిగింది. చెస్ ద్వారా అతడి ఆదాయం దాదాపు మూడు రెట్లు పెరిగినట్లైందని ఔట్‌లుక్ పేర్కొంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా నిలిచిన లిరెన్ రూ.9.75 కోట్లు గెలుచుకున్నాడు. ఈ ఛాంపియన్‌షిప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ.21.17 కోట్లు. ఒక గేమ్ గెలిచిన ప్లేయర్‌కి రూ.1.69 కోట్లు లభిస్తాయి. మూడు గేమ్‌లు నెగ్గిన గుకేశ్‌కు రూ.5.07 కోట్లు.. రెండు గెలిచిన లిరెన్‌కు రూ.3.38 కోట్లు దక్కాయి. మిగిలిన ప్రైజ్‌మనీని సమానంగా పంచారు.

# పాక్‌కు షాక్ మీద షాక్

### మొన్న గ్యారీ కిరిస్టెన్.. ఇప్పుడు జాసన్ గిలెస్పీ

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి కోచ్‌ల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవలే కోచింగ్ బాధ్యతల నుంచి గ్యారీ కిరిస్టెన్ వైదొలిగిన సంగతి తెలిసిందే. తాజాగా జాసన్ గిలెస్పీ కూడా గుడ్‌బై చెప్పేశాడు. అతడి పదవీకాలం 2026 వరకు ఉంది. కానీ, ఈలోగానే వైదొలగడం గమనార్హం. కిరిస్టెన్ వెళ్లిపోయిన తర్వాత ప్రధాన కోచ్‌గా గిలెస్పీనే పాక్ క్రికెట్ బోర్డు నియమించింది. కానీ, దక్షిణాఫ్రికాతో డిసెంబర్ 26 నుంచి టెస్టు సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గిలెస్పీ స్థానంలో ఆకిబ్ జావెద్‌కు తాత్కాలికంగా కోచింగ్ బాధ్యతలు అప్పగించింది. కోచింగ్ బృందం నుంచి టిమ్ నీల్సన్‌ను తప్పించడంపై గిలెస్పీ అసహనం వ్యక్తం చేశాడని.. పాక్ బోర్డు తీరుతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జట్టు ఎంపికలో గిలెస్పీ కలుగజేసుకోవడం వల్లే పీసీబీ అతన్ని తప్పించిందనే వాదనా ఉంది.

**గ్యారీ కిరిస్టెన్ విషయంలోనూ..**

పరిమిత ఓవర్ల క్రికెట్ కోచ్‌గా గ్యారీ కిరిస్టెన్ రెండేళ్ల కాంట్రాక్ట్‌పై వచ్చాడు. కానీ, 2024 టీ20 ప్రపంచకప్‌లో పాక్ ప్రదర్శన దారుణంగా ఉండటంతో కిరిస్టెన్‌పై పీసీబీ అసంతృప్తి వ్యక్తంచేసింది. బోర్డులోని పలువురితో విభేదాల కారణంగా కిరిస్టెన్ తన పదవికి రాజీనామా చేశాడు. ఆ తర్వాత గిలెస్పీకి పరిమిత ఓవర్ల క్రికెట్ కోచింగ్ బాధ్యతలను అప్పగించింది. అప్పుడే, ఆకిబ్ జావెద్‌ను తీసుకురావాలని బోర్డులోని కొందరు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు గిలెస్పీ స్థానంలో ఆకిబ్‌కే బాధ్యతలు అప్పగించడం గమనార్హం. జట్టు ఎంపికకు సంబంధించి పూర్తి అధికారాలను ఆకిబ్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది.

**బాబర్ కేసు విచారణ వాయిదా..**

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజామ్‌పై లైంగిక ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అతడిపై కేసు కూడా నమోదైంది. అయితే, ఈ విచారణను లాహోర్ హైకోర్టు వాయిదా వేసింది. డిసెంబర్ 16 వరకు ఎలాంటి విచారణ చేపట్టమని పేర్కొంది. బాబర్‌తో రిలేషన్‌లో ఉన్నానని.. వివాహం చేసుకుంటానని ప్రామిస్ చేసి తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఓ మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో బాబర్ అజామ్ సీనియర్ లాయర్ కోర్టుకు హాజరుకాలేదు. జూనియర్ లాయర్ విజ్ఞప్తి మేరకు హైకోర్టు వాయిదా వేసింది. ప్రస్తుతం బాబర్ అజామ్ టీ20 సిరీస్ కోసం దక్షిణాఫ్రికాలో ఉన్నాడు.



## సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించిన అంబుజా సిమెంట్స్

**ఖావ్డా:** సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్ కంపెనీ అయిన అంబుజా సిమెంట్స్..గుజరాత్ ఖావ్డాలోని తన 200 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసి విద్యుత్ పంపిణీని ప్రారంభించిందని కంపెనీ ఒక ఫైలింగ్‌లో తెలిపింది. 1 గిగావాట్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులో భాగంగా దీన్ని ముందుగా ప్రారంభించింది. పవన, సౌర ప్రాజెక్టులతో సహా మిగిలిన 806 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుల్లో ఉత్పత్తి, సరఫరా 2025 మార్చి-జూన్ మధ్య దశలవారీగా ప్రారంభమవుతుందని కంపెనీ పేర్కొంది. ఖావ్డా నుంచి 156 మెగావాట్ల పవన విద్యుత్తు, రాజస్థాన్ నుంచి మరో 300 మెగావాట్ల సౌర విద్యుత్ దశలవారీగా 2025, మార్చి నాటికి పంపిణీ చేస్తామని కంపెనీ పేర్కొంది. మిగిలిన 350 మెగావాట్ల సౌర విద్యుత్తు సరఫరాను 2025 జూన్ నాటికి ప్రారంభించాలని కంపెనీ భావిస్తోంది.



## ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ 2026.. గుకేశ్ ప్రత్యర్థిని తేల్చే 'క్యాండిడేట్స్' టోర్నీ!



**ముంబయి:** ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేతగా డి గుకేశ్ నిలిచాడు. మరి 2026లో జరగబోయే ఎడిషన్‌లో గుకేశ్‌ను ఢీకొట్టేదెవరు? అనే ప్రశ్న రావడం సహజమే. ఇది తెలియాలంటే మాత్రం వేచి ఉండాల్సిందే. అందుకు కారణం అదో సుదీర్ఘ ప్రక్రియ. ఆ ఏడాది జరగబోయే కాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచే ప్లేయర్‌తోనే గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ కోసం బరిలోకి దిగుతాడు. మరి అలాంటి కాండిడేట్స్ టోర్నీ కోసం 8 మంది అర్హత సాధించాల్సి ఉంటుంది. అదీనూ దాదాపు రెండేళ్లపాటు నిలకడైన ప్రదర్శన చేయాలి. ఈ టోర్నీలో ఆడాలన్నా కొన్ని నిబంధనలు ఉన్నాయి. మొత్తం ఎనిమిది మందిని వివిధ కేటగిరీల నుంచి ఎంపిక చేస్తారు. అర్హత సాధిస్తేనే ప్లేస్ ఖరారు అవుతుంది. అదెలాగో చూద్దాం. 2024 ఫిడే సర్క్యూట్ (డిసెంబర్ 28 2023 నుంచి డిసెంబర్ 31 2024)లో టాప్‌లో నిలిచిన ప్లేయర్‌కు అవకాశం. అతడు 2026 క్యాండిడేట్స్ టోర్నీలో ఆడొచ్చు. ఆ సీజన్‌లో జరిగే టోర్నీల్లో మంచి ప్రదర్శన కనబరిచి ఉండాలి.చెస్ వరల్డ్ కప్ 2025 టోర్నీలో టాప్ -3లో నిలిచిన ప్లేయర్లకు క్యాండిడేట్స్ టోర్నీలో ఆడే అవకాశం. ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నమెంట్ - 2025 ఎడిషన్‌లో టాప్ -2 ప్లేయర్లకు ఛాన్స్. ఫిడే సర్క్యూట్ - 2025 సీజన్ విన్నర్‌కు అవకాశం. ఆగస్టు 2025 నుంచి జనవరి 2026 వరకు అత్యధిక రేటింగ్ కలిగిన ప్లేయర్ కూడా క్యాండిడేట్స్ టోర్నీలో ఆడొచ్చు. గతంలో ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ రన్నరప్‌గా నిలిచే ప్లేయర్‌కు ఈ క్యాండిడేట్స్ టోర్నీలోకి నేరుగా ఎంట్రీ ఉండేది. కానీ, ఇప్పుడు ఆ నిబంధనలో ఫిడే మార్పు తీసుకొచ్చింది. అతడు కూడా అర్హత ప్రాసెస్ ప్రకారమే ఎంపికై క్యాండిడేట్స్ టోర్నీలో ఆడాలి.అంటే ఇప్పుడు చెస్ ఛాంపియన్‌షిప్ 2024లో రన్నరప్‌గా డిగ్ లిరెన్ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించి బరిలోకి దిగాల్సిందే. ఇక క్యాండిడేట్స్ టోర్నీ 2026 విజేతతో గుకేశ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ 2026 పోరులో తలపడతాడు.

PMC By
TATA PROJECTS
Marketed By
South Icon Group
RICHMOND
LIVING SPACES
at ISNAPUR, (Patancheruvu)
COMING SOON....
A life worthy to be called
Your Life



Project Highlights
Grand Club House | Half Basketball Court | Tennis Court | Badminton Court
Infinity Swimming Pool | Party Lawn | Kids Play Area | Business Lounge
Spa And Saloon | Super Market | ATM Centre | Gym | Conference Rooms
Banquet Hall | Jogging Track | Cricket Net | Open Amphitheater | Traffic Free Podium
Reading Lounge | Box Cricket | Creche Area For Kids | Squah Court
Skating Rink | Guest Rooms | Pool View Sundeck
For Offers and more details Contact
9652167668

## విఘ్నేశ్‌తో ఉన్న ఫొటోలు షేర్ చేయకపోవడానికి కారణమిదే



నయనతార

ఇండస్ట్రీలో అందమైన జోడీల్లో నయనతార- విఘ్నేశ్ శివన్‌ల జంట ఒకటి. వీరిద్దరూ ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ సందర్భం వచ్చినప్పుడల్లా పరస్పరం ప్రేమను వ్యక్తపరుచుకుంటూ ఉంటారు. అయితే కొన్ని రోజులుగా విఘ్నేశ్‌తో దిగిన ఫొటోలను నయనతార పంచుకోవడం తగ్గించేశారు. దీనిపై రకరకాల కామెంట్స్ వినిపించాయి. తాజాగా నయన్ దీనికి కారణాన్ని వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే నెగెటివ్ కామెంట్స్ వల్లే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నయన్ ఈ విషయంపై స్పందించారు. ''విఘ్నేశ్ నా జీవితంలోకి వచ్చాక ఎంతో ఆనందంగా ఉన్నాను. ఇదే మాట నేను ఈ ఇంటర్వ్యూలో చెబితే.. ఈ వీడియో కింద అన్నీ నెగెటివ్ కామెంట్సే ఉంటాయి. 'ఓ మై గాడ్.. ఈమె మళ్లీ పొగడడం ప్రారంభించింది' అని అందరూ బ్యాడ్ కామెంట్స్ పెడతారు. వీటి కారణంగానే నేను విఘ్నేశ్ గురించి ఓపెన్‌గా చెప్పలేని స్థితికి చేరుకున్నాను. తను నాతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయడం మానేశాను. షూటింగ్ కోసం విదేశాలకు వెళ్లినప్పుడు తనని నిజంగా మిస్ అవుతాను. ఆ సమయంలో మాత్రమే ఫొటోలు షేర్ చేస్తున్నాను'' అని చెప్పారు.ఇక విఘ్నేశ్‌ను పెళ్లి చేసుకున్నప్పుడు కూడా కొందరు నెగెటివ్ కామెంట్స్ చేశారని నయనతార తెలిపారు. 'కొందరు విఘ్నేశ్‌ను ద్వేషించడమే పనిగా పెట్టుకున్నారు. బహుశా అతడు తీసిన సినిమాలు బ్లాక్ బస్టర్‌లు కాకపోవడం వల్లనో లేదంటే నేను అప్పటికే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందడం వల్లనో.. కారణం ఏదైనా నన్ను విఘ్నేశ్‌తో పోలుస్తూ.. అతడిని నిందించడం అన్యాయం. ఒకవేళ తన స్థానంలో నేను ఉంటే ఇలానే నిందిస్తారా? అని ఎప్పుడూ అనుకుంటూ ఉంటాను' అని అన్నారు . నయనతార-విఘ్నేశ్ శివన్ ఏడేళ్లు ప్రేమలో ఉన్న తర్వాత 2021లో వీళ్ల ప్రేమను మీడియా ముందు చెప్పారు. 2022 జూన్ 9న వివాహబంధంలోకి అడుగుపెట్టారు. వీళ్లకు ఉయిర్, ఉలగమ్ అనే ట్విన్స్ ఉన్నారు.

## రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో మర్దానీ3



రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా రూపొందిస్తున్న 'మర్దానీ3' అనౌన్స్‌మెంట్. రాణి ముఖర్జీ ప్రధాన పాత్రలో యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందిన బ్లాక్ బస్టర్ చిత్రం 'మర్దానీ'. ఈ సినిమా విడుదలై 10 ఏళ్లు అవుతుంది. 2014లో ఈ చిత్రం విడుదలైంది. 2019లో దీనికి సీక్వెల్‌ను రూపొందించారు. ఈ రెండు చిత్రాలు సూపర్ హిట్ చిత్రాలుగా బాక్సాఫీస్ దగ్గర రాణించాయి. అలాగే ఈ సినిమాలకంటూ ఓ ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ కూడా క్రియేట్ అయ్యింది. మర్దానీ2 రిలీజ్ యానివర్సరీ సందర్భంగా మర్దానీ3కి సంబంధించిన మేకింగ్ వీడియోను యష్‌రాజ్‌ఫిల్మ్స్ విడుదల చేసింది. ఇందులో రాణి ముఖర్జీ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ శివానీ శివాజీ రాయ్ పాత్రలో నటించారు. రాణి ముఖర్జీ గురించి మన ప్రేక్షకులకు ప్రత్యేకమైన పరిచయం అక్కర్లేదు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తోన్న మర్దానీ ఫ్రాంచైజీలను ప్రేక్షకులకు ఎంతో గొప్పగా ఆదరిస్తున్న సంగతి తెలిసిందే.

ఈ సందర్భంగా రాణి ముఖర్జీ మాట్లాడుతూ ''2025 ఏప్రిల్ నుంచి మర్దానీ3 చిత్రానికి సంబంధించిన షూటింగ్‌ను ప్రారంభించబోతున్నామని తెలియజేయటానికి ఎంతో సంతోషంగా ఉంది. పోలీస్ డ్రెస్ వేసుకుని ఓ అద్భుతమైన పాత్రను చేయటం నాకెప్పుడూ ప్రత్యేకమనే చెప్పాలి. ఈ పాత్రను చేయటం ద్వారా మీ నుంచి నాకు అపరిమితమైన ప్రేమాభిమానాలు లభించాయి. మర్దానీ3 సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తుండటం ఎంతో గర్వంగా ఉంది. మనల్ని కంటికి రెప్పలా కాపాడుతూ, డ్యూటీలో ప్రాణ త్యాగానికి సైతం వెనుకాడని ధైర్యవంతులైన పోలీస్ ఆఫీసర్స్‌కి ఈ సినిమా అంకితం. గత ఫ్రాంచైజీలను మించేలా మర్దానీ3లో గూజ్ బమ్స్ తెప్పించే గొప్ప సన్నివేశాలున్నాయి '' అన్నారు. మర్దానీ గత ఫ్రాంచైజీలు ఎంతో పెద్ద హిట్స్‌గా నిలిచాయో అందరికీ తెలిసిందే. వాటిని మించేలా స్క్రిప్ట్ ఉండాలని వెయిట్ చేసి మర్దానీ3ని స్టార్ట్ చేస్తున్నాం. అది మా బాధ్యత. ఈ ఫ్రాంచైజీపై అంచనాలుంటాయి. వాటిని అందుకునేలా సినిమా ఉండాలి. అలాగే డార్క్, ప్రేక్షకులు ఆశ్చర్యపోయే అంశాలతో మర్దానీ ఉంటుంది. నాకు ఎంతో ఎగ్జయిటింగ్‌గా ఉంది. ఆడియెన్స్ కూడా రేపు సినిమాను థియేటర్స్‌లో చూసి అంతే ఎగ్జయిట్‌మెంట్ ఫీల్ అవుతారని భావిస్తున్నాను. మర్దానీ3 కోసం ఆదిత్య చోప్రా రెండు ప్రతిభావంతులైన టీమ్స్‌ను ఒక్కటిగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. అవే డైరెక్షన్ టీమ్, రైటింగ్ టీమ్. ఈ ఫ్రాంచైజీ వారసత్వాన్ని వీరు ముందుకు తీసుకెళతారని ఆయన భావిస్తున్నారు. రైల్వే మెన్ ఫేమ్ ఆయుష్ గుప్తా మర్దానీ3 స్క్రిప్ట్‌ను అందించారు. రైల్వే మెన్‌తో పరిచయం అయిన ఆయుష్.. స్క్రీన్ ప్లే, స్టోరీ రైటింగ్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. సినిమాకు ఘన విజయాన్ని దక్కించుకుంది. ఇండియాలో బెస్ట్ సిరీస్‌గా ఇది పేరు తెచ్చుకుంది.

యష్ రాజ్ ఫిల్మ్స్‌కు సంబంధించిన అభిరాజ్ మినవాలా, మర్దానీ3 చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. బ్యాండ్ బాజా భారత్, గూండే, సుల్తాన్, జబ్ తక్ హై జాన్, టైగర్3 చిత్రాలకు అభిరాజ్ అసిస్టెంట్‌గా వర్క్ చేశారు. ప్రస్తుతం ఇదే బ్యానర్‌లో రూపొందుతోన్న వార్2 చిత్రానికి ఆయన అసోసియేట్ డైరెక్టర్‌గానూ వర్క్ చేస్తున్నారు. ఇప్పుడు మర్దానీ3ని తెరకెక్కించబోతున్నారు.



## గర్వించాల్సిన విషయం కాదు

### గూగుల్ టాప్ 10లో పేరుపై నటి అసంతృప్తి

ముంబయి: గూగుల్‌లో అత్యధికంగా సెర్చ్ చేసిన టాప్ 10 నటీనటుల జాబితాలో తన పేరు ఉండటంపై హిందీ సీరియల్ నటి హీనా ఖాన్ స్పందించారు. సోషల్‌మీడియా వేదికగా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేమీ ఆనందించాల్సిన, సెలబ్రేట్ చేసుకోవాల్సిన విషయం కాదన్నారు.''ఈ ఏడాది గూగుల్ టాప్ 10 సెర్చ్‌లో నా పేరు ఉండటంపై చాలామంది అభినందనలు తెలుపుతున్నారు. సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. నిజం చెప్పాలంటే, నావరకూ ఇది ఏమాత్రం గర్వించదగ్గ విషయం కాదు. నేనేమీ గొప్పగా సాధించలేదు. అనారోగ్య పరిస్థితుల వల్ల ఇలా గూగుల్ మోస్ట్ సెర్చ్‌లో ఉండే పరిస్థితి ఎవరికీ రావొద్దని నేను కోరుకుంటున్నా. నా ప్రయాణంలో ఎంతోమంది ప్రేమాభిమానాలు, ప్రశంసలు పొందాను. అందుకు నేనెప్పుడూ కృతజ్ఞురాలిని. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో నా వర్క్, నేను సాధించిన విజయాల గురించి సెర్చ్ చేసి ఉంటే బాగుండేది'' అని హీనా ఖాన్ తెలిపారు. 'ఏ రిస్తా క్యా కెహ్‌లాతా హై' ధారావాహికతో విశేష ఆదరణ సొంతం చేసుకున్నారు నటి హీనా ఖాన్. బిగ్ బాస్, ఖత్రోన్ కే ఖిలాడీ వంటి రియాల్టీ షోల్లో పాల్గొన్నారు. తాను రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నానని ఈ ఏడాది ఆరంభంలో ఆమె తెలిపారు. ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. తన కుటుంబసభ్యులు, స్నేహితుల సహకారంతో క్యాన్సర్ మహమ్మారితో పోరాటం చేస్తున్నానని తెలిపారు. చికిత్స కొనసాగుతోందని, దీని నుంచి కచ్చితంగా బయటపడగలననే నమ్మకం ఉందని ఆమె ఆన్‌లైన్ వేదికగా చెప్పారు. తన కోసం ప్రార్థిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆనాటి నుంచి తన ఆరోగ్యానికి సంబంధించిన అప్‌డేట్‌లను హీనా ఖాన్ తరచూ ఇన్‌స్టా వేదికగా పంచుకుంటున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా గూగుల్‌లో ఎక్కువగా సెర్చ్ చేసిన తారల జాబితా విడుదల చేసింది. ఇందులో పవన్ కల్యాణ్, హీనా ఖాన్, నమ్రత్ కౌర్, కాట్ విలియమ్స్, ఆడమ్ బ్రాడీ వంటి తారలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

### ఆ సంఘటన తర్వాత అమ్మవాళ్లను

## సెట్‌కు పిలవలేదు

### సందీప్ కిషన్



'రాయన్'తో కోలీవుడ్‌లోనూ విశేష ఆదరణ సొంతం చేసుకున్నారు నటుడు సందీప్ కిషన్ . ప్రస్తుతం టాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్‌లోనూ వరుస సినిమాలు చేస్తున్న ఆయన తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న సవాళ్లు, ఇబ్బందుల గురించి మాట్లాడారు. సినిమాల్లోకి అడుగుపెడతానని తొలిసారి ఇంట్లోవాళ్లకు చెప్పినప్పుడు వారంతా ఆశ్చర్యపోయారని అన్నారు. తన నిర్ణయాన్ని మొదట్లో అంగీకరించలేదని చెప్పారు.

''మాది ఎగువ మధ్యతరగతి కుటుంబం. నేను ఎంబీఏ చదువుకున్నా. కాలేజీలో ఉన్నప్పుడు సినిమాలు ఎక్కువగా చూసేవాడిని. నటుడిని కావాలనుకున్నప్పుడు కుటుంబసభ్యులు మొదట అంగీకరించలేదు. తర్వాత నా ఇష్టాన్ని అర్థం చేసుకున్నారు. అమ్మ ఇచ్చిన రూ.25 వేలతో ఫొటోషూట్ చేయించా. ఆ తర్వాత ఆడిషన్స్ వేటలో పడ్డా. తమిళం, తెలుగు ద్విభాషా చిత్రంలో నటుడిగా అవకాశం వచ్చింది. కొన్ని రోజుల షూట్ తర్వాత అది ఆగిపోయింది. దర్శకుడు గౌతమ్ మేనన్ వద్ద అసిస్టెంట్ దర్శకుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టా. అదే సమయంలో 'భద్ర' తమిళంలో రీమేక్ చేస్తున్నారని తెలిసి.. చిన్న రోల్ వచ్చినా చేద్దామని ఆడిషన్స్‌కు వెళ్లా. అది జరగలేదు. 'హ్యాపీడేస్' ఆడిషన్స్‌కు వెళ్లా. వాళ్లకు నేను నచ్చా. కాకపోతే ఆ రోల్‌కు నేను సెట్ కాకపోవడంతో ఆఫర్ రాలేదు. దాదాపు రెండేళ్లపాటు ఆడిషన్స్.. అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయేవి. అలాంటి సమయంలో 'ప్రస్థానం' వచ్చింది'' అని సందీప్ తెలిపారు. ''నాకు ఆత్మాభిమానం ఎక్కువ. నన్ను ఎవరైనా తక్కువ చేసి మాట్లాడితే నాకు వెంటనే కోపం వచ్చేస్తుంది. 'స్నేహగీతం' సినిమా షూట్‌కు మా నాన్న వచ్చారు. అందరూ కలిసి భోజనం చేస్తున్నప్పుడు నాన్న ప్లేట్‌లో చికెన్ అయిపోయింది. సర్వ్ చేస్తున్న వ్యక్తిని పిలిచి.. చికెన్ వేయమని అడిగా. దానికి అతడు గిన్నె చూపించి.. 'ఇదే ఉంది అందరూ తినాలి' అన్నాడు. ఆ మాట నన్ను ఇబ్బందిపెట్టింది. ఆ తర్వాత నుంచి అమ్మవాళ్లను ఎప్పుడూ నా సినిమా సెట్‌కు పిలవలేదు. ఒకవేళ వాళ్లు నాకు చెప్పకుండా వస్తే.. సుమారు 15 నిమిషాల్లో అక్కడినుంచి పంపించి వేస్తాను'' అని సందీప్ అన్నారు.



### వెంకటేశ్ బర్త్ డే సందర్భంగా

## సంక్రాంతికి వస్తున్నాం

**సెకండ్ సింగిల్ మీను ప్రోమో రిలీజ్**

విక్టరీ వెంకటేష్ చాలా సినిమాల్లో పోలీసు పాత్రలు పోషించినప్పటికీ ఆయన హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం' లో క్యారెక్టర్ చాలా డిఫరెంట్ గా ఉంటుంది. సినిమాలోని మేజర్ పార్ట్ ఎక్స్ పోలీసుగా, ఫ్యామిలీ మ్యాన్ గా కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై బ్లాక్‌బస్టర్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఫస్ట్ సింగిల్ గోదారి గట్టు బ్లాక్ బస్టర్ గా నిలిచింది. శుక్రవారం వెంకటేష్ పుట్టినరోజు సందర్భంగా, మేకర్స్ సెకండ్ సింగిల్- మీను ప్రోమో రిలీజ్ చేశారు. ప్రోమోలో వెంకటేష్ తన ఎక్స్ లవర్ మీను (మీనాక్షి చౌదరి) ని సరదాగా ఆటపట్టిస్తూ, అతని భార్య (ఐశ్వర్య రాజేష్) కూడా ఉల్లాసంగా ఉండే ఇంటి వేడుకను ప్రజెంట్ చేసింది. వెంకటేష్, ఐశ్వర్య రాజేష్ ఇద్దరూ సాంప్రదాయ దుస్తులలో కనిపిస్తుండగా, మీనాక్షి ట్రెండీ ఎటైర్ కనిపిస్తుంది. స్టైలిష్ కాప్‌గా వెంకటేష్ అద్భుతమైన ట్రాన్స్ ఫర్మేషన్ ప్రోమోలో వండర్ ఫుల్ మూమెంట్. ఖాకీ యూనిఫామ్‌లో సన్ గ్లాసెస్‌తో ధరించి, వెంకటేష్ క్లాసిక్ కాప్ లుక్ లో కనిపించారు. సీక్వెన్స్‌లోని గ్లింప్స్ కథాంశంలోని బ్రెత్ టేకింగ్ పార్ట్ ని సూచిస్తుంది, అతని డైనమిక్ ప్రజెన్స్ అభిమానులని కట్టిపడేసింది. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ పాట ఫస్ట్ సింగిల్ లాగానే క్యాచీగా ఉంటుందని హామీ ఇచ్చింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సమీర్ రెడ్డి నిర్వహిస్తుండగా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్, తమ్మిరాజు ఎడిటర్. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లేను ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ అందించగా, వి వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. సంక్రాంతికి వస్తున్నాం జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.

**తారాగణం:** వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, VT గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా, చిట్టి

**సాంకేతిక సిబ్బంది:**
**రచన, దర్శకత్వం:** అనిల్ రావిపూడి
**సమర్పణ:** దిల్ రాజు
**బ్యానర్:** శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్
**నిర్మాత:** శిరీష్
**సంగీతం:** భీమ్స్ సిసిరోలియో
**డీవోపీ:** సమీర్ రెడ్డి
**ప్రొడక్షన్ డిజైనర్:** A S ప్రకాష్
**ఎడిటర్:** తమ్మిరాజు
**కో రైటర్స్:** ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ
**యాక్షన్ డైరెక్టర్:** వి వెంకట్
**VFX:** నరేంద్ర లోగిసా
పీఆర్వో: వంశీ-శేఖర్

## మెంటల్ మనదిల్ ఫస్ట్ లుక్ రిలీజ్



సెన్సేషనల్ కంపోజర్- ట్యాలెంటెడ్ యాక్టర్ జివి ప్రకాష్ కుమార్, క్రియేటివ్ ఫిల్మ్ మేకర్స్ సెల్వరాఘవన్ దర్శకత్వంలో కంటెంట్ బేస్డ్ మూవీ 'మెంటల్ మనదిల్'లో హీరోగా నటిస్తున్నారు. సూపర్ స్టార్ ధనుష్ సోషల్ మీడియా ద్వారా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేసి సినిమా గొప్ప విజయం సాధించాలని టీంని విష్ చేశారు. ఈ చిత్రంలో మాధురీ జైన్ హీరోయిన్ గా నటిస్తోంది. ప్రతిభావంతులైన నటీనటులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అరుణ్ రామకృష్ణన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. బాలాజీ ఎడిటర్, ఆర్.కె. విజయ్ మురుగన్ ఆర్ట్ డైరెక్టర్. దినేష్ గుణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ప్యారలల్ యూనివర్స్ ప్రొడక్షన్ హౌస్ కోసం జి వి ప్రకాష్ కుమార్ దీనిని నిర్మిస్తున్నారు. జివి ప్రకాష్ కుమార్ కంటెంట్-డ్రివెన్ హీరోగా ఈ చిత్రం ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. '7G రెయిన్‌బో కాలనీ', 'ఆడవారి మాటలకు అర్థాలే వేరు' లాంటి క్లాసిక్స్ అందించిన సెల్వరాఘవన్ నుంచి వస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు వున్నాయి. సెల్వరాఘవన్, 'ఇసై అరసన్' జివి ప్రకాష్ కుమార్ లది క్రేజీ కొలబారేషన్. 'మెంటల్ మనదిల్' ఫస్ట్ లుక్ అభిమానులు, సినీ వర్గాల్లో అంచనాలను పెంచింది.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం
తెలుగు దినపత్రిక విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com